

సంపుటి : 78 సంచిక : 51 పుటలు : 52

# జాగృతి

కలి 5128 - శ్రీ పరాభవ భాద్రపద బహుళ ఏకాదశి

05-11 అక్టోబర్ 2026

వెల : ₹20/-



# సేవే ధర్మం







జాగృతి చందాను చెల్లించడానికి పక్కనున్న క్యు.ఆర్.కోడ్‌ను మీ మొబైల్‌తో స్కాన్ చేయండి. లేదా https://payit.cc/SYBqNRG267 అని బ్రౌజర్‌లో టైప్ చేయండి.

# మన్‌కీ బాత్‌లో అశోక్ సింఘాల్‌జీ స్మరణ




సెప్టెంబర్ 27న రేడియోలో ప్రసారమైన మన్‌కీ బాత్ కార్యక్రమంలో రామజన్మభూమి ఉద్యమంలో ముఖ్యభూమికను పోషించిన అశోక్ సింఘాల్‌ను ప్రధాని నరేంద్ర మోదీ స్మరించుకున్నారు. "ఈ రోజు సెప్టెంబర్ 27వ తేదీ ఒక ప్రత్యేక కారణం వల్ల మరింత ప్రత్యేకమైంది. సంస్కృతి, సమాజం, దేశం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన ఒక మహనీయుని 100వ జయంతి ఈ రోజు. నేను మాట్లాడుతున్నది విశ్వహిందూ పరిషత్ మాజీ అంతర్జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు, పూజ్యులైన దివంగత అశోక్ సింఘాల్‌జీ గురించి. ఆయన 1926 సెప్టెంబర్ 27వ తేదీన ఆగ్రాలో జన్మించారు. ఆయన ఈ సమాజంలో ఉంటూనే తపస్విలాంటి జీవితాన్ని గడిపారు. రామజన్మభూమి ఉద్యమానికి వారు అందించిన దిశానిర్దేశం, శక్తి ఫలితంగానే ఈ రోజు మనం అయోధ్యలో ఈ భవ్య ఆలయాన్ని చూస్తున్నాం. నేను చాలా అదృష్టవంతుడిని. నేను ఆయన జీవితాన్ని దగ్గరగా చూడటమే కాకుండా ఈ ఉద్యమంలో ఆయనతో పాలుపంచుకునే అవకాశం కూడా పొందాను. రామ మందిరంలో ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొంటున్నప్పుడు కూడా నాకు అశోక్‌జీ పదే పదే గుర్తుకు వచ్చారు. అశోక్‌జీ గురించి ఎక్కువగా చర్చ జరగని విషయాలు ఎన్నో ఉన్నాయి. రామ మందిర ఉద్యమంతో పాటు ఆయన సామాజిక వివక్ష, అసమానతలకు వ్యతిరేకంగా కూడా ఒక పెద్ద పోరాటం చేశారు. ఆయన చాలా సంపన్న కుటుంబంలో జన్మించారు. ఆయన తండ్రి సివిల్ సర్వీస్ అధికారి. ఆయన తోబుట్టువులలో చాలామంది కూడా ఉన్నత పదవులను నిర్వహించారు. ఆయన స్వయంగా ఐఐటి బిహెచ్‌యు నుండి పట్టభద్రులయ్యారు. కానీ, ఇన్ని ఉన్నప్పటికీ ఆయన తన జీవితాన్ని సమాజానికి, సంస్కృతికి అంకితం చేశారు. ఇదే మహనీయుల గొప్ప సుగుణం. ఈ రోజు ఆయన శత జయంతి సందర్భంగా కోట్లాది మంది అభిమానుల తరపున వందనం చేస్తున్నాను. నా హృదయపూర్వక నివాళులు అర్పిస్తున్నాను" అని దేశవాసులను ఉద్దేశించి మోదీ పేర్కొన్నారు.







# పర్యావరణం..

## ఈ సంవత్సరం దీపావళి సంచిక ప్రత్యేకం

- పర్యావరణాన్ని కలుషితం చేస్తున్న మన జీవనశైలి.
- అభివృద్ధి పేరుతో వనరుల దోపిడీ.
- ప్రతిఘటిస్తున్న ప్రకృతి
- నేటి ఎల్‌నినోలకు మనమే కారణం
- నగరాలలో కానరాని పచ్చదనం
- దురాశతో పంచభూతాలు కలుషితం

## పరిష్కారం..

- పర్యావరణ హిత జీవనం దిశగా అడుగులు
- వసుధైక కుటుంబ భావనతో వనరులను పంచుకోవడం
- జల విధానంలో సంప్రదాయపద్ధతులను అనుసరించడం
- పండుగల ద్వారా నదుల,వృక్షాలుసహా ప్రకృతి ఆరాధనను ప్రోత్సహించడం
- చిన్న చర్యల ద్వారా పర్యావరణంపై భారీ ప్రభావం చూపడం ఎలా?

ఇలాంటి మరిన్ని విశేషాలతో 2026 దీపావళి ప్రత్యేక సంచిక రానుందని తెలియజేయుటకు సంతోషిస్తున్నాం. చందాదారులకు ఉచితం. పండుగలు, ఇతర శుభకార్యాలలో బంధుమిత్రులకు గిఫ్ట్‌గా ఇవ్వడానికి ఉపయోగించుకోవచ్చు. కనుక అదనంగా కావలసినవారు త్వరగా బుక్ చేసుకోగలరు.



అదనపు కాపీల కోసం పాఠకులు, ఏజెంట్లు అక్టోబర్ 10లోగా జాగృతి కార్యాలయానికి 9959997013 నంబరుకు ఫోన్ / వాట్సప్‌లో సంప్రదించవచ్చు.

**పేజీలు : సుమారు 300**

**వెల: రూ.200/-**

**త్వరపడండి!**

jagritiweekly.com | facebook.com Jagriti Telugu Weekly | youtube.com/@Jagrititv | 3-4-228/4/1, Kachiguda, Hyderabad-027.

Printed & Published by **Nagol Sreenivas Reddy** on behalf of **Jagriti Prakashan Trust** and printed at Kala Jyothi Process Pvt. Ltd, CFC 1&2, Raviryala, Maheswaram, Rangareddy - 501 359. and published at Jagriti Bhavan, 3-4-228/4/1, Lingampalli, Kachiguda, Hyderabad - 500 027.
**Managing Editor : Kurra Durga Reddy.**

**సర్క్యులేషన్ వివరాలు, ఫిర్యాదులు,**
**వ్యాపార ప్రకటనల వివరాల కోసం**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య ) సంప్రదించండి.**

ఎం. శ్రీనివాస్ : సర్క్యులేషన్ ఇన్‌చార్జ్
**040-27561453 / 9959997013**

**సంపాదక మండలితో సంప్రదింపుల కోసం**
**9959991304**
**(ఉ॥11 నుండి సా॥ 6 గంటల మధ్య )**

డిజైనర్ : చిగుళ్ల కుమార్

## చందాదారులకి గమనిక

చందాలను ఎవ్వరికి వ్యక్తిగతంగా చెల్లించవద్దు. మీ దగ్గరకు వచ్చే బల్క్ మెంబర్లకు (కార్యకర్తలకు) మాత్రమే చెల్లించి రసీదు తీసుకోగలరు. లేదా కింద ఇచ్చిన అకౌంట్ ద్వారా చెల్లించగలరు.

ఫోన్ పే, గూగుల్ పే నుండి చెల్లించడానికి జాగృతి అకౌంట్ "To Bank / UPID" ఆప్షన్ వాడండి.

**Link / QR Code** ద్వారా మీ చందా చెల్లించినప్పుడు **Remarks** దగ్గర కట్టించిన కార్యకర్త పేరు ఫోన్ నెం. తప్పకుండా రాయించండి.

విడి ప్రతి రూ.20

**5 సం॥ల చందా రూ.4000** **సంవత్సర చందా రూ.850**

జాగృతి వారపత్రికను **'మ్యాగజైన్ పోస్ట్'** ద్వారా పొందుటకు: **రూ.1,474 (850+624)**

**బ్యాంకు ఖాతా వివరాలు**

**A/c Name & No. Jagriti Prakashan Trust, 92001006140 5325, Axis Bank, Kothapet Branch.**
**IFSC : UTIB0002157, PAN : AAATJ3829L**

– సర్క్యులేషన్ ఇన్‌చార్జ్, జాగృతి

**భా**షా వైవిధ్యాన్ని కలిగిన దేశం మనది. ఆ వైవిధ్య భారత భాషలను గౌరవించి, గర్వంగా ప్రదర్శించే పెద్ద మనసు భారతీయులది. అదే మన ప్రభుత్వ విధానం కూడా. దేశంలో ఉన్న వందలాది భాషలలో దేని సౌరభం దానిదే. తమ భాషా విశిష్టత గురించి ఆయా భాషా సమూహాలు గర్వపడతాయి. ఆ గర్వం, తమ భాషాభిమానం అంగీకరించాల్సిందే. అయితే ఏ భాషాభిమానం దురభిమానం కాకూడదు. మరో భాష పట్ల వ్యతిరేకం కాకూడదు. దేశ భాషలలో ఏ ఒక్క భాష ఇతర భాషల మీద పెత్తనం చేయదు. ఇతర భాషలను మింగేయదు. భారతీయ భాషలను మింగేస్తున్నది విదేశీ భాష అయిన ఇంగ్లీష్ అనే వాస్తవం మరచిపోయి, స్థానిక భాషల మధ్య చిచ్చుపెట్టే రాజకీయం కొందరు నాయకులు చేస్తున్నారు. అది ప్రమాదకరమన్నదే ఇటీవల సుప్రీంకోర్టు చెప్పిన మాట.

తమిళనాడు ప్రభుత్వం కేంద్రీయ పాఠశాలల ప్రారంభానికి సహకరించటం లేదు. మిగిలిన రాష్ట్రాలన్నీ అనుసరించే త్రిభాషా సూత్రాన్ని తిరస్కరించి, తమిళ ప్రభుత్వాలు ద్విభాషా విధానం ఎంచుకున్నాయి. 'మీ రాష్ట్ర విధానం మీది, కేంద్రీయ విద్యాలయాల విధానం కేంద్రానిది. ఆ రెండింటికి ఘర్షణ అర్థంలేనిది. కాబట్టి ఇప్పటికైనా మీ హిందీ వ్యతిరేక ఆలోచనా ధోరణిని మార్చుకుంటే మంచిది' అన్నారు సుప్రీంకోర్టు న్యాయమూర్తులు. ఏ భాషను బలవంతంగా ఎవరి మీద రుద్దరు. అది ఎవ్వరి విధానం కాదు. కొత్త భాషను అందిపుచ్చుకోవటం అనేది ఐచ్ఛికం మాత్రమే. విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు భాషాపరమైన ఎంపిక హక్కును కల్పించే విధానం కేంద్రం ప్రకటించిన నూతన విద్యావిధానం అంగీకరించింది. కేంద్ర ప్రభుత్వం మీద భాషా పెత్తనం అనే ఆరోపణ చేసే తమిళ రాజకీయ నాయకుల మనసుకు తెలుసు. వారిది అర్థంలేని ఆరోపణ అయినా ఓట్ల రాజకీయం. తమిళనేతల నోటి వెంట పదే పదే అదే మాట, తమిళుల భావోద్వేగాలను రెచ్చగొట్టే యత్నం. తమిళ ప్రజలు నెమ్మదిగా అయినా వాస్తవాన్ని గుర్తించి తీరతారు.

కేంద్ర ప్రభుత్వ నూతన విద్యావిధానం గురించి ప్రధాని నరేంద్రమోదీ, హోం మంత్రి అమిత్ షా పలు సందర్భాలలో చేస్తున్న ప్రకటనలన్నీ అమ్మ భాషను మించిన

**శాలివాహన 1948 శ్రీ పరాభవ భాద్రపద బహుళ ఏకాదశి**

## లోపలి పేజీలలో...




6లో
ముఖపత్ర కథనం
**సేవే ధర్మం**

ధారావాహిక నవల
9 **ఏ వెలుగులకీ ప్రస్థానం ?**
– గన్నవరపు నరసింహ మూర్తి
20లో



కథ
**జాడి ఉపనిషత్**
– గుంటూరి ప్రసాద్
30లో



# జాగృతి

## సంపాదకీయం

భాషలేదు. మాతృభాషలోనే పాఠశాల విద్య కొనసాగాలనే సందేశమిస్తున్నాయి. నూతన విద్యావిధానం ప్రకారం మాతృభాషలో జరిగే బోధన అంతర్జాతీయంగా అంగీకరించబడింది. పిల్లల మనోవికాసానికి మాతృభాషలో బోధనే మేలైనది. విషయాన్ని సులభంగా అర్థం చేసుకుంటారు. వారి మనసు వికసిస్తుంది. మాతృభాష బోధనతో ఆ మేలు అర్థంచేసుకోని కొన్ని పార్టీల ప్రభుత్వాలు ఎల్‌కేజీ నుండే అంతా ఆంగ్లంలో అనే విధానాన్ని బలవంతంగా అమలుచేసే యత్నం జరిగింది. సంపన్నుల పిల్లలు ఆంగ్ల మాధ్యమంలో చదివి లబ్ధి పొందుతుండగా, మాతృభాషను పేదల నెత్తిన బలవంతంగా రుద్దుతున్నారని ఆరోపిస్తూ కొందరు

# అమ్మ భాషకు కేంద్రం పెద్దపీట

సోరోస్ అనుచరులు సామాజిక ఘర్షణ సృష్టించే యత్నం చేసారు. ఇక ముందు చేస్తారు కూడా.

పరభాష ద్వారా విదేశీ మత ప్రవేశం, స్వదేశీ మూలాల ధ్వంసానికి బ్రిటీష్ పాలకులు ప్రయత్నించారు. వారి విధానంతో వచ్చిన మేధో దాస్యం నుండి విముక్తి చెందాలంటే స్వాభిమానం, స్వభాష, స్వశక్తి అనేవి ప్రజల్లోకి తీసుకెళ్లాలి. వికసిత భారత నిర్మాణానికి స్వశక్తి అనే వాటిని మోదీ ప్రభుత్వ నినాదం కాదు, విధానం. మోదీ ప్రభుత్వ స్వాభిమాన విధానం ప్రపంచ దేశాలలో భారత్‌ని ఉన్నత స్థానంలో నిలబెట్టింది. గతంలో మరే ప్రధాని హయాంలో దక్కని విశేష గౌరవం భారత్‌కి మోదీ వల్ల దక్కింది. అంతర్జాతీయ వేదికల మీద భారత నాయకుడికి దక్కుతున్న ప్రాధాన్యం, గౌరవం కళ్లారా తిలకించి పొంగిపోని భారతీయుడు ఉండడు. ఇక మిగిలింది స్వభాషా విధానం. ఇది ప్రభుత్వం విధానపరంగా ప్రవేశపెట్టినా దానిని ప్రజలు అంగీకరించి, అనుసరించి, విస్తృతపరచాల్సిన అవసరముంది. ఇది ప్రజా బాధ్యత.

పాఠశాల విద్య మాత్రమే మాతృభాషలో అనేది మోదీ ప్రభుత్వ విద్యావిధానం కాదు. డిగ్రీ స్థాయి, విశ్వవిద్యాలయ స్థాయిలో కూడా బోధన మాతృభాషలో జరగాలన్న ఆలోచన గతంలో కొన్ని రాష్ట్రాలు చేసాయి. కొంతకాలం అమలుచేసాయి కూడా. కాని ప్రపంచీకరణ వచ్చి, తిరిగి ఇంగ్లీషు భూతం మధ్య తరగతిని ఆవహించటంతో మాతృభాష వెనుకబడింది. వెనక్కి నెట్టబడిన ఆ మాతృభాష ప్రాధాన్యతను పునరుద్ధరించటమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యం. మోదీ ప్రభుత్వం మరో అడుగుముందుకు వేసి వృత్తి విద్యా కోర్సుల్లో కూడా మాతృభాషను తీసుకు వస్తాం అంటున్నది. నేటి అధునాతన అనువాద సాంకేతికతతో ఏ భాషలోకైనా తక్షణ అనువాదం సాధ్యమే. ఆ సాంకేతికతను ఉపయోగించుకుని, మాతృభాషలో ఏ స్థాయిలో అయినా విద్యార్జన చేయవచ్చు. అన్నిరకాల సదుపాయాలు, సౌకర్యాలు, విభిన్న ప్రోత్సాహకాలను కేంద్రం అందిస్తున్నది. ఆయా భాషా రాష్ట్రాలు కేంద్ర విద్యావిధానాన్ని అందిపుచ్చుకుని, తమ రాష్ట్ర భాషలను పరిపుష్టి చేసుకోవచ్చు. సాహిత్య సంపదతోపాటు సాంకేతిక విద్యా సంపదను కింది స్థాయికి తీసుకెళ్లవచ్చు. ఇది విద్యా అంత్యోదయ. చిట్టచివరివారికి ఆర్థిక స్వావలంబనే కాదు, విద్యాపరమైన స్వేచ్ఛను అందించే విధానం.

భారతదేశం ఇప్పటికే సంస్కృతభాషను వదులుకుని భారీగా నష్టపోయింది. ఇక భారతీయ భాషలను పోగొట్టుకుని మరింత నష్టపోవటం సరైనది కాదు. ప్రతిభాషా వృద్ధి అవ్వాలి. అన్ని భారతీయ భాషల్లో విలువైన సాంకేతిక గ్రంథాలు రావాలి. ఒకనాడు తెలుగు అకాడమీ ఈ దిశలో కృషిచేసింది. రాష్ట్ర విభజనతో వెనుకబడిన ఆ అకాడమీల కృషి పునరుద్ధరించబడాలి. అందుకు కేంద్ర సహాయం ముందుగా అందుకున్న రాష్ట్రాలు భారీ లబ్ధి పొందుతాయి. ఆ లబ్ధి పొందే భాష తెలుగు కావాలన్నదే ఆకాంక్ష. ★

05 అక్టోబర్ 2026, సోమవారం | అసతో మా సద్గమయ తమసో మా జ్యోతిర్గమయ మృత్యోర్మా అమృతంగమయ – బృహదారణ్యకోపనిషత్



40లో

కథ

**మాసిన చేతులు**

– ప్రశాంత్‌వర్మ ఉప్పలపాటి





| | | |
|---|---|---|
| విశ్వజనని నవరాత్రుల సంరంభం (ఆధ్యాత్మికం) | - | 15 |
| మోదఖేదాల నడుమ వర్షాలు (ఆంధ్రప్రదేశ్) | - | 16 |
| 'కమల' వికాసానికి మిషన్ తెలంగాణ! (తెలంగాణ) | - | 18 |
| చిన్న స్టార్టప్ నుంచి ప్రపంచ దిగ్గజంగా... (యువవాణి) | - | 23 |
| అమెరికా–చైనా విచిత్ర బంధం! (అంతర్జాతీయం) | - | 24 |
| గణపతి చాటిన సామరస్యం (సమరసత) | - | 26 |
| మన విశిష్టత విశ్వవ్యాప్తం (మహిళ) | - | 28 |
| చక్రవర్తులను మురిపించిన మామిడిపండు (గళమెత్తిన గతం) | - | 32 |
| డ్రగ్స్ మాఫియాపై ఇక సర్జికల్ స్ట్రయిక్! (నాంది) | - | 34 |
| జాతీయవాదానికి జై కొట్టిన జెన్ జీ (మార్పు) | - | 26 |
| ఏషియాడ్‌లో భారత అథ్లెట్ల అరుదైన రికార్డులు! (క్రీడ) | - | 43 |
| రుధిరంతో తడిసిన 'ది ప్యారడైజ్' (సినిమా) | - | 50 |



# సేవే

'వైష్ణవ జనతో తేనె కహియేరే, పీడ్ పరాయీ జానెరే'.. ఇతరుల కష్టాలను, బాధలను తనవిగా భావించి, ఆ బాధల నుంచి వారిని విముక్తం చేయడం కోసం చేపట్టే సహజమైన చర్యలనే ధర్మమన్నారు.

'నాకు రాజ్యం కావాలన్న కోరిక లేదు, స్వర్గం పట్ల లేదా మోక్షం పట్ల కోరికలేదు. దుఃఖంలో మునిగితేలుతున్న వారికీ, పీడితులకు, ఆ బాధలు, వేదనల నుంచి ముక్తి కల్పించాలన్నదే నా కోరిక (కామయే దుఃఖ తప్తానాం ప్రాణినా మార్తి నాశనమ్), ఇవి రాజా రంతిదేవుడు ప్రసిద్ధంగా అన్న మాటలు. అందుకే, వలసపాలన, బానిసత్వం నుంచి విముక్తమైన తర్వాత వచ్చిన నాయకులు, రాజ్యాంగనిర్మాతలు ఈ ధర్మం గొప్పదనం తెలుసుకుని, 'ధర్మచక్ర ప్రవర్తనాయః' అని లోక్‌సభలో, 'సత్యం వద ధర్మం చర' అని రాజ్యసభలో రాశారు. అత్యున్నత న్యాయస్థానం ధ్యేయ వాక్యం – 'యతో ధర్మస్తతో జయః' ఇక భారత జాతీయ జెండాపై ఉన్న చక్రమే 'ధర్మచక్రం.'

భారతదేశంలో 'రాష్ట్రం' అన్నది పశ్చిమానికి చెందిన 'నేషన్ స్టేట్'కు భిన్నమైంది. ఇక్కడ రాష్ట్ర అంటే సమాజం అని అర్థం. భారతదేశానికి చెందిన ఈ ఆధ్యాత్మికత ఆధారిత సంపూర్ణ–సమగ్ర జీవన దృక్పథాన్ని "హిందూ జీవన దృక్పథం" (హిందూ వ్యూ ఆఫ్ లైఫ్) అని డాక్టర్ రాధాకృష్ణన్ అభివర్ణించారు. దీని ఆధారంగా ధర్మాన్ని ఆచరించడం హిందుత్వ అభివ్యక్తి మాత్రమే. యావత్ భారత దేశంలో జీవించే ఈ సమాజం ఒక్కటే, మనందరం సమానం, వీరంతా నావాళ్లే అన్న సంస్కారం, సంస్కృతి స్వయంసేవక్‌కు సంఘ శాఖలోని కార్యక్రమాలలో, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన కార్యకర్తల సాంగత్యంతో, సహవాసంతో అలవడుతుంది. మానవ,ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు స్వయంసేవకులు అందించిన విశిష్టమైన, ఆత్మీయమైన సేవా కార్యక్రమాలను పూర్తిగా, ప్రత్యక్షంగా చూశాను, అనుభవంలోకి వచ్చాయి.

దేశ విభజన దారుణాల కాలంలో అయినా, భూకంపాలు, వరదలు లేదా కరోనా వంటి అంటువ్యాధుల సమయంలో అయినా, ఆర్ఎస్ఎస్ సేవలు అనన్యమైనవి. సిద్ధాంతపరంగా సంఘాన్ని వ్యతిరేకించేవారు కూడా స్వయంసేవకుల దేశభక్తి, క్రమశిక్షణ, అంకితభావం, సేవలతో ప్రభావితమయ్యారు. అంతేకాదు, ఆ విషయాలలో వారిని ప్రశంసిస్తారు కూడా.



డా।। మన్మోహన్ వైద్య
**అఖిల భారత కార్యకారిణి సదస్యులు, ఆర్ఎస్ఎస్**

కాంగ్రెస్ నేతృత్వంలోని యూపీఏ పాలనా కాలంలో 'భాగ్ మిల్ఖా భాగ్' చిత్రం ప్రసిద్ధ రన్నర్ మిల్ఖా సింగ్ జీవితం ఆధారంగా తీసింది. విభజనానంతరం పాకిస్తాన్ నుంచి భారత్ వచ్చిన నిరాశ్రిత హిందూ కుటుంబాలలో మిల్ఖా సింగ్‌ది కూడా ఒకటని సినిమాలో చూపారు. దానితో పాటుగా, నిరాశ్రయుల కోసం సంఘ స్వయంసేవకుల ద్వారా నడిపిన సహాయక శిబిరాల దృశ్యాలు కూడా ఇందులో చూపించారు. కాంగ్రెస్ పాలనలో అటువంటి దృశ్యాలు చూపడం సాహసోపేతమైన చర్య.

ఈ విషయమై సినిమా దర్శకుడిని ప్రశ్నించినప్పుడు, 'దాదాపు నాలుగేళ్లుగా ఈ సినిమాపై పని చేస్తున్నాను. పాకిస్తాన్ నుంచి నిరాశ్రితులుగా భారత్ వచ్చినవారితో నేను ప్రత్యక్షంగా మాట్లాడాను. వారంతా కూడా సంఘం చేపట్టిన సహాయ శిబిరాల గురించి ఉల్లేఖించారు' అని చెప్పాడు.

1977లో ఆంధ్రప్రదేశ్ (కోస్తా ఆంధ్ర) దివిసీమలో భయంకరమైన తుఫాన్ వచ్చి, ఆ ప్రాంతాన్ని ధ్వంసం చేసింది. ఆ సందర్భంలో స్వయంసేవకులు ఎంతో అంకితభావంతో, సాహసంతో చేసిన సేవా కార్యక్రమాలు అనన్యమైనవి. కుళ్లిపోయి, వాసన వస్తున్న మృతదేహాలకు దహన సంస్కారాలు చేపట్టింది సంఘం. ఆ పని చేసే స్వయంసేవకులను 'శవసేన' అని పిలిచేవారు. పూర్తిగా ధ్వంసమైన మలపాలెం గ్రామంలోని అందరికోసం పక్కా ఇళ్లను నిర్మించి 'దీనదయాళపురం' పేరుతో ఈ ఇళ్లను ప్రజలకు అందించే కార్యక్రమానికి నాటి విదేశాంగ మంత్రి అటల్ బిహారీ వాజ్‌పాయ్, నాటి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ చెన్నారెడ్డి హాజరయ్యారు. ఇద్దరూ కూడా సంఘం చేపట్టిన సేవాకార్యక్రమాలను ఎంతగానో ప్రశంసించారు. ఈ సమయంలో ప్రసిద్ధ గాంధేయవాది శ్రీ ప్రభాకర్ రావ్‌జీ ఆర్ఎస్ఎస్ అంటే 'రెడీ ఫర్ సెల్ఫ్‌లెస్ సర్వీస్' అంటూ 'ఆర్ఎస్ఎస్'కు కొత్త అర్థాన్ని చెప్పారు.

2009 మేలో పశ్చిమ బెంగాల్లో వచ్చిన ఐలా తుపాను, రాష్ట్రంలోనే కాక 24 పరగణా జిల్లాలో చాలా విధ్వంసాన్ని సృష్టించింది. స్వయంసేవకులు తక్షణం సేవలోకి దూకారు. ఆ తర్వాత అక్కడ జరిగిన సంఘ శిక్షావర్గకు నేను వెళ్లవలసి వచ్చింది. వారి సేవలు ప్రత్యక్షంగా చూసేందుకు మొదట జీప్ ద్వారా, తర్వాత పడవలో, అంతిమంగా మోకాళ్ల లోతు బురదలో నడిచి సహాయక శిబిరానికి చేరు కోవలసి వచ్చింది. అక్కడ ఏయే సంస్థలు సహాయక కార్యక్రమాలు చేపట్టాయని నేను ప్రశ్నించినప్పుడు, అన్ని సంస్థలూ కూడా ముఖ్యమార్గాల్లో పని



# ధర్మం

చేస్తున్నాయని జవాబు వచ్చింది. అత్యధిక విధ్వంసం జరిగిన మారుమూల ప్రాంతాల్లో కేవలం సంఘానికి చెందిన స్వయంసేవకులు మాత్రమే పని చేశారు.

2013లో కేదార్‌నాథ్‌లో 'క్లౌడ్ బరస్ట్' (మేఘ విస్ఫోటనంతో కుండపోత వాన) కారణంగా వచ్చిన వరదల్లో బాధితులకు సహాయం చేసేందుకు, స్వయం సేవకులు దేశవ్యాప్తంగా ప్రజల నుంచి విరాళాలు సేకరించారు. ఆ సమయంలో నాకు విదర్భకు చెందిన ఎం.డి. రామ్టేకే పేరుగల వ్యక్తి నుంచి ఈమెయిల్ వచ్చింది. 'నేను ఆర్‌ఎస్ఎస్‌ను తీవ్రంగా వ్యతిరేకిస్తాను, విరోధిని. నేను దృఢమైన అంబేద్కర్ వాదిని. సాక్షాత్తు బుద్ధ భగవానుడి అవతారం డా॥ అంబేద్కర్ అని విశ్వసిస్తాను. అయినప్పటికీ, ఆర్‌ఎస్ఎస్‌కి చెందినవారు సేవా కార్యక్రమాలను ఎంతో నిజాయతీతో, విశ్వసనీయతతో చేస్తారని అనుభవపూర్వకంగా చెప్పగలను. మీరు వారికి సేవ కోసం రూ.100 ఇస్తే, వారు తమ జేబులోని మరో పది రూపాయలను జోడించి, 110 రూపాయలను సేవ కోసం ఉపయోగిస్తారు. అందుచేత, ఈ సమయంలో స్వయంసేవకులు మీ దగ్గరకు వచ్చి సహాయనిధి కోసం డబ్బు అడిగితే, మీరు పెద్ద మనసు చేసుకొని వారికి సహాయం చేయండి,' అంటూ రాశారు.

అటువంటి నిస్వార్థ, ఆత్మీయసేవలు చేసే సంస్కారాన్ని స్వయంసేవకులు సంఘ శాఖ నుంచి అందుకుంటారు. ప్రకృతి లేక మానవ తప్పిదాల వలన జరిగే విపత్తుల సమయంలో స్వయంసేవకులు సహాయక, పునరావాస చర్యలు చేపట్టేందుకు వస్తున్నారు. కానీ, రాజకీయ ద్వేషం కారణంగా కాంగ్రెస్ ప్రభుత్వం రెండుసార్లు – 1948లోనూ, 1975లోనూ సంఘంపై అనుచితమైన, చట్ట విరుద్ధమైన, అప్రజా స్వామిక ఆంక్షలు విధించి, సంఘాన్ని అన్ని విధాలా అణచివేయడానికి ప్రయత్నాలు చేసింది. అయినప్పటికీ, ప్రజాస్వామ్య ప్రతిఘటన, పోరాటం అనంతరం సంఘ కార్య కలాపాలు మళ్లీ తీవ్రస్థాయిలో ప్రారంభమయ్యాయి.

1989–90లో సంఘ వ్యవస్థాపకులు డా॥ హెడ్గేవార్ శతజయంతి సందర్భంగా, సౌకర్యాల కొరత కారణంగా మురికివాడల్లో నివసిస్తున్న ఆర్థికంగా వెనుకబడిన సమాజ సభ్యులను నిరంతరం కలుస్తూ ఉండడం ద్వారా వారి అవసరాలను తీర్చడానికి సేవా కార్యక్రమాలను ప్రారంభించాలనే ఆలోచన వచ్చింది. ఈ నేపథ్యంలో సంఘం 1991లో సేవా విభాగాన్ని ప్రారంభించింది. నేడు, సంఘ స్వయంసేవకులు విద్య, ఆరోగ్యం, భద్రత, ఆర్థిక స్వావలంబన రంగాలలో వివిధ సేవాసంస్థల ద్వారా 1,67,113 సేవాకార్యక్రమాలను నిర్వహిస్తు న్నారు. సంఘ స్వయంసేవకులు ఇలా చేయగలుగు తున్నారు, చేస్తూ వస్తున్నారు, ఎందుకంటే వారి సైద్ధాంతిక పునాది హిందుత్వపై ఆధారపడి ఉంది. ఈ హిందుత్వం 'మతం' కాదు. ఇది ఆధ్యాత్మికత ఆధారిత సంపూర్ణ, సర్వతోముఖమైన జీవన దృష్టి. అందుకే, ఆత్మీయత ఆధారంగా నిరపేక్ష భావనతో స్వయంసేవకులు ఇక్కడ సేవా కార్యక్రమాలు చేస్తున్నారు.

కొంతమంది వీరి సేవలను 'మిషనరీల సేవ'లతో పోలుస్తుంటారు. కానీ, వాస్తవంలో మిషనరీలు మతాంతరీకరణ కోసం సేవలు అందిస్తారు. వారి సేవా భావం మూలంలో భారతీయత లేదు. క్రైస్తవ మిషనరీలు మత మార్పిడి కోసం సేవలు చేస్తారనే విషయం, వారు చేపట్టే సేవా కార్యాల స్వభావం కారణంగా బాగా ప్రచారంలోకి వచ్చింది. మతమార్పిడికి అవకాశం లేని చోట, వారు సేవా కార్యక్రమాలు చేపట్టరు. ఒక ఉదాహరణతో ఇది స్పష్టమవుతుంది.

మణిపూర్‌లో, మయన్మార్ సరిహద్దుకు సమీపంలో, ఉఖ్రుల్ అనే ఒక గ్రామం ఉంది. అక్కడ ఉన్నవారందరూ క్రైస్తవ మతం తీసుకున్నారు. అందువల్ల, అక్కడ ఎలాంటి విద్యా సౌకర్యాలు గానీ, పాఠశాలలు గానీ లేవు. 1971లో ఆర్‌ఎస్ఎస్ ప్రచారక్ అయిన శంకర్ కేనే (భయ్యాజీ) ఆ గ్రామాన్ని సందర్శించినప్పుడు, అక్కడి పిల్లలకు విద్య అందుబాటులో లేకపోవడాన్ని గమనించారు. ఆయన అక్కడి పిల్లల భవిష్యత్తు గురించి ఆందోళన చెందారు. భయ్యాజీ కొంతమంది పిల్లలను చదువుకోసం మహారాష్ట్రకు తీసుకువెళ్లారు. కానీ, తమ పిల్లలను



*"సేవ చేయడంతో మీరు గొప్పవారు అయిపోరు. అది ఇతరులకు ఉపకారం చేసినట్టు కాదు. మానవాళికి మీరు చెల్లించే పరిహారం కూడా కాదు. "దాత ఎప్పటికీ ఇస్తూనే ఉండాలి. స్వీకర్త ఎప్పటికీ స్వీకరిస్తూనే ఉండాలి. ఒకానొక రోజున దాత చేతులను మీరు అందుకుంటారు. అప్పటిదాకా స్వీకర్తగా ఉన్న మీరు దాతగా మారిపోతారు" అనే అర్థం వచ్చే కవిత మరాఠీ భాషలో ఉంది. సేవతో మీరు ఏ ఒక్కరికీ ఉపకారం చేయడం లేదు. బదులుగా సేవ చేసే ప్రత్యేక అవకాశం లభించిందని మీరు భావించాలి.*

**– డా.మోహన్ భాగవత్, సర్‌సంఘచాలక్, ఆర్‌ఎస్‌ఎస్**

(సెప్టెంబర్ 6న, లండన్‌లో ప్రసంగించిన సందర్భంగా)

మణిపూర్ నుండి ఒక అపరిచితుడితో మహారాష్ట్రకు పంపడం తల్లిదండ్రులకు కష్టంగా ఉండేది.

అందుకే భయ్యాజీ, వారికి ధైర్యం చెప్పడానికి మహారాష్ట్ర నుండి తనతోపాటు వచ్చిన 12 ఏళ్ల బాలుడిని ఉఖ్రుల్లో ఉంచారు. క్రమంగా, వారిలో నమ్మకం పెరిగింది. ప్రతి సంవత్సరం, కొంతమంది పిల్లలు చదువుకోవడానికి మహారాష్ట్రకు రావడం మొదలుపెట్టారు. అది వారి జీవితాల్లోకి కొత్త వెలుగును తెచ్చింది. చదువుకోవడానికి వచ్చిన పిల్లలందరూ క్రైస్తవులు. భయ్యాజీ (సంఘ ప్రచారక్) వారిని హిందూ మతంలోకి మార్చడానికి ప్రయత్నించలేదు. వారు క్రైస్తవులుగానే ఉండి పోయారు. చదువు పూర్తి చేసుకుని ఉఖ్రుల్‌కు తిరిగి వచ్చాక, ఈ పిల్లలు మంచి ఆదాయం ఆర్జించడం ప్రారంభించారు. భయ్యాజీ స్ఫూర్తితో, పిల్లలు అక్కడే ఉండి చదువుకోవడానికి వీలుగా ఉఖ్రుల్‌లో ఒక పాఠశాలను స్థాపించారు. సమీపంలోని పాఠశాలల పేర్లలో తరచుగా 'స్కూల్' లేదా 'హైస్కూల్' అనే పదాలు ఉంటాయి, కానీ భయ్యాజీ స్ఫూర్తితో స్థాపించిన ఈ పాఠశాలకు 'ఓర్ఖూ శంకర్ విద్యాలయ' అని పేరు పెట్టారు (స్థానిక మాండలికంలో, సమాజంలోని పెద్దలను గౌరవంగా 'ఓర్ఖూ' అని పిలుస్తారు).

'సేవ' అనే పదాన్ని ప్రయోగించక ముందు, భారతదేశంలో ఇటువంటి కార్యకలాపాలన్నింటినీ 'ధర్మం'గా పరిగణించారు. ఇప్పటికీ అలాగే పరిగణిస్తున్నారు. ఇక్కడ 'ధర్మం' అంటే మతం కాదు. మన భాషలో మతాన్ని 'పూజ' లేదా 'ఆరాధన'కు సమానార్థకంగా భావించవచ్చు. భారతదేశంలో 'ధర్మం' అనేది ఆధ్యాత్మికతకు ఒక అభివ్యక్తి. భారతదేశ ఆధ్యాత్మిక దృక్పథం సంపూర్ణమైంది, సర్వవ్యాపకమైంది. అది ఈ విశ్వం మొత్తం కూడా ఆధ్యాత్మికత ద్వారా పరస్పరం అనుసంధానితమై ఉందని భావిస్తుంది. అందువల్ల, భారతదేశంలో ప్రాచీన కాలం నుండి 'వసుధైవ కుటుంబకం' అనే సూత్రాన్ని పాటిస్తున్నారు. 'నేను' అనే భావన తగ్గి, కనువిప్పు కలిగినప్పుడు, 'మనం' అనే భావన పరిధి సహజంగానే విస్తరిస్తుంది. మనవారు కానివారు కూడా మనవారే అన్న భావన కలగడం మొదలవుతుంది. ఈ భావనే వారికోసం ఏదైనా చేసేలా మనల్ని ప్రేరేపిస్తుంది.

అనుబంధ భావనతో సమాజానికి తిరిగి ఇవ్వడమే నిజమైన ధర్మం. స్వామి వివేకానంద ఐరిష్ శిష్యురాలైన సిస్టర్ నివేదిత,'ఏ సమాజంలోనైతే ప్రజలు తమ శ్రమ ఫలాలను (ప్రతిఫలాన్ని) తమ కోసం ఉంచుకోకుండా సమాజానికి తిరిగి అందిస్తారో, ఆ సమాజం అలా సేకరించిన ప్రతిఫలం (సామాజిక మూలధనం)తో సుసంపన్నమవుతుంది. ఆ సమాజంలోని ప్రతి వ్యక్తి జీవన ప్రమాణం మెరుగుపడుతుంది,' అన్నారు. ఈ సామాజిక మూలధనాన్ని కొనసాగించడమే ధర్మం. 'రెలిజియన్' అంటే ధర్మం కాదు, ఉపాసన. 'నేను' అనే భావన అల్పమై, 'మనం' అనే భావన వ్యాపకం కావడానికి ఉపాసన సహాయపడుతుంది. ధర్మ ఆచరణలో కూడా ఉపాసన తోడ్పడుతుంది.

భారతీయ తత్వ విచారణ లేదా ఆలోచనలో భౌతిక సమృద్ధి (అభ్యుదయం), మోక్షం (ముక్తి), రెండిటి కోసం కృషి చేయడానికి సమానమైన ప్రాముఖ్యతను ఇచ్చారు. అందుకే 'యతో అభ్యుదయ నిఃశ్రేయస సిద్ధిః స ధర్మః' అంటూ వర్ణించారు. ఉత్పత్తిలో సమృద్ధి, పంపిణీలో సమానత్వం, వినియోగంలో సంయమనం అనేవి ప్రవర్తనా సూత్రాలుగా పరిగణిస్తారు. సంయమనంతో కూడిన వినియోగం ద్వారా మిగిలిపోయిన సంపదను, సమాజ శ్రేయస్సు కోసం, తాము కూడా ఆ సమాజానికి చెందినవారమనే భావనతో అంకితం చేయడమే 'ధర్మం'. దీనివల్ల సామాజిక మూలధనం పెరుగుతుంది. సమాజానికి ఇవ్వడం 'దానం' అని, సమాజానికి తిరిగి ఇవ్వడం 'ధర్మం' అని రవీంద్రనాథ్ టాగోర్ అన్నారు. భారతదేశం శతాబ్దాలుగా ఈ సంప్రదాయాన్ని పాటిస్తోంది. యాత్రికుల కోసం నిర్మించిన వసతి గృహాన్ని 'ధర్మశాల' అంటారు.





‘ధర్మాదాయ’ (ధర్మాసుపత్రి) వైద్యశాలలో వైద్య చికిత్స, సంరక్షణ అందిస్తారు. పూర్వకాలంలో, రోడ్లు నిర్మించడం, నీడ కోసం చెట్లు నాటడం, నీటి కోసం బావులు లేదా మెట్ల బావులు నిర్మించడం, పుణ్యక్షేత్రాల వద్ద నదులపై ఘాట్లు నిర్మించడం వంటి వాటినన్నింటినీ ‘ధర్మ’ (ధార్మిక) కార్యాలుగా పరిగణించారు.

రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో, రష్యా పోలాండ్‌పై దాడి చేసినప్పుడు, 675మంది స్త్రీలు, పిల్లలు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి ఒక ఓడలో పారిపోయారు. అనేక దేశాలు వారికి ఆశ్రయం ఇవ్వడానికి నిరాకరించాయి. బ్రిటిష్ పాలన ఉన్న ఆ సమయంలో వారు ముంబైలో ఆశ్రయం కోరినప్పుడు, వారు క్రైస్తవులు అయినప్పటికీ బ్రిటిష్ వారు వారికి అనుమతి నిరాకరించారు. ఈ విషయం జామ్‌నగర్ (గుజరాత్) రాజుకు తెలిసినప్పుడు, ఆయన బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ‘వారిని ముంబైలో దిగనివ్వండి. నేను వారందరినీ నా రాజ్యానికి తీసుకువస్తాను’ అని అభ్యర్థించారు. అయినప్పటికీ, బ్రిటిష్ వారు అనుమతి నిరాకరించారు. చివరకు, జామ్‌నగర్ మహారాజు వారిని సముద్ర మార్గం ద్వారా జామ్‌నగర్‌కు ఆహ్వానించి, జామ్‌నగర్ సమీపంలోని బాలాచెరిలో వారికి వసతి ఏర్పాటు చేసి, ఆహారం అందించడానికి గోవా నుండి ఏడుగురు వంటవారిని రప్పించారు (వారిని శాకాహారులుగా మార్చే యత్నం చేయలేదు). బ్రిటిష్ ప్రభుత్వం జోక్యాన్ని నివారించడానికి, మహారాజా ప్రతి ఆడపిల్లనీ, మహిళనీ తన ‘కుమార్తె’గా, ప్రతి అబ్బాయిని తన ‘కుమారుడి’గా పరిగణిస్తూ 675 దత్తత పత్రాలపై సంతకం చేసి, ‘మీరు నా

**రెండవ ప్రపంచ యుద్ధంలో, రష్యా పోలాండ్‌పై దాడి చేసినప్పుడు, 675 మంది స్త్రీలు, పిల్లలు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి ఓడలో పారిపోయారు. అనేక దేశాలు వారికి ఆశ్రయం ఇవ్వడానికి నిరాకరించాయి. బ్రిటిష్ పాలన ఉన్న ఆ సమయంలో వారు ముంబైలో ఆశ్రయం కోరినప్పుడు, వారు క్రైస్తవులు అయినప్పటికీ బ్రిటిష్‌వారు వారికి అనుమతి నిరాకరించారు. ఈ విషయం జామ్‌నగర్ రాజుకు తెలిసినప్పుడు, ఆయన బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ‘వారిని ముంబైలో దిగనివ్వండి. నేను వారందరినీ నా రాజ్యానికి తీసుకువస్తాను’ అని అభ్యర్థించారు. అయి నప్పటికీ, బ్రిటిష్ వారు అనుమతి నిరాకరించారు. చివరకు, జామ్‌నగర్ మహారాజు వారిని సముద్ర మార్గం ద్వారా జామ్‌నగర్‌కు ఆహ్వానించి, జామ్‌నగర్ సమీపంలోని బాలాచెరిలో వారికి వసతి ఏర్పాటు చేసి, ఆహారం అందించడానికి గోవా నుండి ఏడుగురు వంటవారిని రప్పించారు. బ్రిటిష్ ప్రభుత్వం జోక్యాన్ని నివారించ డానికి, మహారాజా ప్రతి ఆడపిల్లనీ, మహిళనీ తనసంతానంగా స్వీకరించారు.**

కుమారులు, కుమార్తెలు, మీరు కోరుకున్నంత కాలం ఇక్కడ ఉండండి’ అని అన్నారు. వీరు జామ్‌నగర్‌లో సుమారు 9 సంవత్సరాలు నివసించారు. యుద్ధం తరువాత వారు పోలాండ్‌కు తిరిగి వెళ్లారు. జామ్‌నగర్ మహారాజాకి కృతజ్ఞతగా, పోలిష్ రాజధానిలోని ఒక కూడలికి ‘గుడ్ మహారాజా స్క్వేర్’ అని పేరు పెట్టారు.

1996 నవంబర్ 12వ తేదీ రాత్రి, హరియాణా లోని చర్ఖీ–దాద్రి సమీపంలో సౌదీ అరేబియా, కజఖ్ ఎయిర్‌లైన్స్‌కు చెందిన రెండు విమానాలు ఢీకొని కూలిపోయాయి. రెండు విమానాల్లోనూ మొత్తం 351 మంది ప్రయాణీకులు ప్రయాణం చేస్తున్నారు. వారిలో 300మంది ముస్లింలు కాగా, 12మంది క్రైస్తవులు. ప్రమాదం జరిగిన వెంటనే, జిల్లా సంఘచాలక్ జిత్రామ్జీ, ఇతర స్వయంసేవకులు, డాక్టర్ హెడ్గేవార్ ఆసుపత్రి వైద్యులు, సంఘటనా స్థలానికి చేరుకున్నారు. చీకటి పడటంతో, పెట్రోమాక్స్ లైట్లు, జనరేటర్లు ఏర్పాట్లు చేసి, వెంటనే మృతదేహాలన్నింటినీ భివానీలోని ఆసుపత్రికి తరలించారు. ఈ వార్త తెలియగానే, ఉదయానికల్లా మృతుల బంధువులు, పోలీసు యంత్రాంగం, పాత్రికేయులు మొదలైనవారు అక్కడికి చేరుకోవడం ప్రారంభించారు. మృతదేహాలను వారి కుటుంబాలకు అప్పగించారు. బంధువులు ఎవరో తెలియని 76మంది ముస్లింలు, ముగ్గురు క్రైస్తవులను వారి వారి మత, ఆచారాల ప్రకారం ఖననం చేశారు. ఈ పనిలో స్థానిక మత గురువు, ముంబైకి చెందిన కొందరు వ్యక్తులు సహాయపడ్డారు. మూడు రోజుల తరువాత, నవంబర్ 15న, దాద్రీ మసీదులో కృతజ్ఞతలు చెప్తూ నిర్వహించిన సభలో జిల్లా సంఘచాలక్ జీత్రామ్జీని సత్కరించారు. మర్నాడు, చాలా వార్తా పత్రికలలో ప్రధాన శీర్షిక, ‘మసీదులో ఖాకీ నిక్కర్లు, కాషాయ పట్టీకి గౌరవం’ అని వచ్చింది.

ఇది స్వయంసేవకుల ద్వారా జరిగిన ధర్మ సాక్షాత్కారం. జామ్‌నగర్ మహారాజు కార్యం స్వచ్ఛమైన ధర్మం నుండి ప్రేరణ పొందింది. మణిపూర్‌లో పిల్లలకు విద్యను అందించాలన్న భయ్యాజీ కేనే చొరవ కూడా ధర్మం నుండి ప్రేరణ పొందింది. వారితో అంతర్ దృష్టితో మమేక మవ్వడానికి, వారి బాధలను అర్థం చేసుకోవడానికి, ఎలాంటి వివక్ష లేకుండా వాటిని తగ్గించడానికి సాధ్యమైనదంతా చేయడానికి ఆధ్యాత్మికత వారందరికీ వీలు కల్పించింది. ఇదే నిజమైన ధర్మం. క్లుప్తంగా చెప్పాలంటే – వ్యక్తులను ధర్మం పట్ల ఆసక్తిగలవారిగా, సమాజాన్ని ధర్మబద్ధంగా (లౌకికంగా కాదు) మార్చడమే ఆర్‌ఎస్‌ఎస్ ప్రయత్నం. అటువంటి సమాజాన్ని సృష్టించడం అంటే, ఈ దేశం హిందూదేశంగా మారడమే. సేవ విషయానికి వస్తే, దానిని ఒక ‘ధర్మం’గా చేయడం భారతీయ సంప్రదాయం. స్వామి వివేకానంద దీనిని ‘శివ’ భావనతో ప్రాణులకు సేవ చేయడం అని అన్నారు. మానవునికి (జీవునికి) సేవ చేయడమంటే, ఆ భగవంతుడిని (శివుడిని) ఆరాధించడమే.

# నిరంతర సేవ

మాతృభూమికి నిస్వార్థమైన సేవను అందించడంలో రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ముందు ఉంటుంది. ప్రతీ స్వయంసేవక్ ఇదే అంకితభావాన్ని కలిగి ఉంటారు. సేవ చేయడం అనేది స్వయంసేవకుల దైనందిన జీవితంలో భాగమై ఉంటుంది. 1947 నాటి దేశ విభజన నాటి నుంచి ఇటీవల అస్సాం వరదల వరకు వారిలో అదే సేవాస్ఫూర్తి నిరంతరాయంగా వర్ధిల్లుతున్నది.

### 1947: దేశ విభజన, శరణార్థుల సంక్షోభం



దేశ విభజన సందర్భంగా పంజాబ్, బెంగాల్‌లలో తలెత్తిన హింసకు సర్వం కోల్పోయిన శరణార్థులకు సహాయక శిబిరాలను స్వయంసేవకులు ఏర్పాటు చేశారు. వారికి రక్షణ కల్పించడంతోబాటు ఆహారం, వస్త్రాలు, వైద్య సాయం అందించారు. ఆర్ఎస్ఎస్ రికార్డుల ప్రకారం వేలాదిగా సహాయక శిబిరాలను నిర్వహించారు.

### 1947-48: కశ్మీర్ విలీనం

అక్టోబర్, 1947లో ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ ఎం.ఎస్.గోల్వాల్కర్ మహారాజా హరిసింగ్‌ను కలిసి, కశ్మీర్‌ను భారతదేశంలో విలీనం చేయాలని కోరారు. ఆ తర్వాత జరిగిన సంఘర్షణ సమయంలో సహాయక కార్యకలాపాలలో స్వయంసేవకులు పాల్గొన్నారు.

### 1950: అస్సాంలో భూకంపం, వరదలు

అస్సాంలో సంభవించిన వినాశకరమైన భూకంపం వరదల సమయంలో, బాధితులకు సహాయక చర్యలను స్వయంసేవకులు చేపట్టారు.

### 1950: తూర్పు పాకిస్థాన్ నుంచి శరణార్థులు

భారతదేశంలోని వివిధ ప్రాంతాలకు పాకిస్థాన్ నుండి వస్తున్న హిందూ శరణార్థులకు సహాయ సహకారాలు అందించేందుకు ‘వాస్తుహార సహాయతా సమితి’ని ఆర్ఎస్ఎస్ ఏర్పాటు చేసింది.

### 1962: భారత్-చైనా యుద్ధం

చైనా దురాక్రమణ సమయంలో, దానిని అడ్డుకోవడంలో భారత ప్రభుత్వానికి సంస్థాగత మద్దతును ఆర్ఎస్ఎస్ అందించింది. అదే కాలంలో పౌర సహాయక కార్యక్రమాలలో స్వయంసేవకుల భాగస్వామ్యం కూడా గణనీయంగా పెరిగింది.

### 1965: భారత్-పాకిస్థాన్ యుద్ధం

అఖిలపక్ష సమావేశానికి ఆర్ఎస్ఎస్ సర్‌సంఘచాలక్ ఎంఎస్ గోల్వాల్కర్‌ను ప్రధానమంత్రి లాల్‌బహదూర్ శాస్త్రి ఆహ్వానించారు. సమావేశంలో ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని గురూజీ హామీ ఇచ్చారు. 22



రోజుల పాటు ఢిల్లీలో ట్రాఫిక్ నిర్వహణలో స్వయంసేవకులు సాయపడ్డారు. రక్తదాన కార్యక్రమాలను చేపట్టారు.

➤ **1971: భారత్-పాక్ యుద్ధం, బాంగ్లాదేశ్ శరణార్థుల సంక్షోభం**

యుద్ధం, పెద్ద ఎత్తున శరణార్థుల రాకతో ఏర్పడిన సంక్షోభ సమయంలో, సామాజిక, సహాయక కార్యక్రమాలలో ఆర్ఎస్ఎస్, సంఘ పరివార్‌కు అనుబంధంగా ఉన్న సంస్థలు పాల్గొన్నాయి.

➤ **1975-77: అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ)**

అత్యవసర పరిస్థితి కారణంగా ఆర్ఎస్ఎస్ నిషేధానికి గురైంది. వేలాది మంది స్వయంసేవకులు, అగ్ర నాయకులు జైలు పాలయ్యారు. మరికొందరు నిరసన ఉద్యమంలో భాగంగా రహస్యంగా (అండర్‌గ్రౌండ్‌లో) పనిచేశారు. అత్యవసర పరిస్థితికి వ్యతిరేకంగా సాగిన 'లోక్ సంఘర్ష్ సమితి' ప్రచారంతో ఆర్ఎస్ఎస్‌కు ముడిపడింది.

➤ **1977: ఆంధ్రప్రదేశ్‌లో తుపాను**

ఆంధ్రప్రదేశ్ దివి సీమలో వినాశకరమైన తుపాను తర్వాత స్వయంసేవకులు సహాయక చర్యలలో పాల్గొన్నారు. బాధిత కుటుంబాలకు పెద్ద మొత్తంలో దుస్తులు, గృహోపకరణాలను పంపిణీ చేశారు.

➤ **1984: సిక్కు వ్యతిరేక అల్లర్లు**

వందలాది సిక్కు కుటుంబాలకు స్వయంసేవకులు తమ ఇళ్లలో రక్షణ కల్పించారు. అదే సమయంలో ఢిల్లీ, ఇతర ప్రభావిత ప్రాంతాలలో సహాయక శిబిరాలు, సహాయక కార్యక్రమాలు చేపట్టారు.

➤ **1990: కశ్మీరీ హిందువుల వలస**

కశ్మీరీ హిందువుల సామూహిక వలసల తర్వాత, జమ్మూ ఇతర ప్రాంతాలలో స్వయంసేవకులు ఏకమయ్యారు. సహాయక శిబిరాలు, సహాయక వ్యవస్థలు, జమ్మూ కశ్మీర్ సహాయతా సమితిని ఏర్పాటు చేయడంలో సాయపడ్డారు.

➤ **1996: చర్ఖీ దాద్రి విమాన ప్రమాదం**



భారతదేశపు అత్యంత ఘోరమైన విమాన ప్రమాదాలలో ఒకటైన చర్ఖీ దాద్రి ఘటన తర్వాత, తక్షణ సహాయక చర్యలలో స్వయంసేవకులు పాల్గొన్నారు.

➤ **1999: ఒడిశాలో సూపర్ తుపాను**

వినాశకరమైన ఒడిశా సూపర్ తుపాను తర్వాత, సహాయక, పునరావాస, పునర్నిర్మాణ కార్యక్రమాలలో ఆర్ఎస్ఎస్, దాని ప్రేరణతో పనిచేసే సంస్థలు విస్తృతంగా పాల్గొన్నాయి.

➤ **2001: గుజరాత్‌లో భూకంపం**

భుజ్ భూకంపం తర్వాత, సహాయక చర్యలు, సహాయక శిబిరాలు, ఆహార పంపిణీ, దీర్ఘకాలిక పునరావాస పనులలో స్వయంసేవకులు, సంఘ ప్రేరణతో పనిచేసే సంస్థలు పాలుపంచుకున్నాయి.

➤ **2004: సునామీ విలయం**

అండమాన్, నికోబార్‌లలో భారత సైన్యం, అధికార యంత్రాంగం చేపట్టిన భారీ సహాయక చర్యలతో పాటు, సునామీ ప్రభావిత ప్రాంతాలలో సహాయక పునరావాస కార్యక్రమాలలో ఆర్ఎస్ఎస్ ప్రేరణతో పనిచేసే సంస్థలు, స్వయంసేవకులు పాల్గొన్నారు.

➤ **2013: ఉత్తరాఖండ్‌లో విపత్తు**



సహాయక చర్యలలో ఆర్ఎస్ఎస్, సేవాభారతి కార్యకర్తలు పాల్గొన్నారు; చిక్కుకుపోయిన యాత్రికులకు, ప్రభావిత కుటుంబాలకు ఆహారం, ఆశ్రయం, పునరావాసం కల్పించడంలో సాయపడ్డారు.

➤ **2014: జమ్మూ, కశ్మీర్‌లో వరదలు**



సెప్టెంబర్, 2014లో వచ్చిన భారీ వరదలు జమ్మూకశ్మీర్‌లోని అనేక ప్రాంతాలను ముంచెత్తాయి, దీనివల్ల వేలాది మంది నిరాశ్రయులయ్యారు. వరదల్లో చిక్కుకుపోయారు. స్వయంసేవకులు వెంటనే సహాయక చర్యల్లో పాల్గొన్నారు. బాధితులకు ఆహారం, మందులు, ఇతర సాయాన్ని అందించారు.

➤ **2019: ఒడిశాలో ఫని తుపాను**

మే, 2019లో అత్యంత తీవ్రమైన 'ఫని' తుఫాను ఒడిశాపై విరుచుకుపడినప్పుడు, ఆర్ఎస్ఎస్ స్వయంసేవకులు, దాని ప్రేరణతో పనిచేసే సేవా సంస్థలు ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించడం, సహాయక చర్యలు ,పునరావాస పనులలో పాల్గొన్నాయి. ఈ చర్యల్లో ఆహారం, నిత్యావసరాల పంపిణీతో పాటు, తీరప్రాంత ఒడిశాలో భారీ విధ్వంసానికి గురైన ప్రజలకు సహాయం అందించడం వంటివి ఉన్నాయి.

➤ **2020-21: కోవిడ్-19 మహమ్మారి**



దేశవ్యాప్త లాక్‌డౌన్, కోవిడ్ తదుపరి దశల సమయంలో, ఆహార పంపిణీ, వలస కార్మికులకు సాయం, మాస్కుల పంపిణీ, వైద్య సాయం, సామాజిక సేవా కార్యక్రమాల కోసం ఆర్ఎస్ఎస్, దాని ప్రేరణతో పనిచేసే సంస్థలు స్వయంసేవకులను సమీకరించాయి.

**➤ 2024: వయనాడ్‌లో విపత్తు**



జూలై 30, 2024న కేరళం, వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడిన తర్వాత, ప్రభావిత గ్రామాలలో సహాయక చర్యలు, తదుపరి పునరావాస కార్యక్రమాలలో స్వయంసేవకులు పాల్గొన్నారు.

**➤ 2025: అహ్మదాబాద్‌లో విమాన ప్రమాదం**



జూన్ 12, 2025న అహ్మదాబాద్‌లోని బి.జె. మెడికల్ కాలేజీ సమీపంలో ఎయిర్ ఇండియా విమానం (AI171) కూలిపోయినప్పుడు, ప్రమాద స్థలంలో సహాయక చర్యలలో స్వయంసేవకులు పాలుపంచుకున్నారు.

**➤ 2025: పంజాబ్‌లో వరదలు**

వరద ప్రభావిత గ్రామాలలో ఆహారం, మందులు, ఇతర అత్యవసర సహాయాన్ని అందించడం సహా విస్తృతమైన సేవా కార్యక్రమాలను ఆర్‌ఎస్‌ఎస్ పంజాబ్, సేవా భారతి స్వచ్ఛంద కార్యకర్తలు చేపట్టారు.

**➤ 2025: హిమాచల్‌ప్రదేశ్‌లో విపత్తు**

తీవ్రమైన వరదలు, అకాల భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం వంటి విపత్తులను హిమాచల్‌ప్రదేశ్ ఎదుర్కొంటున్న తరుణంలో, హిమాలయ ప్రాంతంలోని ఆయా ప్రాంతాలలో చేపట్టిన సహాయక కార్యక్రమాల్లో సంఘ్, అనుబంధ సంస్థలు కూడా పాల్గొన్నాయి.

**➤ 2026: అసోంలో వరదలు**



వరదల సమయంలో, ఆర్‌ఎస్‌ఎస్, దాని ప్రేరణతో పనిచేసే రాష్ట్రీయ సేవా భారతి, భారతీయ కిసాన్ సంఘ్, నేషనల్ మెడికోస్ ఆర్గనైజేషన్ ఆరోగ్య భారతి వంటివి సహాయక, పునరావాస కార్యక్రమాలలో పాల్గొన్నాయి. సహాయక చర్యలు, ఆహార పంపిణీ, వైద్య శిబిరాల ద్వారా వరద బాధితులైన 40,000కు పైగా కుటుంబాలకు దాదాపు 2,000 మంది స్వయంసేవకులు అండగా నిలిచారు.

## వీహెచ్‌పీ ఆహార సరఫరా



ఆగస్టు 5, 2026న, ఉత్తర అసోం ప్రాంతంలో వరద బాధితులకు విశ్వహిందూ పరిషత్ (వీహెచ్‌పీ) స్వచ్ఛంద కార్యకర్తలు సహాయక సామగ్రిని పంపిణీ చేశారు. ఉత్తర అస్సోం ప్రాంతం వరదల వల్ల తీవ్ర ప్రభావితమైంది. ఈ క్లిష్ట సమయంలో, ఆ ప్రాంతానికి చెందిన వీహెచ్‌పీ కార్యకర్తలు సహాయక, పునరావాస కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొన్నారు. బాధితులకు ఆహార పదార్థాలు, దుస్తులు, నిత్యవసర వస్తువులు, మందులు, ప్రథమ చికిత్స సామగ్రి, పరిశుభ్రమైన తాగునీరు వంటి అత్యవసర వస్తువులను అందించారు. వీలైనంత ఎక్కువ మందికి సాయం అందేలా చూసేందుకు రేయింబవళ్లు నిరంతరం శ్రమించారు.





# అసోం వరద బాధితులకు చేయూత




వరదల తర్వాత ఎదుర్కొంటున్న అనేక సమస్యల నుండి రైతులు బయటపడేందుకు, వారి జీవితాలను తిరిగి నిర్మించుకునేందుకు భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) అవిశ్రాంతంగా కృషి చేస్తోంది. ఈశాన్య రాష్ట్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలలో సమగ్ర సహాయక, పునరావాస కార్యక్రమాన్ని చేపట్టింది. పుట్టగొడుగుల పెంపకం ద్వారా ఆదాయం పొందేలా చేయడంలోనూ మహిళలకు సాయపడింది. అలాగే, 5,000 మందికి పైగా విద్యార్థులకు చదువుకు సంబంధించిన వస్తువులను అందించింది. అసోం రాష్ట్రంలోని శివసాగర్, చరైడియో, జోర్హాట్, గోలాఘాట్ జిల్లాల్లో లక్షలాది మందిని అతలాకుతలం చేసిన వరద బీభత్సం ఇంకా కొనసాగుతూనే ఉంది. ప్రజలు వరద అనంతర సమస్యలను ఎదుర్కోవడానికి తమ శాయశక్తులా ప్రయత్నిస్తున్నారు. అదృష్టవశాత్తూ, బీకేఎస్‌తో పాటుగా అనేక ఇతర స్వచ్ఛంద సంస్థలు వరద బాధితులు తమ జీవితాలను తిరిగి నిర్మించుకోవడంలో సహాయపడుతున్నాయి.

ఈ ఏడాది జూలై 19న సిబ్‌సాగర్, చరైడియో, గోలాఘాట్, జోర్హాట్ జిల్లాల్లో వరద నీరు ఉప్పొంగినప్పుడు, అది వేలాది రైతు కుటుంబాల వరి పొలాలు, ఇళ్లు, జీవనోపాధి రూపంలో ఉన్న వారి కలలను కొట్టుకుపోయింది. నాగాలాండ్ కొండల నుండి వచ్చిన వరద ప్రవాహానికి చాలా మంది రైతులు నెలల తరబడి ఎంతో శ్రద్ధతో సాగు చేసిన పంటలు కొట్టుకుపోయాయి. ప్రభుత్వ గణాంకాల ప్రకారం, వరదల్లో 75,000కు పైగా పశువులు, ఇతర జీవరాశులు కొట్టుకుపోవడం వల్ల వేలాది రైతు కుటుంబాల భవిష్యత్తు దెబ్బతింది. ఈ సంక్షోభ సమయంలో బీకేఎస్ రంగంలోకి దిగింది. కేవలం సహాయక సామగ్రిని అందించడమే కాకుండా, రైతులు తిరిగి తమ కాళ్లపై తాము నిలబడేలా చేయడంలో సహాయపడేందుకు ఒక దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు వచ్చింది.

అత్యవసర సహాయ చర్యగా మొదలైన ఈ కార్యక్రమం, ఆ ప్రాంతంలోనే అత్యంత సమగ్రమైన వరద పునరావాస ప్రయత్నాలలో ఒకటిగా విస్తరించింది. వరద బాధితులైన దాదాపు 5,000 కుటుంబాలు తమ జీవితాలను తిరిగి నిర్మించుకుని, మళ్లీ స్వయంసమృద్ధిని సాధించేలా చేయడమే ఈ సంస్థ లక్ష్యం.

శివసాగర్, చరైడియో జిల్లాలను వరదలు తీవ్రంగా దెబ్బతీశాయి. ఇళ్లు నీట మునిగిపోగా, చేతికి వచ్చిన పంటలు నాశనమయ్యాయి. పరిస్థితి తీవ్రతను గమనించిన వెంటనే, బీకేఎస్ స్వచ్ఛంద కార్యకర్తలు రంగంలోకి దిగి తక్షణ సహాయాన్ని అందించారు. శివసాగర్ జిల్లాలో సుమారు 300 మంది వరద బాధితులకు అత్యవసర సహాయ సామగ్రిని అందించారు. అత్యవసరమైన వారికి సహాయం అందేలా చూసేందుకు 50 మంది స్వచ్ఛంద కార్యకర్తలు క్షేత్రస్థాయిలో పనిచేశారు. అయితే, కేవలం సహాయక సామగ్రిని పంపిణీ చేయడంతోనే ఈ సంస్థ ఆగిపోలేదు. లఖింపూర్, జోర్హాట్, దిబ్రూగఢ్, ధేమాజీ, మోరిగావ్, నల్బారీ, కామరూప్ జిల్లాల నుండి 200 మందికి పైగా స్వచ్ఛంద కార్యకర్తల బృందాన్ని సమీకరించి, వారిని ప్రభావిత ప్రాంతాలకు పంపింది. వీరు సహాయక సామగ్రి పంపిణీ నుండి ఇళ్ల పునర్నిర్మాణం వరకు అన్ని పనులలోనూ సహాయపడ్డారు. వ్యవసాయంపై ఆధారపడిన వారికి, వరదల వల్ల కలిగే అసలైన నష్టం కేవలం ఇళ్లలోకి నీరు చేరడం మాత్రమే కాదు. సాగు చేసిన పంటను కోల్పోవడం కూడా. బీకేఎస్ తన కృషిని ప్రధానంగా ఈ అంశంపైనే కేంద్రీకరించింది. వరదల వల్ల పంటను కోల్పోయిన రైతులకు వరి నారును సమకూర్చి పంపిణీ చేసింది. తద్వారా నీరు తగ్గిన తర్వాత వారు తిరిగి సాగును ప్రారంభించే అవకాశం కలిగింది. కేవలం శివసాగర్ జిల్లాలోనే, ఈ ప్రయత్నం ద్వారా వ్యవసాయ భూమిలో తిరిగి పంటలు వేయడానికి వీలు కలుగుతుందని, తద్వారా వరి పంటను కోల్పోయిన 600 మందికి పైగా రైతులకు ప్రయోజనం చేకూరుతుందని అంచనా. ఈ మద్దతు శివసాగర్‌కే పరిమితం కాలేదు. పొరుగున ఉన్న జోర్హాట్ జిల్లాలోని తియోక్‌లో, మరో 100 మంది రైతులకు బీకేఎస్ చేరువయ్యింది. వరి సాగును పునరుద్ధరించడంలో సహాయపడేందుకు వారికి నారును అందించింది.




**మహిళారైతులకు జీవనాధారం**

శివసాగర్‌లోని మహిళా రైతులకు ఒక అదనపు జీవనాధారం లభించింది. వరద బాధితులైన 50 మంది మహిళా రైతులకు ఒక క్వింటాల్ పుట్టగొడుగుల విత్తన ప్యాకెట్లను పంపిణీ చేసింది. వరి సాగులాగా కాకుండా పుట్టగొడుగుల పెంపకానికి నెలల తరబడి వేచి ఉండాల్సిన అవసరం లేకపోవడంతో, ఇది వారికి త్వరగా ఆదాయం పొందే మార్గంగా మారింది. శివసాగర్‌లోని వరద ప్రభావిత గెలెకి ప్రాంతానికి చెందిన సన్నకారు టీ (తేయాకు) రైతులకు కూడా బీకేఎస్ అండగా నిలిచింది. వారి టీ తోటలను తిరిగి కోలుకునేలా చేయడంలో భవిష్యత్తులో వాటిని సుస్థిరంగా నిర్వహించడంలో సహాయపడేందుకు, వారిలో 50 మందికి సేంద్రీయ ఎరువులు, సేంద్రీయ పురుగుమందులను అందించింది. కేవలం రైతులే కాకుండా, రైతు కుటుంబాలకు చెందిన పిల్లలు తమ విద్యను కొనసాగించడంలో కూడా బీకేఎస్ సహాయం



సంప్రదాయ మూలికా వైద్య సేవలను ఏర్పాటు చేసింది. సుమారు 100 మంది స్వచ్ఛంద కార్యకర్తల సహకారంతో నిర్వహించిన ఈ శిబిరాల ద్వారా, దాదాపు 500 మంది వరద బాధితులకు ఆరోగ్య పరీక్షలు చేశారు. చికిత్స అందించారు. అలాగే, స్థానికంగా లభించే ఔషధ మొక్కలు, ఇంటి చిట్కాల వినియోగంపై అవగాహన కార్యక్రమాలను కూడా చేపట్టారు. మరోవైపు, శివసాగర్‌లో మోరిగావ్ జిల్లాకు చెందిన 50 మందితో కూడిన స్వచ్ఛంద కార్యకర్తల బృందం నాలుగు రోజుల పాటు అవిశ్రాంతంగా శ్రమించింది. వీరు వరద ప్రభావిత గ్రామాలను శుభ్రపరచడం, దెబ్బతిన్న ఇళ్లను పునర్నిర్మించడం, బాధితుల జీవితాలను తిరిగి సాధారణ స్థితికి తీసుకురావడంలో సహాయపడ్డారు.

చేస్తోంది. గత కొన్ని దశాబ్దాలలో అసోం చవిచూసిన అత్యంత భయంకరమైన వరదలు పంటలు, ఇళ్లను దెబ్బతీయడమే కాకుండా, వేలాది మంది విద్యార్థుల పుస్తకాలు, నోట్‌బుక్‌లు, ఇతర సామాగ్రిని కూడా కొట్టుకుపోయేలా చేశాయి. 5,000 మందికి పైగా విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, పుస్తకాలు, నోట్‌బుక్‌లు, పెన్నులు, పెన్సిళ్లను విద్యార్థులకు బీకేఎస్ అందించింది. మరో సంస్థ అయిన 'శ్రీమంత శంకరదేవ్ సాంస్కృతిక సొసైటీ', బీకేఎస్‌తో కలిసి శివసాగర్ జిల్లాలోని వరద బాధితులైన 3,000 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, జామెట్రీ బాక్సులు(geometry boxes), పెన్నులు, నోట్‌బుక్‌లను పంపిణీ చేసింది. "తమ ఇళ్ల నుండి పుస్తకాలు, నోట్‌బుక్‌ల వరకు అన్నీ కోల్పోయిన విద్యార్థులకు ఇది ఎంతో ఉపశమనాన్ని ఇస్తుంది. రానున్న కాలంలో వారికి వివిధ మార్గాల్లో సహాయం చేయడానికి మేము ప్రయత్నిస్తున్నాము" అని బీకేఎస్ (అసోం, మేఘాలయ, నాగాలాండ్) రాష్ట్ర వ్యవస్థాపక కార్యదర్శి కృష్ణ కాంత బోరా అన్నారు. వరదల తదనంతర పరిస్థితులు బాధితులకు అత్యంత క్లిష్టంగా మారాయి. దీనికి స్పందిస్తూ, బీకేఎస్ జోర్హాట్ జిల్లా విభాగం ప్రభావిత గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు,

**అన్నదాతకు అండగా..**

వినాశకరమైన వరద తర్వాత 5,000 మంది రైతులు తమ జీవనోపాధిని పునర్నిర్మించుకోవడానికి సాయం చేయడమే లక్ష్యంగా భారతీయ కిసాన్ సంఘ్ పక్కా వ్యూహాలతో పనిచేస్తోంది. అయితే, ఇది రాత్రికి రాత్రే జరగదు. వరద నీరు ఒక జ్ఞాపకంగా మిగిలిపోయి, తక్షణ సంక్షోభం వార్తల్లోంచి మాయమైన చాలా కాలం తర్వాత కూడా వ్యవసాయం, పశుసంపద, గ్రామీణ జీవనోపాధులకు నిరంతర మద్దతు అవసరం.

అయితే, ఇప్పటికే జరిగిన పని పరిమాణాన్ని బట్టి చూస్తే, ఆ సుదీర్ఘ ప్రయాణానికి పునాది ఇప్పటికే పడింది. "మేము క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నాము. పరిస్థితిని అంచనా వేసి, ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉన్నాము. నిపుణులు, మా నిస్వార్థ స్వచ్ఛంద కార్యకర్తల సహకారంతో, వరద ప్రభావిత ప్రాంతాల రైతుల ముఖాల్లో త్వరలోనే తిరిగి చిరునవ్వులు పూయించగలమనే పూర్తి నమ్మకం మాకు ఉంది," అని బీకేఎస్‌కు చెందిన కృష్ణ కాంత బోరా అన్నారు.

**సీఎం సహాయనిధికి విరాళం**

వరద సహాయక చర్యలలో తరచుగా నిర్లక్ష్యానికి గురయ్యే పశువుల యజమానులకు కూడా మద్దతు లభించింది. వరదల వల్ల పశువులు, పశుసంపద నష్టపోయిన వారి నష్టాలను తగ్గించడానికి, బీకేఎస్ రెండు ట్రక్కుల పశుగ్రాసాన్ని ఏర్పాటు చేసి పంపిణీ చేసింది. క్షేత్రస్థాయి పనులతో పాటు, బీకేఎస్ రాష్ట్ర ప్రభుత్వ బృహత్తర సహాయక యంత్రాంగానికి కూడా మద్దతునిచ్చింది. సంఘ్‌తో అనుబంధం ఉన్న మూడు రైతు ఉత్పత్తిదారుల సంఘాలు (ఎఫ్‌పీఓలు) ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 3 లక్షలు విరాళంగా అందించాయి. ఇది కష్టాల్లో ఉన్న ఇతరులకు అండగా నిలబడాలనే నిస్వార్థపూరితమైన ప్రయత్నానికి నిదర్శనం.

**ముఖ్యాంశాలు**

- శివసాగర్ జిల్లాలో 50 మంది స్వచ్ఛంద కార్యకర్తల సహకారంతో మూడు వందల మంది వరద బాధితులకు సహాయక సామాగ్రి అందింది.
- శివసాగర్‌లో వ్యవసాయ భూమిలో వరినాట్లు వేశారు. ఈ చర్య వల్ల 600 మందికి పైగా రైతులు లబ్ధి పొందారు.
- ఏడు జిల్లాల నుండి 200 మందికి పైగా స్వచ్ఛంద కార్యకర్తలు సహాయక, పునరావాస పనులలో నిమగ్నమై ఉన్నారు.
- 5,000 మందికి పైగా విద్యార్థులు పాఠశాల యూనిఫారాలు అందుకున్నారు. శివసాగర్‌లోని 3,000 మంది విద్యార్థులకు అదనంగా స్కూల్ బ్యాగులు, జామెట్రీ బాక్సులు, పెన్నులు, నోట్‌బుక్‌లు అందాయి.
- మూడు రైతు సంఘాలు ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ.3 లక్షలు విరాళంగా అందించాయి.
- 100 మంది స్వచ్ఛంద కార్యకర్తల మద్దతుతో ఏర్పాటు చేసిన శిబిరాలలో సుమారు 500 మంది ఆరోగ్య పరీక్షలు చేయించుకున్నారు. చికిత్స పొందారు.
- మోరిగావ్‌కు చెందిన 50 మందితో కూడిన స్వచ్ఛంద కార్యకర్తల బృందం శివసాగర్‌లో నాలుగు రోజుల పాటు పారిశుధ్య పనులు, గృహ పునర్నిర్మాణ పనులలో నిమగ్నమైంది.
- వరద బాధితులైన పశువుల యజమానులకు రెండు ట్రక్కుల పశుగ్రాసం పంపిణీ జరిగింది.
- 50 మంది మహిళా రైతులకు జీవనోపాధి పునరుద్ధరణకు పుట్టగొడుగు పంటకు సంబంధించిన విత్తనాలు, ఇతర సామాగ్రి అందింది.
- శివసాగర్‌లోని గెలెకిలో 50 మంది సన్నకారు తేయాకు రైతులకు సేంద్రియ ఎరువులు ,సేంద్రియ పురుగుమందులు అందాయి.
- సుమారు 5,000 వరద బాధిత కుటుంబాలకు పునరావాస మద్దతు, వ్యవసాయం, పశుసంపద, జీవనోపాధిని పునర్నిర్మించుకోవడంలో సాయంపై భారతీయ కిసాన్ సంఘ్ ప్రధానంగా దృష్టిని కేంద్రీకరించింది.

**ఆర్గనైజర్ సౌజన్యంతో**

# విశ్వజనని నవరాత్రుల సంరంభం

**దుర్గాదేవి విశ్వవ్యాప్త దేవత. మనోమాలిన్యాలను తొలగించే దుర్గాదేవిని విశ్వజనని/దేవతగా ఆరాధిస్తారు. దానవబాధ ప్రబలినప్పుడు వారి సంహారానికి అవతరిస్తుంటానని (ఇత్థం యదాయదా బాధా దానవోత్థా భవిష్యతి/తదా తదావతార్యహం కరిష్యామి) అని భగవతి చెప్పినట్లు 'దుర్గా సప్తశతి' పేర్కొంటోంది. శుంభవిశుంభులు, చండముండులు, రక్తబీజుడు, దుర్గముడు, అరుణుడు, మహిషాసురుడు తదితర అసురులను దుర్గాదేవి శరన్నవరాత్రులలోనే, సంహరించి లోకానికి శాంతిని ప్రసాదించింది.**

శక్తిపూజ జాతి మనుగడకు శ్రీరామరక్ష అనే నిత్యసత్యాన్ని ప్రతిపాదించేవే శరన్నవరాత్రులు వేడుకలు. శరదృతువులో జరుగుతాయి కాబట్టి శరన్నవరాత్రులు, దేవీ నవరాత్రులు అని పిలుస్తారు. ఆశ్వయుజ శుద్ధ పాడ్యమి నుంచి నవమి వరకు తొమ్మిది రూపాల్లో అమ్మవారిని అర్చిస్తారు. ఈ తొమ్మిది రోజుల్లో పరాశక్తి మొదటి మూడునాళ్లు మహాకాళిగా, తరువాతి మూడు రోజులు మహాలక్ష్మిగా, చివరి మూడు రోజులు మహాసరస్వతిగా కొలువుదీరి ఉంటుంది. ఆలయాలలో, మఠాలలో, మందిరాల్లో, వీధి మండపాల్లో భక్తి శ్రద్ధలతో దేవీ పూజ జరుపుకోడం ఆనవాయితీగా వస్తోంది.

శైవులు, వైష్ణవులు, శాక్తేయులు ఆయా ప్రాంతాలలో కొద్ది మార్పులతో దేవీపూజ నిర్వహిస్తారు. అమ్మవారిని శైవులు శివశక్తిగానూ, వైష్ణవులు శ్రీమహావిష్ణువు హృదయంలో ప్రకాశించే శ్రీదేవిగా, శాక్తేయులు సర్వదేవతలకు, సర్వ జగత్తులకు జననిగా అర్చిస్తారు. బౌద్ధంలోని వజ్రయాన శాఖకు చెందిన వారు తాంత్రిక పద్ధతులలో ఆరాధన చేసే సంప్రదాయం ఉంది. జైనులు శక్తిరూపాలైన విద్యా దేవతలను,శాసన దేవతలను పూజించేవారు. సిక్కు మత గురువు గురుగోవింద్‌సింగ్ దశమగ్రంథంలో శాక్తేయ దేవతలను ప్రస్తావించారు.

నవరాత్రులలో నిత్యం పారాయణం చేసే గ్రంథం దేవీమహాత్మ్యం. అమ్మవారి ప్రతిరూపంగా పరిగణించే ఈ సప్తశతి పారాయణం శుభప్రదమని, కలుషహారమని శాక్తేయుల విశ్వాసం. శైలపుత్రి, బ్రహ్మచారిణి, చంద్రఘంట, కూష్మాండ, స్కందమాత, కాత్యాయని, కాళరాత్రి, మహాగౌరి, సిద్ధిధాత్రి...అనే పేర్లతో దుర్గాదేవిని ఈ తొమ్మిది రోజులు అర్చిస్తారు ('మహామాయ, మహిషారుమర్దని, మహాసరస్వతి, నంద, రక్తదంతి, శాకంబరి, దుర్గాదేవి, మాతంగి, భ్రమర... అనే పేర్లను చండీ సప్తశతి.. పేర్కొంటోంది).

నవరాత్రులలో వరుసగా కనకదుర్గ, బాలా త్రిపురసుందరి, గాయత్రీమాత, అన్నపూర్ణాదేవి, లలితా త్రిపుర సుందరీ దేవి, సరస్వతీ దేవి, మహాలక్ష్మీదేవి, దుర్గాదేవి, మహిషాసురమర్దిని, శ్రీరాజరాజేశ్వరీదేవి రూపాలుగా అమ్మవారు దర్శనం ఇస్తూ, వైభవోపేతంగా పూజలు అందుకుంటారు. అమ్మవారిని రోజుకో రంగు వస్త్రంతో అలంకరించి,



ప్రీతికర పదార్థాలను నైవేద్యంగా సమర్పిస్తారు. ఈ తొమ్మిది రోజుల్లో పరాశక్తి మొదటి మూడునాళ్లు మహాకాళిగా, తరువాతి మూడు రోజులు మహాలక్ష్మిగా, చివరి మూడు రోజులు మహాసరస్వతిగా కొలువుదీరి ఉంటుంది. కారణాంతరాల వల్ల నవరాత్రులూ పూజించలేని వారు త్రిరాత్ర (సప్తమి, అష్టమి, నవమి) దీక్ష చేసే సంప్రదాయం ఉంది. ఈ దీక్ష మూలానక్షత్రంతో కూడిన షష్ఠి లేదా సప్తమి నాడు మహాసరస్వతిని ఆవాహన చేయడంతో ఆరంభమై విజయదశమి నాడు శమీపూజతో ముగుస్తుంది. శ్రీచక్రపూజ కూడా ప్రాధాన్యతను సంతరించుకుంది. కన్యకాపూజ, సుమంగళి, మహాచండీయాగం వంటివి నిర్వహిస్తారు. వ్రతదీక్షాపరులు అష్టమి నాడు కానీ, నవమి నాడు కానీ తొమ్మిది మంది కుమారీలకు (2-10 ఏళ్ల మధ్య వయస్కులు) భోజనంపెడతారు. వారిని కుమారి, త్రిమూర్తి, కల్యాణి, రోహిణి, కాళి, చండిక,శాంభవి, దుర్గ, సుభద్ర అని వ్యవహరిస్తారు.. నవరాత్రి పూజల ద్వారా సమాజంలో నిష్ఠ, సద్భావన, భక్తి భావనలు పెంపొందమే కాక, సమాజంలో వ్యక్తులు మధ్య సత్సంబంధాలు ఏర్పడి సంఘటిత శక్తిగా ఆవిర్భవించేందుకు దోహదమవుతుంది.

'న తే నామగోత్రే న తే జన్మమృత్యు/న తే ధామ చేష్టే న తే దుఃఖసౌఖ్యే/ న తే మిత్రశత్రు నతే బంధ మోక్షౌ/ స్వమేకా పరబ్రహ్మ రూపేణ సిద్ధా'(నీకు నామ గోత్రాలు లేవు. జనన మరణాలు లేవు. బంధ మోక్షాలులేవు. అద్వితీయ పరబ్రహ్మవు)అనే మహాకాళి సంహితలోని శ్లోకం జగన్మాత స్వభావ, స్వరూపాలను వివరిస్తోంది. 'అవిద్య అనే అంతరంగపు చీకటిని పారదోలే సూర్యుని వంటి, జడత్వంలోని వారిని జాగృత పరచే అమృతధారవు. దరిద్రుల కోరికలను తీర్చే చింతామణివి.జనన మరణాలనే సంసారంలో కూరుకపోయిన వారిని వరాహ మూర్తిలా ఉద్ధరించే దయామయివి' (అవిద్యానామన్త స్తిమిర మిహిర ద్వీపనగరీ/జడానాం చైతన్య స్తబక మకరన్ద శ్రుతిఝరీ/దరిద్రాణాం చింతామణి గుణనికా జన్మజలధౌ / నిమగ్నానాం దంష్ట్రా మురరిప వరాహస్యయ భవతి)అని శంకరభగవత్పాదులు కీర్తించారు. అమ్మవారిని శ్రద్ధగా ఆరాధిస్తే అజ్ఞానం తొలగిపోతుంది. దారిద్ర్యం ధ్వంసమైపోతుంది. కష్టాల నుంచి అమ్మ వాత్సల్యం కాపాడుతుంది. మన జీవితాలను ఆనందమయం చేస్తుందని విశ్వాసం. నవరాత్రులలో చివరి మూడు రోజులు దుర్గాష్టమి, మహర్నవమి, విజయదశమి మరింత విశిష్టమైనవి.

**'బతుకు' ఇచ్చే అమ్మ**

శరన్నవరాత్రులలో ముఖ్యంగా తెలంగాణ ప్రాంతంలో 'బతుకమ్మ' ప్రధాన పండుగ. బతుకమ్మను బతుకునిచ్చే అమ్మగా కీర్తిస్తూ, 'త్రిమాత'ల స్వరూపంగా పూజిస్తారు. బతుకమ్మను పూజించడం అంటే ప్రకృతిని ఆరాధించడమేనని భావిస్తారు. తంగెడు, మోదుగ, గన్నేరు, తామర, బంతి, కనంకాబరం, నిత్యమల్లి,గానుగు తదితర పూవులతో బతుకమ్మను ఏడు పొరలుగా వలయాకారంలో తీర్చిదిద్దుతారు. బతుకమ్మ చుట్టూ తిరుగుతూ చేతులు తడుతూ, పాటలు పాడతారు. వాటికి అనుగుణంగా కోలాటాలు వేస్తారు. ఈ పాటలు జానపద సాహిత్యానికి అద్దం పడతాయి. రామాయణ, భాగవతాది కథలను జానపదబాణీలో ఆలపిస్తారు. ఆ రాష్ట్ర ప్రభుత్వం 'రాష్ట్ర పండుగ'గా గుర్తించింది.



**డా॥ ఆరవల్లి జగన్నాథస్వామి**
సీనియర్ జర్నలిస్ట్

# మోదఖేదాల



బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర వాయుగుండం రాష్ట్రాన్ని కుదిపేస్తూనే, అదే సమయంలో ఎన్నో నెలలుగా ఎదురు చూస్తున్న వరాన్ని కూడా మోసుకొచ్చింది. ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలను వణికించిన ఈ భారీ వర్షాలు నదులు, వాగులను ఉప్పొంగించి జనజీవనాన్ని అస్తవ్యస్తం చేశాయి. ఇళ్లు, పంటలు నీట మునిగాయి, రాకపోకలు స్తంభించాయి. అయితే మరోవైపు ఎల్‌నినో ప్రభావంతో ఎండిపోయిన పైరులను ఆదుకున్నట్లు ఇదే వర్షం అన్నదాతలలో కొత్త ఆశలు నింపింది. నెలల తరబడి చినుకు కోసం ఎదురుచూసిన నేలతల్లికి, అడుగంటిన జలాశయాలకు ఈ వరద కొంత ఊరటనిచ్చిందని చెప్పక తప్పదు. నష్టం ఒక పార్శ్వమైతే, ఊరట మరో పార్శ్వం- ఈ రెండు కోణాల నుంచి రాష్ట్రాన్ని పలకరించిన ఈ ప్రకృతి పరిణామాన్ని ఒకసారి పరిశీలిస్తే....

మూడు రోజుల పాటు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలకు ఉత్తరాంధ్ర అతలాకుతలమైంది. సెప్టెంబరు 24 రాత్రి నుంచి మర రెండు రోజులు ఒడిశాలో కురిసిన భారీ వర్షాల ప్రభావం శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలపై స్పష్టంగా కనిపించింది. నాగావళి, వంశధార నదులు ఉగ్రరూపం దాల్చాయి. నాగావళికి 76 వేల క్యూసెక్కుల ప్రవాహం వచ్చింది. వంశధారకు 48,546 క్యూసెక్కులు, బహుదా నదికి 36,645 క్యూసెక్కుల మేర వరద కొనసాగింది. ఈ జిల్లాలో 12,770 హెక్టార్లలో వరి, పత్తి, ఉద్యాన పంటలు దెబ్బతినగా, 445 విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. 413 ఇళ్లు, 81 ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. నాగావళి నదికి వరద పోటెత్తడంతో పలు గ్రామాలు జలదిగ్బంధంలోనే మిగిలిపోయాయి. ఒక్క విజయనగరం జిల్లాలోనే 22 గ్రామాలు పూర్తిగా నీటిలో చిక్కుకుపోగా, 80 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వాగులు ఉద్ధృతంగా ప్రవహిస్తుండటంతో ఈ జిల్లాతో పాటు శ్రీకాకుళం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లోని కాలనీల్లోకి సైతం నీరు చేరింది. ఏజెన్సీ ప్రాంతాల్లో చెట్లు, కొండచరియలు విరిగిపడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కొండలు, లోయలతో నిండిన ఈ ప్రాంతాల్లో ప్రతి వర్షాకాలంలో ఇలాంటి ఇబ్బందులు మామూలేనని స్థానికులు చెబుతున్నా, ఈసారి వర్షాల తీవ్రత అంచనాలను మించిపోయింది.

విజయనగరం జిల్లాలో వేగావతి, సువర్ణముఖి నదుల నుంచి మడ్డువలస జలాశయంలోకి వరద నీరు చేరడంతో గేట్లు ఎత్తి 30 వేల క్యూసెక్కులను దిగువకు వదిలారు. సువర్ణముఖి ఉద్ధృతికి కొండబార్రపల్లి-కొప్పర మధ్య గీతనాపల్లికి రాకపోకలు నిలిచిపోగా, మంగళ-రాజాం మార్గంలో అరిసాడ సమీపంలో చిన్నగెడ్డ ప్రవాహంతో పాటు పెచ్చెచెరువుకు గండి పడటంతో ప్రధాన రహదారిలోని కల్వర్టు కొట్టుకుపోయింది. పార్వతీపురం మన్యం జిల్లాలో నాగావళి ఉధృతికి అన్నవరం గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుపోగా, 1600 మందికి అధికారులు తాగునీరు, ఆహారం అందించారు. పాలకొండ నగర పంచాయతీ శివారు ప్రాంతాలు సైతం నీట మునిగాయి.

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో చోటు చేసుకుంది. లక్ష్మీపురం పంచాయతీ కళ్లాపాడోర్ సమీపంలో వ్యవసాయ పనుల నిమిత్తం గెడ్డ దాటి వెళ్లిన నలుగురు గిరిజనులు, తిరుగు ప్రయాణంలో ఒక్కసారిగా పెరిగిన వరదకు కొట్టుకుపోయి, కొంతదూరంలో ఒడ్డున గల చెట్టు కొమ్మను గట్టిగా పట్టుకుని, ప్రాణాలతో బయటపడ్డారు. క్షణమాత్రంలో మృత్యువును ఢీకొట్టి బయటపడ్డ ఈ నలుగురి అనుభవం, వరద ఉధృతి ఎంతటి ప్రమాదకరంగా మారిందో కళ్లకు కడుతుంది. ఇదే జిల్లాలో జీకే వీధి మండలం ధారకొండ ఆలయ సమీపంలో కొండచరియలు, చెట్లు విరిగిపడి సీలేరు మార్గం మూసుకుపోయింది. లంబసింగి-తాజంగి వంతెన ప్రమాదకరంగా మారడంతో రాకపోకలు నిలిపివేయగా, అనంతగిరి, అరకు మండలాల్లోనూ కొండచరియలు విరిగిపడటం, తాత్కాలిక కల్వర్టులు కొట్టుకుపోవడం వంటి ఘటనలు చోటుచేసు కున్నాయి. జి.మాడుగుల మండలంలో రహదారి దెబ్బతినగా, ముంచంగిపుట్టు మండలంలోనే మరో వ్యక్తి కొట్టుకుపోయి, తర్వాత క్షేమంగా బయటపడ్డారు.

గోదావరిలోనూ నీటి మట్టం పెరగడంతో ధవళేశ్వరం బ్యారేజీ నుంచి మూడు రోజుల పాటు 9 లక్షల క్యూసెక్కుల నీటిని సముద్రంలోకి వదిలారు. కోనసీమలోని పలు లంక ప్రాంతాల్లో పొలాలు, ఇళ్లు, రహదారులు ముంపునకు గురయ్యాయి. ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద ప్రవాహాలతో ఉమ్మడి కృష్ణా జిల్లాలో బుడమేరు, మునేరు పొంగిపొర్లగా, దీని ప్రభావంతో కృష్ణా నదికి వరద మరింత పెరిగింది. కృష్ణా డెల్టా, ఉమ్మడి పశ్చిమ డెల్టాల సాగునీటి అవసరాల కోసం పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి పోలవరం ప్రాజెక్టు కుడి కాలువకు 7,788 క్యూసెక్కులు విడుదల చేశారు.

**నిండిన జలాశయాలు**

రాష్ట్రవ్యాప్తంగా వాయుగుండం తీరం దాటిన మూడు రోజుల్లో సగటున 20 నుండి 30 మి.మీ మేర విస్తారమైన వర్షాలు కురిశాయి. కొన్ని ప్రాంతాల్లో 200-300 మి.మీ వరకు కూడా వర్షపాతం నమోదైంది. వాయుగుండం ప్రభావంతో విశాఖపట్నంలోని వాల్తేరులో అత్యధికంగా 28 సెంటీమీటర్ల (280 మి.మీ) భారీ వర్షపాతం నమోదైంది. శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లా, కాకినాడ, ఉభయ గోదావరి, ఏలూరు, కోనసీమ జిల్లాల్లో భారీ వర్షాలు కురిశాయి. ఈ వాయుగుండం కురిపించిన వర్షాల వల్ల ఆంధ్రప్రదేశ్‌లో అప్పటి వరకు ఉన్న నైరుతి రుతుపవనాల వర్షపాత లోటు గణనీయంగా తగ్గింది. సెప్టెంబర్ 15 నాటికి రాష్ట్రంలో 43% గా ఉన్న వర్షపాత లోటు, ఈ రెండు మూడు రోజుల భారీ వర్షాల తర్వాత సెప్టెంబర్ 25 నాటికి 22%కి తగ్గింది.

నష్టం ఎంత జరిగినా, ఈ వర్షాలు రాష్ట్ర జలవనరులకు కొత్త ఊపిరి పోశాయనడంలో సందేహం లేదు. ఈ ఏడాది ఎల్‌నినో ప్రభావంతో ఒక్క టీఎంసీ నీరు కూడా అమూల్యంగా మారిన తరుణంలో, తీవ్ర వాయుగుండం కారణంగా కురిసిన వర్షాలు మూడు రోజుల వ్యవధిలోనే రాష్ట్రవ్యాప్తంగా జలాశయాలకు 22 టీఎంసీల నీటిని అదనంగా తీసుకొచ్చాయి. జూన్ తర్వాత రాష్ట్ర జలవనరుల శాఖకు ఇదే తొలి చల్లని కబురు. ఈ ఏడాది తొలిసారిగా రాష్ట్రంలో సగటు భూగర్భ జలమట్టం 95 సెంటీమీటర్ల మేర పెరగడం విశేషం.

ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలైన శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నంలోని 11 జలాశయాల్లో

# నడుమ వర్షాలు





సెప్టెంబరు 23న 12.13 టీఎంసీలు ఉన్న నిల్వలు 18.10 టీఎంసీలకు చేరాయి. అంటే 5.964 టీఎంసీల నీరు అదనంగా వచ్చి చేరింది. ఇందులో హీరమండలంలో 1.505, తాండవలో 1.262, మడ్డువలసలో 1.285 టీఎంసీల మేర పెరుగుదల కనిపించింది. ఉత్తరాంధ్ర మినహా మిగిలిన తొమ్మిది జిల్లాల్లోని 18 జలాశయాల్లో 88.84 టీఎంసీల నుంచి 105.06 టీఎంసీలకు నిల్వలు చేరి, 16.217 టీఎంసీల మేర పెరిగాయి. విశాఖ తాగునీటి అవసరాలు తీర్చే ఏలేరు జలాశయంలో 3.430, దొంకరాయిలో 3.5, సోమశిలలో 2.029, గండికోటలో 1.106 టీఎంసీల మేర నిల్వలు పెరగడం విశేషం. వీటికి తోడు రాష్ట్రవ్యాప్తంగా చిన్న చెరువులు సైతం నిండుకుండల్లా మారాయి.

**రబీకి సన్నద్ధం**

జలాశయాల్లో, భూగర్భంలో ఇలా జలకళ సంతరించుకోవడం రైతాంగానికి మేలు చేసే పరిణామం. ఖరీఫ్ సీజన్ మధ్యలో వర్షాభావంతో ఎండుముఖం పట్టిన పంటలకు కాలువల ద్వారా నీరు అందే అవకాశం మెరుగుపడటంతో పాటు, రానున్న రబీ సీజన్‌కు సైతం ఈ నిల్వలు ఉపయోగపడనున్నాయి. బోరుబావులపై ఆధారపడిన రైతులకు భూగర్భ జలమట్టం పెరగడం ప్రత్యక్షంగా కలిసొచ్చే అంశం. వర్షాభావ పరిస్థితుల వల్ల మే నెలాఖరులో సగటున 10.10 మీటర్ల లోతున ఉన్న భూగర్భజలాలు, సెప్టెంబరు 23 నాటికి 11.04 మీటర్లకు అడుగంటాయి. తాజా వర్షాలతో ఈ పరిస్థితి తారుమారై, సగటు భూగర్భ జలమట్టం 10.09 మీటర్లకు మెరుగుపడింది. దీనివల్ల భూగర్భంలో సుమారు 90 టీఎంసీల నీటి నిల్వలు అదనంగా చేరినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.

**నిండుకుండలా సుంకేశుల**

ఈ మార్పునకు నిదర్శనంగా నిలిచింది కర్నూలు జిల్లాలో తుంగభద్ర నదిపై ఉన్న సుంకేసుల జలాశయం. కొద్ది రోజుల క్రితం వరకు ఇసుక దిబ్బలతో వెలవెలబోయిన ఈ జలాశయం, మూడు రోజుల వ్యవధిలోనే నిండుకుండలా మారింది. 1.20 టీఎంసీల సామర్థ్యం గల ఈ జలాశయంలో 1.026 టీఎంసీల నిల్వ చేరింది. ఈ సీజన్‌లో ఇది రెండోసారి పూర్తిస్థాయిలో నిండటం విశేషం. 11 వేల క్యూసెక్కుల వరద వచ్చి చేరుతుండగా, కేసీ కెనాల్‌కు ఈ సీజన్‌లో తొలిసారిగా 2,500 క్యూసెక్కులను విడుదల చేశారు. జూన్‌లో కురిసిన వర్షాలకు ఒకసారి పూర్తిగా నిండిన సుంకేసుల, ఆ తర్వాత ఎల్‌నినో ప్రభావంతో వర్షాలు లేక, తుంగభద్ర డ్యామ్ నుంచి దిగువకు నీరు విడుదల చేయలేని పరిస్థితి ఏర్పడింది. 6.50 లక్షల జనాభా గల కర్నూలు నగరానికి తాగునీటి సరఫరా ఇబ్బందుల్లో పడి, ఫోర్‌షోర్ ప్రాంతంలో ఇసుక మేటలు తేలగా, అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు సిద్ధమవుతున్న తరుణంలో బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ప్రభావంతో తుంగభద్ర, హగరి నదీ పరీవాహక ప్రాంతాల్లో కురిసిన వర్షాలు కర్నూలువాసుల దాహార్తిని తీర్చాయి. ఆర్డీఎస్ ఆనకట్ట ఉప్పొంగి, మంత్రాలయం మీదుగా వచ్చిన వరద సాయంత్రానికి సుంకేసులను చేరడంతో నగరానికి తాగునీటి గండం తప్పిందని నిపుణులు పేర్కొంటున్నారు. జలాశయం నిండటంతో పర్యాటకుల తాకిడి కూడా మొదలైంది. మూడు రోజులుగా కురిసిన వర్షాలతో ఎగువ ప్రాంతం నుంచి భారీగా వరద నీరు రావడంతో అనంతపురం జిల్లా బొమ్మనహాల్ మండలంలోని శ్రీధరఘట్ట చెరువు నిండింది. దీంతో రైతులు సంబరాలు చేసుకున్నారు. ఈ ఏడాది రెండు పంటలకు సరిపడా నీరు చేరిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. చెరువు కింద 450 ఎకరాలకుపైగా ఆయకట్టు ఉంది. వరి నాట్లు జోరందుకున్నాయి.

ఈ తుపాను ఒకవైపు ప్రాణనష్టం, ఆస్తినష్టం మిగిల్చినా, మరోవైపు ఎల్‌నినో దెబ్బకు వాడిపోయిన రాష్ట్ర జలవనరులకు కొత్త జీవం పోసింది. దెబ్బతిన్న రహదారులు, ముంపునకు గురైన పంటలు, నిరాశ్రయులైన కుటుంబాలకు ప్రభుత్వం తక్షణ సాయం అందించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, జలాశయాలు నిండటం, భూగర్భ జలమట్టం మెరుగుపడటం రైతాంగానికి, తాగునీటి కోసం ఎదురుచూస్తున్న ప్రజలకు కొండంత భరోసానిచ్చాయి. ప్రకృతి ఒకవైపు కష్టాన్ని ఇచ్చినా, మరోవైపు తనకు తానే పరిష్కారాన్ని చూపిన తీరు ఇక్కడ కనిపిస్తుంది. రాబోయే రోజుల్లో వర్షాలు ఎలా కొనసాగుతాయో చూస్తూ, నష్టపోయిన ప్రాంతాల్లో సహాయ చర్యలు వేగవంతం చేస్తూనే, ఈ వరాన్ని సద్వినియోగం చేసుకోవడం రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల ముందున్న కర్తవ్యం.



**తురగా నాగభూషణం**
**సీనియర్ జర్నలిస్ట్**



# 'కమల' వికాసానికి మిషన్

**భారతీయ జనతా పార్టీ కొత్త అంచనాలను సిద్ధం చేసుకుంది. ఆయా రాష్ట్రాల వారీగా పార్టీ బలోపేతం చేయడం ద్వారా, క్షేత్రస్థాయిలో పట్టుపై భారీ అంచనాలు పెట్టుకుంది. ప్రధానంగా దక్షిణాది రాష్ట్రాలపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో భాగంగా దక్షిణాదికి 'గేట్ వే'గా భావించే తెలంగాణకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించింది.**

తెలుగు రాష్ట్రాలకు చెందిన నేతలకు పలు రాష్ట్రాల బాధ్యతలు అప్పగించడంతో పాటు.. విన్నింగ్ సెంటిమెంట్‌గా చెప్పుకునే ముఖ్య నాయకులను తెలంగాణ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్‌గా, అలాగే..వ్యూహాల్లో సిద్ధహస్తులైన నాయకులను సహ ఇన్‌చార్జీలుగా నియమించింది. సంస్థాగత నిర్మాణంలో భాగంగా భారీ మార్పులకు శ్రీకారం చుట్టింది. దేశవ్యాప్తంగా భారీగా చేసిన మార్పుల్లో భాగంగా తాజాగా చేపట్టిన నియామకాలు రాష్ట్ర స్థాయి కొత్త సమీకరణాలకు తలుపులు తెరిచాయి.

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన సీనియర్ నాయకులను వివిధ రాష్ట్రాలకు బాధ్యులుగా నియమించింది. కనీసం నలుగురైదుగురు నాయకులను వివిధ రాష్ట్రాల వ్యవహారాలు చూసే కీలక పదవుల్లో నియమించింది. ఈ మేరకు పార్టీ అధిష్ఠానం ఉత్తర్వులు జారీచేసింది. తెలంగాణకు చెందిన రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్.. ఇప్పటికే పార్లమెంటరీ బోర్డు సభ్యులుగా వ్యవహరిస్తున్నారు. వీరికి తోడు.. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రివర్గంలో ఇద్దరు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. కిషన్ రెడ్డి కేంద్ర బొగ్గు, గనుల శాఖ కేబినెట్ మంత్రిగా, బండి సంజయ్ కుమార్ కేంద్ర హోంశాఖ సహాయమంత్రిగా వ్యవహరిస్తున్నారు. వీటన్నింటిని బట్టి చూస్తే.. బీజేపీ అధిష్ఠానం తెలుగు రాష్ట్రాల నేతలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్న విషయం స్పష్టమవుతోంది.

మరోవైపు.. దక్షిణాదిలో, ముఖ్యంగా తెలంగాణలో అధికారాన్ని చేజిక్కించుకోవడమే లక్ష్యంగా పార్టీ కేంద్ర నాయకత్వం కీలక నిర్ణయాలు తీసుకుంది. పార్టీలో సంస్థాగతంగా క్షేత్రస్థాయిలో పట్టు, సంఘటనాత్మక నైపుణ్యం ఉన్న నాయకులకు కీలక బాధ్యతలు అప్పగించడం, రాష్ట్రంలో పార్టీకి కొత్త ఊపిరి పోస్తాయనడంలో సందేహం అవసరం లేదంటున్నారు పరిశీలకులు. కొత్త నాయకుల పర్యవేక్షణ, పనితీరు ఆధారంగా ఇప్పుడు తెలంగాణలో పార్టీ లెక్కలు మరింత ఊపందుకోనున్నాయి.

**'చిన్నమ్మ' సుష్మా ఆత్మీయ అనుబంధం**

భారతీయ జనతాపార్టీ అధిష్ఠానం తెలంగాణ మీద ప్రత్యేక దృష్టి సారించిన ఈ సమయంలో రాష్ట్రానికి సంబంధించి ఆ పార్టీకి ఉన్న భావోద్వేగ అనుబంధం గురించి అనివార్యంగా చెప్పుకోవాల్సి ఉంది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియలో బీజేపీ పోషించిన పాత్ర కేవలం రాజకీయపరమైనది మాత్రమే కాదు..అది ఒక భావోద్వేగపూరితమైన అనుబంధం. ముఖ్యంగా దివంగత నాయకురాలు తెలంగాణ 'చిన్నమ్మ'గా పేరు పొందిన సుష్మాస్వరాజ్ సాక్షాత్తూ పార్లమెంట్ వేదికగా ప్రదర్శించిన ఆవేదన, రాష్ట్ర ఏర్పాటు, అవసరంపై స్పష్టత ఇక్కడి ప్రజల హృదయాల్లో బలమైన ముద్ర వేసింది. తెలంగాణ ఉద్యమ సమయంలో విద్యార్థులు, యువత ప్రాణత్యాగాలు చేయడం పట్ల ఆమె తీవ్రంగా చలించిపోయారు. పార్లమెంటులో కంటతడి పెట్టుకున్నారు.'ఈ బలిదానాలు ఆపండి' అని విజ్ఞప్తి చేశారు. తాము తప్పకుండా తెలంగాణ ఇస్తామని భరోసా ఇచ్చారు. ఇంత స్పష్టమైన భరోసా పార్లమెంటులో ఏ పార్టీ నాయకులు ఇవ్వలేదు. ఇప్పుడు తెలంగాణ వచ్చింది. రాష్ట్రానికి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటూనే, గత పదేళ్ల కాలంలో రాష్ట్రంపై కేంద్రం ప్రత్యేక దృష్టిని కొనసాగిస్తోంది. అభివృద్ధి విషయంలో ఎక్కడా వెనకాడకుండా భారీగా నిధులను కేటాయిస్తోంది. రాష్ట్రంలో బీజేపీ అధికారంలో లేకపోయినప్పటికీ..రాష్ట్ర అభివృద్ధి కోసం వివిధ పథకాలు, గ్రాంట్ల రూపంలో గడిచిన పన్నెండేళ్లలో ఇప్పటివరకు ఏకంగా 13 లక్షల 13 వేల కోట్ల రూపాయలను కేటాయించింది. ఇది రాష్ట్ర అభివృద్ధి పట్ల ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్రానికి ఉన్న నిబద్ధతకు నిదర్శనంగా ఆ పార్టీ నేతలు చెప్పుకుంటున్నారు.

అయితే, జాతీయ స్థాయిలో పార్టీ అధినాయకత్వానికి గల నిబద్ధత, తెలంగాణ ప్రజల్లో బీజేపీకి ఉన్న ఆదరణ ఎందుకు ఓటుబ్యాంకుగా మారడం లేదన్న అంశాలనూ ఆ పార్టీ విశ్లేషిస్తోంది. రాష్ట్రం సిద్ధించిన తర్వాత బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖరరావు రాష్ట్ర అవతరణ తన పేటెంట్ మాదిరిగా ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లగలిగారు. తన వాక్చాతుర్యంతో.. స్థానిక యాస, ప్రాసల ప్రభావంతో ప్రజలను మెప్పించగలిగారు. అయితే, బీఆర్ఎస్ పాలన ముగిసిన తర్వాత కొన్ని సమీకరణాలు బెడిసి కొట్టడం వల్ల ప్రజలు ప్రత్యామ్నాయాన్ని ఎంచుకోవడంతో..కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటికీ.. ప్రజల్లో వ్యతిరేకత పెల్లుబుకుతోన్న అంశాన్ని బీజేపీ అధిష్ఠానం గ్రహించింది.

అందుకే పార్టీ అధికారంలో లేకపోయినప్పటికీ రాష్ట్రానికి సంబంధించిన ఆర్థిక, సంక్షేమ అంశాల్లో ఎక్కడా వివక్ష చూపించడం లేదన్నది నివేదికలు, లెక్కల్లోనే బహిర్గతమవుతోంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ వైఫల్యాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి ప్రత్యామ్నాయంగా బీజేపీని నిలబెట్టే ప్రయత్నం అధిష్ఠానం చేస్తోంది.




# తెలంగాణ!

**సమన్వయంతో విజయం సాధ్యం**

బీజేపీ అధిష్ఠానం దక్షిణాదికి ‘గేట్ వే’ తెలంగాణను చేజిక్కించుకునేందుకు ఇలా నిర్మాణాత్మక ప్రయత్నాలు చేస్తోంది. క్షేత్రస్థాయిలో పరిస్థితులను అంచనా వేసుకుంటూ.. ఎంపీలు, ఎమ్మెల్యేల పరిధుల్లో పార్టీ పరంగా తీసుకోవాల్సిన చర్యలు, బలోపేతానికి అనుసరించాల్సిన వ్యూహాల గురించి ఎప్పటికప్పుడు ఆదేశాలు జారీచేస్తోందని చెబుతున్నారు. రాష్ట్ర నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ.. నియోజకవర్గాల వారీగా పార్టీని బలోపేతం చేయాల్సిన అవసరాన్ని అధిష్ఠానం గుర్తు చేస్తోందని అంటున్నారు. ఎంపీలు, ఎమ్మెల్యేలు తమ సొంత ఇమేజ్‌ను పెంచుకుంటూనే.. పార్టీకోసం, పార్టీ కేడర్ కోసం ప్రత్యేకంగా సమయం కేటాయించాలని  పార్టీ  పెద్దలు బోధిస్తున్నారని చెబుతున్నారు. పార్టీని, పార్టీ సిద్ధాంతాలను నమ్ముకొని క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్యకర్తల విషయంలో పార్టీకి అనుగుణంగా నడుచుకోవాలని చెబుతున్నట్లు సమాచారం. అలాగే, ఏ ఎన్నికలు జరిగినా ఎంపీలు, ఎమ్మెల్యేలు బీజేపీ అభ్యర్థులను గెలిపించే బాధ్యత తీసుకోవాలని ఇప్పటికే సంకేతాలు అందినట్లు తెలుస్తోంది.

బీఆర్ఎస్ వైఫల్యాలు.. కాంగ్రెస్‌పై అసంతృప్తి బీజేపీకి కలిసివచ్చే అవకాశాలుగా చెబుతున్నారు. అయితే, ఈ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రానికి కొత్త టీమ్ ను కేటాయించిన దరిమిలా ఇక్కడ బీజేపీకి సానుకూల పవనాలు వీస్తున్నప్పటికీ, నాయకులను సమన్వయపరచే బాధ్యత బన్సల్ టీమ్‌పై ఉందంటున్నారు. అంతర్గతంగా పరిస్థితులను చక్కదిద్దుకుంటూనే.. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వైఫల్యాలను, ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన ఆవశ్యకత ఉంది. మరోవైపు.. క్షేత్రస్థాయి నుంచి కార్యకర్తలకు భరోసా ఇస్తూ,  క్షేత్రస్థాయి నుంచి పార్టీ గెలుపుకోసం ప్రత్యేకమైన వ్యూహాలు రూపొందించుకుంటే.. బీజేపీ వ్యూహం ఫలించే అవకాశాలు మెండుగా ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయవచ్చని  రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

**సుజాత గోపగోని**

**సీనియర్ జర్నలిస్ట్, 6302164068**

**నివాళి**

# కేసరి పత్రిక పూర్వ సంపాదకులు ఎం.ఎ.కృష్ణన్ కన్నుమూత

కేరళం రాష్ట్రంలో బాలగోకులం వంటి భారతీయ సాంస్కృతిక వేదికల ఆవిర్భావానికి పాటుపడిన ఆర్ఎస్ఎస్ జ్యేష్ఠ ప్రచారక్ ఎం.ఎ.కృష్ణన్(97) సెప్టెంబర్ 29న కొచ్చిలో కన్నుమూశారు. ‘ఎం.ఎ.సార్’ గా పేరొందిన కృష్ణన్ మలయాళ వారపత్రిక కేసరికి సంపాదకులుగా సేవలందించారు. 1929లో ఇవర్‌కల గ్రామంలో జన్మించిన ఆయన తిరువనంతపురంలో సంస్కృత కళాశాల నుంచి తర్కశాస్త్రంలో ఎం.ఎ. పట్టాను పొందారు. అనంతరం కొట్టాయంలో వజూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ వృత్తిని చేపట్టారు. అదే కాలంలో వజూర్ తీర్థపాదాశ్రమానికి చెందిన శ్రీ విద్యానంద తీర్థపాద స్వామి బోధనలకు ప్రభావితులయ్యారు. స్వామి వివేకానంద ప్రసంగాల ప్రభావం కూడా ఆయనపై ఉంది. 1947లో ఆర్ఎస్ఎస్ శాఖలో చేరారు. 1954లో ఉపాధ్యాయ పదవికి రాజీనామా చేసి ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా మారారు. అనంతరం కొట్టాయం, ఎర్నాకుళం, కొల్లం, కోజికోడ్ జిల్లాలలో పని చేశారు. 1964లో కేసరి పత్రిక సంపాదకులుగా పదవీబాధ్యతలు చేపట్టారు. 1990వరకు అదే పదవిలో కొనసాగారు. కేరళంలో బాలగోకులం, తపస్య కళాసాహిత్య వేది లాంటి బాలలు, సంస్కృతికి సంబంధించిన వేదికల ఏర్పాటులో ముఖ్య భూమికను పోషించారు. అమృతభారతి, బాలసంస్కార కేంద్రం, బాలసాహితీప్రకాశన్, అంతర్జాతీయ శ్రీకృష్ణ కేంద్రం వంటి వేదికలకు మార్గదర్శనం చేశారు. బాలల హక్కుల పరిరక్షణకు ఉద్దేశించిన సౌరక్షిక ఉద్యమానికి ఊతమిచ్చారు.



1967లో కోజికోడ్‌లో జనసంఘ్ జాతీయ సదస్సుకు సంబంధించిన సంస్థాగత ఏర్పాట్లలో చురుకుగా పాలుపంచుకున్నారు. ‘నకల్‌యాన్’ కలం పేరుతో సదస్సుపై రాసిన ప్రత్యేక కథనాన్ని కేసరి పత్రికలో ప్రచురించారు. అనంతర కాలంలో జనసంఘ్ నేత దీనదయాళ్ ఉపాధ్యాయ ముఖ చిత్రంగా కేసరి ప్రత్యేక సంచికను వెలువరించారు. సంస్కృతి, సాహిత్యం, విద్య, వారసత్వ సంపద పరిరక్షణ, బాలల వికాసం దిశగా అనేక దశాబ్దాలుగా సేవలు అందించారు. భారతీయ సంస్కృతి, సంప్రదాయాలు, వారసత్వ సంపదతో యువతరాన్ని అనుసంధానం చేయడానికి పలు ఉద్యమాలకు నేతృత్వం వహించారు. కోజికోడ్‌లో చరిత్రాత్మక థాలి దేవాలయ పరిరక్షణకు కృషి చేశారు. ఆ క్రమంలో 1968లో థాలి దేవాలయంలో పూజలు జరపడానికి అనుమతించాలని పట్టుబడుతూ జరిగిన ఉద్యమంలో ముఖ్య భూమికను పోషించారు. ఆర్ఎస్ఎస్ ప్రచారక్, కేసరి పత్రిక సంపాదకత్వ పాత్రలకే కృష్ణన్ పరిమితం కాలేదు. సంస్కృతి, సంప్రదాయల పరిరక్షణలో రచయితలు, చరిత్రకారులు, సాంస్కృతిక కార్యకర్తలు, సామాజిక కార్యకర్తలను ఏకం చేయడంలో ఆయన సామర్థ్యం అనిర్వచనీయమైనదని ఆయన అనుయాయులు, ఆయనతో కలిసి పనిచేసినవారు ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ★



# ఏ వెలుగులకీ ప్రస్థానం?

9

"ధరణి ఇక్కడికి దగ్గరో సవర కొండల్లోని ఓ పల్లెలో ఉంది. వనజని తీసుకొచ్చి చూపించమంటూ నెల క్రితం మా ఊళ్లోని ఒక వ్యక్తి ద్వారా కబురు పెట్టింది. ఆ పిల్ల నా దగ్గర లేదని, మీ దగ్గర పెరుగుతున్నాది" అని చెప్పి అతనితో ఆమెకు మీ అడ్రస్ పంపించాను. అందుకే అది మీకు ఉత్తరం రాసి ఉంటుంది. కానీ అక్కడికి వెళ్లడం చాలా ప్రమాదం బాబూ! ఆ కొండలమీద నక్సలైట్ల స్థావరం ఉందన్న అనుమానంతో పోలీసులు మాటువేసి గాలిస్తున్నారు.

ధరణి రెండేళ్ల నుంచీ క్షయ వ్యాధితో బాధపడుతూ, నక్సల్ కార్యకలాపాలకు దూరంగా ఆ ఊళ్లో ఒంటరిగా ఉంటోంది. పోనీ ఇక్కడికి వస్తే మంచి వైద్యం చేయిద్దామనుకుంటే అది సాధ్యం కాదు. దాని మొగుడు సోమన్న ఎక్కడ ఉన్నాడో, ఏమయ్యాడో తెలియదు. అది వాడిని వెతుక్కుంటూ వెళ్లి కష్టాలపాలైంది బాబూ! నక్సల్ అనే ముద్రపడితే వాళ్లు బయటకు రావడం కష్టం. పోలీసులు వాళ్లని నమ్మరు సరికదా వేటాడతారు. దొరికితే హింసలు పెట్టి వాళ్ల ద్వారా మిగతా వాళ్ల ఆచూకీ కనుక్కొంటారు. అయితే ఉద్యమంలో ఉన్నవారు చనిపోవడానికైనా సిద్ధపడతారు కానీ ఇతరుల వివరాలు సాధారణంగా చెప్పరు. ఏదైనా మీరింత దూరం వచ్చారు కాబట్టి ధరణి ఉంటున్న గ్రామానికి చేరే దారి చెబుతాను. మా మామ కొడుకు రామన్న అప్పుడప్పుడు అక్కడికి వెళుతుంటాడు. వాడిని మీకు తోడుగా పంపిస్తాను. రేపు ఉదయాన్నే బయలుదేరి వెళ్లండి. కాకపోతే మీ భార్య కౌసల్యని ఇక్కడ వది లేయండి. ఆమె కొండలు ఎక్కలేరు' చెప్పింది గౌరి.

..................

ఆ మర్నాడు తెల్లవారుజామున 5 గంటలకు శ్రీధర్, ప్రియ... రామన్నతో కలసి ధరణి ఉంటున్న రెబ్బ తండాకి బయలుదేరారు. అది కెంగువకు పాతిక కిలోమీటర్ల దూరంలో ఉంది. పూర్తిగా కొండలలో ఎగుడు దిగుడుల మధ్య నడవాలి. రామన్నకి ఆ ప్రాంతమంతా కొట్టిన పిండి కావటంతో అతను వడివడిగా కొండ లెక్కుతునాడు. ప్రియ కూడా అతని వెంట ఉత్సాహంగా నడుస్తోంది. శ్రీధర్ మాత్రం ప్రతి పది నిమిషాలకు కాసేపు విశ్రాంతి తీసుకుంటూ నడవసాగేడు. 8 గంటలయ్యే సరికి వాళ్లు బీరుపాడు అనే గిరిజన గ్రామం చేరుకున్నారు.

ఆ ఊరి పొలిమేరలో ఉన్న పెద్ద మర్రిచెట్టు దగ్గర ముగ్గురూ కూర్చున్నారు. ఆ ఊరు చూడటానికి చాలా చిన్నది. కొండవాలులో అక్కడక్కడ విసిరేసినట్లు న్నాయి ఇళ్లు.

"రామన్నా! ఈ ఊళ్లకి ఇంకా రోడ్లు రాలేదా?" అడిగాడు శ్రీధర్.

"కట్టం బాబూ! ఈ ఊళ్లో చాలా ఎత్తైన కొండల్లో ఉండటం వల్ల రోడ్లు వెయ్యటం కట్టం. అయినా అన్నలకు భయపడి ఏ ఉద్యోగి ఇటువైపు రాడు. నాలుగేళ్ల క్రితం రోడ్డు వెయ్యడానికి ఓ కంట్రాక్టర్



**'జాగృతి' నిర్వహించిన స్వర్గీయ కొండపాక కిషన్‌రావు స్మారక నవలల పోటీలో ద్వితీయ బహుమతి పొందిన రచన**

వస్తే అతని రోలర్ని, ట్రాక్టర్లను అన్నలు కాల్చేసినారు. దాంతో ఆ కంట్రాక్టర్ పనులు ఆపి చేసి వెళ్లిపోయాడు. అప్పట్నుంచీ ఏ కాంట్రాక్టరు పనులు సెయ్యడానికి ముందుకు రాలేదు" చెప్పాడు రామన్న.

"ఇలా అయితే ఈ ప్రాంతాలు అభివృద్ధి ఎలా చెందుతాయి?మీ గిరిజనులకు వైద్యం, ఆరోగ్యం, చదువు ఎలా వస్తాయి?"అడిగాడు శ్రీధర్.

''పోలీసోళ్లు, నక్సలైట్లు ఒకళ్లనొకళ్లు సంపుకుంతున్నారు.ఈళ్లు కింద కొస్తే ఆళ్లు, ఆళ్లు మీద కొస్తే ఈళ్లు సంపుకోవడమే. అందుకే ఇక్కడ మా బతుకులు కట్టాలపాలవుతున్నాయి." చెప్పాడు రామన్న.

"ఇంతకీ ధరణి భర్త సోమన్న ఎక్కడున్నాడు? ఎప్పుడైనా మీ ఊరు వచ్చాడా? " శ్రీధర్ రామన్నని ప్రశ్నిస్తుంటే ప్రియ ఆసక్తిగా వినసాగింది.

సోమన్న తనకు తండ్రని ఈ మధ్యనే ప్రియకు తెలిసింది. అందుకే రామన్న ఏం చెబుతాడోననీ ఆసక్తిగా వినసాగింది.

"బాబూ తమరికి అన్నీ తెలుసు. పోలీసుల బస్సుని అన్నలు పేల్చేశారు. ఆళ్లకి సోమన్న సాయం చేసాడనీ పోలీసుల అనుమానం. అందుకే ఆడిని పిలిపించారు. కానీ ఎళితే పోలీసులు సంపేత్తారనీ సోమన్న బయం. అందుకే పారిపోనాడు. ఆ తరువాత ఒకసారి కామోసు ఆడు మా ఊరొచ్చినాడు. ఓ రాత్రి ఉండి మళ్లీ ఎల్లిపోనాడు.అప్పుడు ఈ పిల్ల సిన్నది. పెద్దమ్మ గౌరి ఇంటికాడ ఉన్నాది.

అప్పట్నుంచీ మరి రానేదు. ఆడు ఏటైపోనడో ఎవరికీ తెల్వదు. అన్నల్లో కలిసిపోనాడనీ కొంతరు అంతారు. మరికొందరేమో నచ్చిపోనాడనీ సెబుతారు. ఏటి జరిగిందో తెనీదు.ఆడిని ఎతకడానికే ధరణి ఎల్లి అది కూడా అన్నల్లో కలిసి పోనాది" చెప్పాడు రామన్న.

"రెబ్బ తండా చేరడానికి ఇంకా ఎంత దూరం వెళ్లాలి? ఎంతసేపు పడుతుంది?" అడిగాడు శ్రీధర్.

నుంచి మరీ కట్టం. కొండల్లో ఇరుకుల్లో నిటారుగా నడవాలి. ఏగంగా నడిస్తే నాలుగైదు గంటలు పడతాది. ఇంకో మూడు మైళ్లు వెళితే అక్కడ పోలీసులు సెకింగ్ ఉంటాది. అక్కడకి ఒరిస్సా బోర్డర్ దగ్గర. మనం పోలీసుల కంట పడకుండా ఎల్లడం మంచిది. ఆళ్లు గానీ సూత్తే పెమాదం.మనల్ని కూడా అన్నలనుకొనో, ఆళ్లకు వత్తాసుదారుల మనుకొనో పట్టుకునే అవకాశం ఉండాది" అన్నాడు రామన్న.

వాళ్లు తమతో ఫ్లాస్కులో తెచ్చుకున్న టీ తాగి మళ్లీ కొండ ఎక్కడం మొదలు పెట్టారు. చుట్టూరా ఆకాశన్నంటుతున్నట్లున్న పచ్చటి కొండలు. వాటిపై దోబూచులాడుతున్న మేఘాలు. ఆ కొండల్ని చూస్తుంటే శ్రీధర్‌కి భయం వెయ్యసాగింది. అసలు ఆ ఊరు వెళ్లగలమా?అన్న అనుమానం కలగ సాగింది.

కొద్ది దూరంలో ఓ గిరిజనుడు కొండ దిగుతూ కనిపించాడు.అతనితో రామన్న సవర భాషలో ఏదో మాట్లాడాడు. ఆ తరువాత రామన్న ముఖంలో ఆందోళనని గమనించాడు శ్రీధర్.

"ఏం జరిగింది? ఎవరతను?"అడిగాడు శ్రీధర్.

"ఈడిది మా ఊరే బాబూ! అన్నల కోసం పోలీసులు ఎతుకుతున్నారంట.

కొండ మీద శానా మంది పోలీసులున్నారంట. ఇంకో దారిన జాగ్రత్తగా ఎళ్లమనీ సెబుతున్నాడు" అన్నాడు రామన్న.

ఆ మాటలు విన్న శ్రీధర్ ముఖంలో ఆందోళన మొదలైంది. ప్రియ తండ్రి వైపు భయంతో చూడసాగింది.

"మరిప్పుడెలా?"

"ఏం పరవాలేదు బాబూ! మనం ఇంకో దారంట ఎళదాము. ఇది మాకు మామూలే" చెప్పాడు రామన్న.

కొద్దిదూరం వెళ్లిన తరువాత రామన్న పక్కనే ఉన్న దారిలోకి మళ్లాడు. శ్రీధర్ ఆలోచిస్తూ అతని వెనకి నడుస్తుంటే ప్రియ శ్రీధర్ చెయ్యి పట్టుకొని






గన్నవరపు నరసింహమూర్తి

చుట్టూ చూస్తూ నడవసాగింది.

రాను రాను కొండ ఎక్కడం కష్టంగా మారింది. కొండదారి నిట్ట నిలువుగా ఉంది. కొద్ది దూరం నడిచేసరికి శ్రీధర్‌కి ఆయాసం మొదలైంది. రామన్న కర్రని భూమ్మీద నొక్కి పెడుతూ త్వరత్వరగా నడవసాగాడు.

ఇంతలో దూరం నుంచి "ఢాం" మన్న శబ్దం వినిపించింది. ఆ శబ్దానికి శ్రీధర్ ఉలిక్కిపడి అక్కడే నిలబడిపోయాడు.

ఆ శబ్దం కొండల్లో అలలు అలలుగా ప్రతిధ్వనించ సాగింది. అక్కడ ఏం జరిగిందో అదేమిటో శ్రీధర్‌కు అర్థం కాక రామన్న వైపు చూసాడు. పోలీసోళ్లు అన్నల కోసం ఎతుకుతున్నారనీ మావోడు సెప్పాడు కదా బాబు! ఆ తుపాకీ సప్పుడు పోలీసోళ్లదే. అన్నలు పోలీసులకు దొరికి పోయినట్టున్నారు" అన్నాడు రామన్న ఒకింత భయంతో.

మళ్లీ...."ఢాం! ఢాం! ఢాం!" అని వరుస పేలుళ్లు వినిపించాయి. దూరంగా పచ్చటి కొండ మధ్యలో ఎగురుతున్న ధూళి, పొగ.అక్కడ నుంచే శబ్దాల ప్రకంపనలు కొండల్లో ప్రతిధ్వనిస్తున్నాయి.

ఈసారి మరిన్ని శబ్దాలతో శ్రీధర్‌లో ఆందోళన పెరిగిపోసాగింది. అనవసరంగా వచ్చామన్న భావన కలగసాగింది. ముందు కెళితే పోలీసులు. అలా అనీ వెనక్కి వెళ్లలేరు. ముందుకెళ్లినా రెబ్బ తండాకు చేరుకోగలమా?అనే సంశయం అతనికి కలిగింది.

కొంతసేపటికి ఆ ప్రాంతమంతా నిశ్శబ్దం ఆవరించింది. పేలుళ్ల శబ్దం వినిపించటం లేదు కానీ దూరంగా ధూళి ఎగురుతూ కనిపిస్తోంది.

"రామన్నా!ఇందాకటి పేలుళ్లు ఎక్కడి నుంచి?" అడిగాడు శ్రీధర్.

"చెప్పాను కదా బాబూ! ఈ రెబ్బ కొండల్లో నక్సలైట్ల మీటింగులున్నాయనీ పోలీసోళ్లకు తెలిసి ఆళ్లు వచ్చారు. తాము మీటింగులెట్టుకుంటే, పోలీసులకు తెలిసి వత్తారని ఆ అన్నలకు కూడా తెలుసు. అందుకనీ వాళ్లు దారంట మందుపాతర్లు పెడుతుంటారు. బహుశా అవే పేలుంటాయి. ఇక మధ్యలో వినిపించేవి తుపాకీ పేలుళ్లు. పోలీసులకు, అన్నలకు కాల్పులు మొదలై మ ఉంటాయి" చెప్పాడు రామన్న.

"అంటే పోలీసుల వ్యాన్‌ను నక్సల్స్ పేల్చేశా రంటావా? అలా అయితే చాలా మంది పోలీసుల చనిపోయి ఉండాలే! అదే నిజమైతే పోలీసులు ఊరుకోరు. ఈ పరిస్థితుల్లో మనం మీదకు వెళ్లడం ప్రమాదం కాదా?"అడిగాడు శ్రీధర్.

"ఏం జరిగిందో పూర్తి విసయం తెలియదు బాబూ? కానీ, పోలీసోళ్లు,అన్నలూ ఒకళ్లనొకళ్లు సంపుకుంటూనే ఉంటారు. ఆళ్ల పని ఆళ్లదే. మన పని మనదే. పదండి ఎళదాం" బేగీ నడండి పోదాం" అన్నాడు రామన్న.

రామన్నను శ్రీధర్, ప్రియ అనుసరించారు. .

కొద్ది దూరం తరువాత మళ్లీ పెద్ద కొండ మొదలైంది. అది నిలువుగా ఆకాశాన్ని తాకుతుందా? అన్నట్లు ఉంది.



కొద్దిసేపటికి వాళ్లు కొండ దారి పట్టారు. వాలుగా, నిటారుగా ఉన్న కొండ పక్కనే చిన్నదారి. ప్రియ ఉత్సాహంగా రామన్న వెంట నడుస్తున్నాది. శ్రీధర్‌కి ఆ కొండని చూడగానే భయమని పించింది. దీని పక్క నుంచి నడక అంత సులభం కాదు. అయినా తప్పదు. అతను భయపడుతున్నది కొండదారిని చూసి కాదు. పోలీసులు ఎక్కడ తమను అడ్డుకుంటారోనని. ఒక గంట తరువాత వాళ్లు ఒక చిన్న తండాకి చేరుకున్నారు. అక్కడ కేవలం రెండు కుటుంబాలే ఉన్నాయి. అవి కూడా దూరంగా విసిరేసి నట్లున్నాయి. అక్కడకి చాలా దూరంగా కొండ మీద ఒక గ్రామం కనిపిస్తోంది.

రామన్న ఆ కొండని చూపిస్తూ "బాబూ! ఈ కొండ పక్క నుంచి ఆరు మైళ్లునడిస్తే రెబ్బ తండా వత్తాది. కానీ దారి బాగా ఇరుకు. జాగర్తగా నడవాల"చెప్పాడు.

కొద్దిసేపటికి వాళ్లు కొండ దారి పట్టారు. వాలుగా, నిటారుగా ఉన్న కొండ పక్కనే చిన్నదారి. ప్రియ ఉత్సాహంగా రామన్న వెంట నడుస్తున్నాది.

శ్రీధర్‌కి ఆ కొండని చూడగానే భయమని పించింది. దీని పక్క నుంచి నడక అంత సులభం కాదు. అయినా తప్పదు. అతను భయపడుతున్నది కొండదారిని చూసి కాదు. పోలీసులు ఎక్కడ తమను అడ్డుకుంటారోనని.

ఒక గంట తరువాత వాళ్లు ఒక చిన్న తండాకి చేరుకున్నారు. అక్కడ కేవలం రెండు కుటుంబాలే ఉన్నాయి. అవి కూడా దూరంగా విసిరేసి నట్లున్నాయి. అక్కడకి చాలా దూరంగా కొండ మీద ఒక గ్రామం కనిపిస్తోంది.

రామన్న ఆ ఊరిని శ్రీధర్‌కి చూపిస్తూ "బాబూ! అదే మనం వెళ్లబోయే రెబ్బ తండా. ఇంకా రెండు గంటలు ఓపిక పట్టి నడిస్తే చాలు వెళ్లిపోతాము" చెప్పాడు.

"రామన్నా! మొదట సులభంగా నడిచెయ్యగలను అనుకున్నాను కానీ నడుస్తుంటే ఎంత ఇబ్బందో తెలుస్తోంది. నిజంగా ఇక్కడ గిరిజనులను చూస్తుంటే వాళ్లు ఎలా బతుకుతున్నారో అని ఆశ్చర్యం వేస్తోంది" అన్నాడు శ్రీధర్.

వాళ్లు అలా మాట్లాడుకుంటున్న సమయంలో ఒక వ్యక్తి వాళ్ల దగ్గరికి రాసాగాడు. అతనికి నలభై సంవత్సరాల వయస్సు ఉంటుంది. అతని భుజానికి ఒక సంచి వేలాడుతూ కనిపిస్తోంది.

వస్తున్న ఆ వ్యక్తిని చూసి శ్రీధర్ ఆశ్చర్య పోసాగాడు. "రామన్నా! ఎవరతను? అతను నీకు తెలుసా?"అడిగాడు.

"అతను రమేష్ అని పత్రికా ఇలేకరి బాబూ! మా గిరిజనుల వార్తలని పేపర్లకు, టీవీలకూ పంపుతాంటాడు" అని చెప్పాడు.

'రమేష్' అన్న మాట వినగానే తాను పదేళ్ల క్రితం కెంగువ గ్రామంలో పనిచేస్తున్నప్పుడు తనని కలిసి పెన్ డ్రైవ్ ఇచ్చిన విలేకరి గుర్తు కొచ్చాడు.బహుశా అతనే ఇతనేమో అనిపించింది శ్రీధర్‌కి.

ఇలా ఆలోచిస్తున్న సమయంలో ఆ వ్యక్తి వాళ్ల దగ్గరికి వచ్చాడు. ఇప్పుడే ఆతడు శ్రీధర్‌కి స్పష్టంగా కనిపించసాగేడు. పదేళ్ల క్రితం తాను కలిసిన రమేష్ ముఖం అతనిలో స్పష్టంగా కనిపిస్తోంది.

అతను శ్రీధర్ దగ్గరికి వచ్చి "సార్! నన్ను గుర్తు పట్టారా? పదేళ్ల క్రితం మిమ్మల్ని కలిసి పెన్ డ్రైవ్ ఇచ్చిన రమేష్‌ని" అని చెప్పాడు.

"గుర్తు పట్టాను రమేష్. మీరిచ్చిన పెన్ డ్రైవ్‌ను నేను వారం తరువాత ఎస్పీ గారికి, కలెక్టర్ గారికి అందజేశాను. ఆ తరువాత నాకు మా ఊరు బదిలీ కావడంతో మిమ్మల్ని కలవడం కుదరలేదు. అది సరే..! మీరేంటి... ఇప్పుడు ఇక్కడకు ఎందు కొచ్చారు?" అడిగాడు శ్రీధర్.

"సార్! అప్పుడు మీరు ఆ పెన్ డ్రైవ్‌ను ఎస్పీగారికి ఇవ్వడం వల్ల నేను అప్పటి కేసుల నుంచి బయట పడగలిగాను. అమాయకులైన గిరిజనులను అరెస్ట్ చేసి, హింసించినట్లు ఆరోపణలు ఉన్న పోలీసులను ఎస్పీగారు సస్పెండ్ చేశారు. అమాయక గిరిజనులపై పెట్టిన కేసులను ఎత్తి వేసారు.

ఆ తరువాత నా మీద గల కేసులను కూడా రద్దు చేసారు. అప్పట్నుంచీ ఈ గిరిజన ప్రాంతంలో విలేకరిగా పనిచేస్తూ, బతుకుతున్నాను. వారానికి రెండు మూడు రోజులు ఈ కొండల్లోని తండాలు, పల్లెల్లోకి వెళుతుంటాను. అదిసరే...మీరేంటి ఇక్కడి కొచ్చారు?ఎక్కడి కెళుతున్నారు? దూరం నుంచి మిమ్మల్ని చేసి వివరాలు కనుక్కుందామని వచ్చాను" వివరించాడు రమేష్.

(సశేషం)




# చిన్న స్టార్టప్ నుంచి ప్రపంచ దిగ్గజంగా...

కాలం మారింది. దానితోపాటు ఆహారపు అలవాట్లు మారిపోతున్నాయి. ఒకప్పుడు ఇంట్లో వండింది తినడమే అలవాటుగా ఉండేది, నేడు సమయం లేకో లేదా భిన్నమైన ఆహారాన్ని తినాలనిపించో, అది వండడం తెలియక పోవడంతోనో, బయటకు వెళ్లక తప్పని పరిస్థితులు ఏర్పడుతున్నాయి. బయటకు వెళ్లినా హోటళ్లలో రద్దీ భరించలేనంత ఉండడంతో ఇబ్బంది పడడం కూడా కద్దు. అయితే, ఈ శ్రమను తప్పించేందుకు ఇప్పుడు రకరకాల యాప్‌లు మనకు అందుబాటులోకి వచ్చాయి. అందులో క్లిక్ చేసి, ఆర్డర్ చేయడమేమిటి, ఇట్టే అవి వేడివేడిగా మన ఇంట్లో వచ్చి వాలుతున్నాయి.

ఈ సమస్యలను స్వయంగా ఎదుర్కొని అర్థం చేసుకున్న పంకజ్ చద్దా, దీపేందర్ గోయెల్ అనే ఇద్దరు యువకులు, పరిష్కారంగా 'జొమాటో' ఆహార బట్వాడా అప్లికేషన్‌ను తయారు చేశారు. ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ తరచుగా కాకపోయినా, ఒకసారో, అరసారో దీన్ని ఉపయోగించే ఉంటారు. పెద్ద పెద్ద నగరాల నుంచి పట్టణాల వరకూ ఇప్పుడు జొమాటో యాప్‌ను ఉపయోగిస్తున్నా రనడం అతిశయోక్తి కాదేమో. ఐఐటీ ఢిల్లీ విద్యార్థులు, బెయిన్ అండ్ కంపెనీలో పనిచేస్తున్న దీపేందర్ గోయల్, పంకజ్ చద్దాలు ఈ యాప్‌ను అభివృద్ధి చేయడానికి కారణం, తమ ఆఫీసు కాంటీన్లలో తమ సహచరులు ఆహారాన్ని ఆర్డర్ చేయడం కోసం మెనూ కార్డులను పట్టుకొని వేచి ఉండటమే. కొన్ని సందర్భాల్లో వారికి కూడా ఆ అనుభవం అయింది. ఈ ప్రహసనమే, ఈ సమస్యకు పరిష్కారాన్ని కనుగొనాలనే ఆలోచన వారి మనసులో పుట్టేందుకు కారణమైంది. తొలుత 'ఫుడీబే' సృష్టికి కారణమైంది.

వారు మెనూకు సంబంధించిన సాఫ్ట్ కాపీలను వెబ్‌సైట్‌పై అప్‌లోడ్ చేయడంతో, ఆఫీసులో అందరూ దీనిని ఉపయోగించడం ప్రారంభించారు. ఇది వారికి ఎంతో సమయాన్ని ఆదా చేసింది. అయితే, దీనివల్ల వెబ్‌సైట్‌లో ట్రాఫిక్ పెరిగింది. ఈ ఆలోచన విజయవంతం కావడంతో వారు వెబ్‌సైట్‌ను అందరికీ అందుబాటులోకి వచ్చేలా విస్తృత పరిచారు. తొలుత ఢిల్లీలో ప్రారం భమైన ఫుడీబే సేవలు నెమ్మదిగా ముంబై, కోల్‌కతాలకు విస్తరించాయి. ఈ అప్లికేషన్‌ను ఉపయోగిస్తున్నవారి సంఖ్య క్రమంగా పెరగడం ప్రారంభమైంది. వినియోగదారులకు ప్రత్యేక సేవలు అందిస్తున్నం దున్న ఫుడీబే ఆ నగరాలలో అత్యంత ప్రాచుర్యం పొందింది.

దీనితో, తమ ప్రాజెక్టును అంతర్జాతీయ స్థాయికి పెంచాలని వ్యవస్థాపకులు భావించి, ప్రయత్నించారు. అలాగే, ఫుడీబేను మరింత ఆకర్షణీయంగా, సులభంగా గుర్తుపెట్టుకునేలా చేయడానికీ, 'ఈబే' వెబ్‌సైట్‌తో ఉండే గందరగోళాన్ని తొలగించడానికి 'జొమాటో'గా దాని పేరు మార్చారు. ఈ రకంగా, 2010లో ఫుడీబే పేరును అధికారికంగా జొమాటోగా మార్చారు. ఇదే, కాలక్రమంలో అత్యంత విజయవంతమైంది.

జొమాటో వాడకం అసాధారణంగా పెరగడంతో, దాని వ్యవస్థాపకులు వినియోగదారుల కోసం అప్లికేషన్ యాక్సెస్‌ను సులభతరం చేయాలని నిర్ణయించు కున్నారు. ప్రజలకు ప్రయోజనం చేకూర్చడానికి, వినియోగదారులకు సులభంగా అందుబాటులో ఉండేలా చేయడానికి జొమాటో వంటి మొబైల్ యాప్ రూపొందించారు. అయితే, ఆవిష్కరణలకు నిధులు అవసరం అవుతాయి. ఈ క్రమంలో 'నౌకరీ' సెర్చ్ ఇంజన్ వ్యవస్థాపకుడు సంజీవ్ బిఖ్‌చందానీ జొమాటో విజయగాథ విని ఆకర్షితుడయ్యాడు. దీనితో అతడు ఈ స్టార్టప్‌లో పెట్టుబడి పెట్టడం ప్రారంభించాడు.

అతడు, 2010లోనే ఇన్ఫో ఎడ్జ్ (ఇండియా) ద్వారా దాదాపు ఒక మిలియన్ డాలర్లను పెట్టుబడిగా పెట్టాడు. ఆ మరుసటి సంవత్సరంలోనే, ఆదే పెట్టుబడిదారులు వారికి 3.5 మిలియన్ డాలర్ల నిధిని అందించారు. ఆ మరు సంవత్సరం ఇన్ఫో ఎడ్జ్ ద్వారా దాదాపు 10 మిలియన్ డాలర్లు వరదలా జొమాటోను ముంచెత్తాయి. నేడు ఈ కంపెనీలో ఇన్ఫో ఎడ్జ్ సహా ముగ్గురు పెట్టుబడిదారులు 50శాతం వాటాను కలిగి ఉన్నారు. నిజానికి, నేడు ఏరకమైన వ్యాపారానికి అయినా మొబైల్ యాప్‌ను అభివృద్ధి చేయడం అన్నది వృద్ధి చోదకంగా మారిందనేది వాస్తవం.

కాగా, సరైన వ్యక్తుల నియామకమే కంపెనీ వేగవంతమైన వృద్ధికి కారణమన్నది జొమాటో వ్యవస్థాపకులు దీపేందర్ గోయల్, పంకజ్ చద్దాల నిశ్చితాభిప్రాయం. పైగా, వారు జొమాటోను నిర్మిస్తున్న కాలంలో ఎదుర్కొన్న అతిపెద్ద ఆటంకం కూడా అదే. ఈ ప్రాజెక్టును పటిష్టం చేసే సైన్యమే నేడు వారి బలమైంది.

జొమాటో విజయం అంత తేలికగా రాలేదు. వారు ఎదుర్కొన్న కీలకమైన అడ్డంకి ఏమిటంటే, అన్ని ముఖ్య నగరాల్లోని అన్ని ప్రాంతాలను కవర్ చేయడానికి ఒక మార్గాన్ని కనుగొనడం, తద్వారా వాటిపై ఆధారపడిన ప్రజలు అత్యుత్తమ రెస్టారెంట్ల నుంచి ఆహారాన్ని కోల్పోకుండా చూడటం. ఇది తొలి దశలో సమస్యగా ఉన్నా, వ్యవస్థాపకులు తమ సైన్యంతో పరిస్థితిని మెరుగుపరిచేందుకు కృషిని ఆపలేదు. మరొక పెద్ద సమస్య ఏమిటంటే, మొదట్లో డోమినోస్, కెఎఫ్‌సి వంటి అంతర్జాతీయ ఫాస్ట్‌ఫుడ్ చైన్లు, స్థానిక హోటళ్లు జొమాటో వారు తమ వద్దకు రాకుండా అడ్డుకున్నారు. అందుకు కారణం, వారి వద్ద కూడా డెలివరీ సిబ్బంది ఉండటమే. అయితే, క్రమంగా జొమాటో సిబ్బంది తమపనిలో చూపుతున్న నైపుణ్యం కారణంగా, పెరిగిన అమ్మకాల కారణంగా వారు జొమాటోను అనుమతించారు.

నేడు జొమాటో స్టార్టప్ విజయగాథ అనేక స్టార్టప్‌లకు ప్రేరణగా నిలుస్తోంది. ముఖ్యంగా, ఇది ఉనికిలో ఉన్న ఉదాహరణ కావడంతో అనేకమంది యువకులు ప్రేరితులు అవుతున్నారు. నేడు దేశవ్యాప్తంగా లక్షలాదిమందికి ఉపాధి కల్పిస్తున్న జొమాటో, యువతకు ఆదర్శంగా నిలుస్తోంది. ఇక్కడ వ్యవస్థాపకులు దీపేందర్, పంకజ్‌లు ఒక సఫలవంతమైన వ్యాపార నమూనాను నిర్మించాలని అంకిత భావంతో చేసిన కృషిని విస్మరించలేం. అదే వారు నేడు విజయబాటలో ముందుకు సాగేందుకు కారణమైంది.

– జాగృతి డెస్క్




# అమెరికా-చైనా విచిత్ర

అమెరికా-చైనా సంబంధాలు ఎప్పుడూ 'సహకారం-పోటీ'ల మధ్య దోబూచులాడుతుంటాయి. చైనాను తీవ్రంగా విమర్శించే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రోటోకాల్‌ను పక్కనబెట్టి మరీ, జాయింట్ బేస్ ఆండ్రూస్ విమానాశ్రయానికి స్వయంగా వెళ్లి, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌కు అరుదైన, ఘన స్వాగతం పలికారు. 11 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత జిన్‌పింగ్ అమెరికాలో పర్యటించడం, ప్రపంచంలోని రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య ఉద్రిక్తతలు తీవ్రంగా ఉన్న తరుణంలో ఈ భేటీ జరగడం అంతర్జాతీయంగా అత్యంత ప్రాధాన్యత సంతరించుకుంది. ఈ పర్యటనలో లభించిన అతిపెద్ద తక్షణ ఉపశమనం వాణిజ్య రంగానికి సంబంధించింది. నవంబర్‌లో ముగియాల్సిన వాణిజ్య సంధిని మరో రెండు నెలల పాటు పొడిగిస్తున్నట్లు అమెరికా ప్రకటించింది. దీనివల్ల ఇరు దేశాల వ్యాపారులకు, ముఖ్యంగా అమెరికా రైతులకు పెద్ద ఊరట లభించినట్లయింది.

తీవ్రమైన టారిఫ్ (సుంకాలు) యుద్ధం ప్రస్తుతానికైతే నిలిచిపోయింది. మధ్యప్రాచ్యంలో కొనసాగుతున్న ఉద్రిక్తతలు, ఇరాన్ యుద్ధ వాతావరణంపై ఇరువురు నేతలు సుదీర్ఘంగా చర్చించారు. ఇరాన్ విషయంలో చైనా వైఖరిపై అమెరికాలో అంతర్గతంగా విమర్శలు ఉన్నప్పటికీ, ఇరాన్ జూన్ నాటి తాత్కాలిక ఒప్పందానికి కట్టుబడి ఉండేలా చూడటం, హోర్ముజ్ జలసంధి గుండా అంతర్జాతీయ వాణిజ్యానికి ఆటంకం కలగకుండా చూడటంపై ఇరు దేశాలు ఒక అవగాహనకు వచ్చాయి. రెండు అగ్రరాజ్యాల మధ్య అపార్థాల వల్ల అకస్మాత్తుగా యుద్ధ వాతావరణం రాకుండా చూసేందుకు, ఇరు దేశాల సైన్యాల మధ్య క్రమం తప్పకుండా సంబంధాలు కొనసాగించాలని నిర్ణయించారు. తైవాన్, దక్షిణ చైనా సముద్రం వంటి సున్నితమైన ప్రాంతాల్లో ఎలాంటి పొరపాట్లు జరగకుండా ఇది నివారిస్తుంది.ప్రస్తుత ప్రపంచాన్ని శాసిస్తున్న కృత్రిమ మేధ(ఏఐ) సాంకేతికతను సైనిక ప్రయోజనాలకు వాడటంపై ఇరు దేశాల మధ్య ఉన్న భయాలపై చర్చలు జరిగాయి. సాంకేతిక రంగంలో పోటీ ఉన్నప్పటికీ, నియంత్రణల విషయంలో కలిసి పనిచేయాల్సిన అవసరాన్ని గుర్తించారు. ఈ పర్యటన ద్వారా రాత్రికి రాత్రే ఇరు దేశాల మధ్య విభేదాలన్నీ తొలగిపోలేదు. కానీ, బద్ధశత్రువులుగా మారి ప్రపంచాన్ని ప్రమాదంలోకి నెట్టడం కంటే, ఒకరితో ఒకరు చర్చలు జరుపుతూ లాభపడటమే ఉత్తమమనే వాస్తవిక దృక్పథాన్ని ఇద్దరు నేతలూ ప్రదర్శించారు. ఈ ఏడాదిలోనే మరో రెండు సార్లు ముఖాముఖి భేటీలు కావడానికి ఇరు దేశాధినేతలు అంగీకరించడం ఈ పర్యటన సాధించిన అతిపెద్ద సానుకూల పర్యవసానంగా చెప్పవచ్చు.

**ట్రంప్ వైఖరిలో మార్పు**

చైనా పట్ల, ముఖ్యంగా అధ్యక్షుడు షి జిన్‌పింగ్ పట్ల ట్రంప్ తన కటువైన వైఖరిని పక్కనబెట్టి, ఇంతటి సానుకూల ధోరణిని ప్రదర్శించడం వెనుక బలమైన అంతర్జాతీయ వ్యూహాలు, ఆర్థిక సమీకరణాలు ఉన్నాయి. ట్రంప్ తన రెండో విడత పదవీకాలం ఆరంభంలో చైనా వస్తువులపై ఏకంగా 145-150 శాతం వరకు భారీ సుంకాలను విధించారు. అయితే చైనా దీనికి దీటుగా స్పందించింది. స్మార్ట్‌ఫోన్లు, యుద్ధ విమానాలు, ఎలక్ట్రానిక్స్ తయారీకి అత్యంత కీలకమైన అరుదైన ఖనిజాల ఎగుమతులపై ఆంక్షలు విధించింది. దీనివల్ల అమెరికా పరిశ్రమలు తీవ్ర ఇబ్బందుల్లో పడ్డాయి. అమెరికా ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయగల ఆయుధాలు తన వద్ద కూడా ఉన్నాయని చైనా నిరూపించడంతో ట్రంప్ దిగిరాక తప్పలేదు.ప్రస్తుతం అమెరికాలో వడ్డీ రేట్లు రికార్డు స్థాయికి చేరాయి. వచ్చే మధ్యంతర ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని, మార్కెట్లను మరింత గందరగోళంలోకి నెట్టడం ట్రంప్‌కి ఇష్టం లేదు. చైనాతో మరింతగా వాణిజ్య యుద్ధాన్ని పెంచితే అమెరికా మార్కెట్లు కూలిపోయే ప్రమాదం ఉండటంతో, ప్రస్తుతానికి పరిస్థితిని ప్రశాంతంగా ఉంచేందుకే ఆయన మొగ్గు చూపారు. మధ్య ప్రాచ్యంలో ఇరాన్‌తో యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ, చైనా సహాయం అమెరికాకు అత్యవసరం. ఇరాన్ నుండి చైనా పెద్ద ఎత్తున చమురు కొనుగోలు చేస్తోంది. హోర్ముజ్ జలసంధి గుండా అంతర్జాతీయ వాణిజ్యానికి అంతరాయం కలగకుండా ఉండాలన్నా, ఇరాన్ మరింత రెచ్చిపోకుండా ఆ దేశాన్ని ఆర్థికంగా ఒంటరిని చేయాలన్నా , చైనా సహకారం లేకుండా అమెరికా ఏమీ చేయలేని పరిస్థితి ఏర్పడింది.ట్రంప్ చైనాపై విధించిన అత్యవసర నియామక సుంకాలను అమెరికా సుప్రీంకోర్టు కోర్టు కొట్టివేసింది. దీనితో కేవలం ఏకపక్ష ఆంక్షల ద్వారా చైనాను లొంగదీసుకోవడం సాధ్యం కాదని ట్రంప్ యంత్రాంగానికి స్పష్టమైంది. చైనాను ప్రపంచ దేశాల నుండి ఒంటరిని చేయాలనే అమెరికా వ్యూహానికి ఆశించిన మద్దతు లభించడం లేదు. ఐరోపా, కెనడా వంటి అమెరికా పాత మిత్రదేశాలు సైతం వాషింగ్టన్, బీజింగ్‌ల మధ్య సమతూకం పాటిస్తూ తమ సొంత ప్రయోజనాలను చూసుకుంటున్నాయి. ఒంటరిగా చైనాను ఎదుర్కోవడం కంటే చర్చల ద్వారా అదుపులో ఉంచడమే మేలని ట్రంప్ భావించారు. ఆయన చైనాతో సైద్ధాంతిక వైరాన్ని షి జిన్‌పింగ్‌తో వ్యక్తిగత సంబంధంగా మార్చుకున్నారు. జిన్‌పింగ్‌ను ఒక "గ్రేట్ జెంటిల్‌మన్" అని పొగుడుతూ, వ్యక్తిగతంగా చర్చలు జరపడం ద్వారా అమెరికాకు అనుకూలమైన ఒప్పందాలు (ఉదాహరణకు సోయాబీన్ కొనుగోళ్లు, ఫెంటానిల్ డ్రగ్ నియంత్రణ) సాధించవచ్చనేది ట్రంప్ వ్యూహం.ట్రంప్ వైఖరి మారడానికి చైనాపై




# బంధం!

ప్రేమ కారణం కాదు. అమెరికా ఆర్థిక ప్రయోజనాలు దెబ్బతినకుండా చూసుకోవడం, అంతర్జాతీయ సంక్షోభాలను ఎదుర్కోవడానికి చైనాతో సత్సంబంధాలు కలిగి ఉండటం ఒక అనివార్యమైన వ్యూహాత్మక అవసరం అని ఆయన గ్రహించడమే ప్రధాన కారణం.

**ట్రంప్ స్వాగతం వెనుక వ్యూహం**

చైనా అధ్యక్షుడికి విమానాశ్రయంలో అమెరికా అధ్యక్షుడు స్వయంగా స్వాగతం పలకడం వెనుక అంతర్జాతీయ భౌగోళిక రాజకీయాల వ్యూహం స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల న్యూఢిల్లీలో బ్రిక్స్ సదస్సులో భారత్, రష్యా, చైనాలతో పాటు బ్రిక్స్ కూటమి దేశాల మధ్య వెల్లివిరిసిన సాన్నిహిత్యం వాషింగ్టన్‌ను ఆలోచనలో పడేసింది. భారత్, రష్యా, చైనాల ఐక్యతను గమనించిన ట్రంప్, చైనాను రాజకీయంగా తన వైపు తిప్పుకోవడానికి (దువ్వడానికి) ప్రయత్నిస్తున్నారా అనే కోణంలో విశ్లేషించడానికి కూడా బలమైన కారణాలున్నాయి. సదస్సులో రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్, ప్రధాని నరేంద్ర మోదీల మధ్య వ్యూహాత్మక చర్చలు జరిగాయి. ఈ కూటమి కేవలం ఒక ఆర్థిక వేదికగా కాకుండా, పాశ్చాత్య దేశాల (ముఖ్యంగా అమెరికా) ఆధిపత్యానికి ప్రత్యామ్నాయంగా ఎదుగుతోంది. ఈ మూడు దేశాలు ఒక బలమైన కూటమిగా మారితే అంతర్జాతీయంగా అమెరికా ఒంటరిగా మిగిలిపోయే ప్రమాదాన్ని ట్రంప్ గ్రహించారు. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి రష్యా, చైనాలు అత్యంత సన్నిహిత మిత్రదేశాలుగా మారాయి. అమెరికాకు వ్యతిరేకంగా ఈ రెండు అగ్రరాజ్యాలు జతకట్టడం వాషింగ్టన్‌కు అతిపెద్ద ముప్పు. కాబట్టి, జిన్‌పింగ్‌కు అత్యున్నత ప్రోటోకాల్ మర్యాదలు ఇవ్వడం ద్వారా, చైనాతో సంబంధాలను మెరుగుపరుచుకొని, రష్యాతో దానికున్న వ్యూహాత్మక బంధాన్ని కాస్త బలహీన పరచాలనేది ట్రంప్ వ్యూహం కావచ్చు. బ్రిక్స్ వేదికగా చైనా తను "గ్లోబల్ సౌత్" (అభివృద్ధి చెందుతున్న దేశాల) నాయకుడిగా చెలామణి అవ్వాలని చూస్తోంది. అయితే, అమెరికా చైనాతో తీవ్రమైన ఘర్షణ వైఖరిని అవలంబిస్తే, గ్లోబల్ సౌత్ దేశాలన్నీ చైనా వైపు వెళ్లే ప్రమాదం ఉంది. అందుకే ట్రంప్ వ్యూహాత్మకంగా వ్యవహరించి, జిన్‌పింగ్‌తో సత్సంబంధాలు ఉన్నాయనే సంకేతాలు ప్రపంచానికి పంపారు. డొనాల్డ్ ట్రంప్ ఎప్పుడూ తనను తాను ఒక "గ్రేట్ డీల్ మేకర్" (గొప్ప ఒప్పందాలు చేయగల వ్యక్తి)గా భావిస్తారు. గతంలో చైనా వేదికగా జరిగిన సదస్సులో తనకు ఆశించిన స్థాయిలో విమానాశ్రయ స్వాగతం లభించకపోయినప్పటికీ, తను మాత్రం పెద్ద మనసుతో జిన్‌పింగ్‌కు అమెరికా చరిత్రలోనే అరుదైన (1962లో నాటి అమెరికా అధ్యక్షుడు జాన్ ఎఫ్. కెన్నెడీ, అల్జీరియా ప్రెసిడెంట్ అహ్మద్ బెన్ బెల్లాకు ఇటువంటి అరుదైన గౌరవాన్ని ఇచ్చారు. ఆ తర్వాత అటువంటి గౌరవం ఇవ్వడం ఇదే మొదటిసారి. ట్రంప్ వ్యూహాన్ని జిన్‌పింగ్ చాలా తెలివిగా స్వీకరించారు. అమెరికా ఇచ్చిన గౌరవ మర్యాదలను ఉపయోగించుకుని, రష్యా-చైనా కూటమిని అమెరికా నేరుగా ఢీకొట్టకుండా జాగ్రత్తపడుతూనే, అంతర్జాతీయ దౌత్య వేదికపై చైనాను అమెరికాతో సమానమైన పీఠంపై కూర్చోబెట్టడంలో ఈ పర్యటన ద్వారా జిన్‌పింగ్ విజయం సాధించారు.

**భారత్‌పై ప్రభావం**

అమెరికా-చైనాలమధ్య మారుతున్న ఈ వ్యూహాత్మక సమీకరణాలు, ముఖ్యంగా డొనాల్డ్ ట్రంప్-షి జిన్‌పింగ్‌ల తాజా భేటీ నేపథ్యంలో మనదేశం వ్యూహాత్మకంగా వ్యవహరిస్తోంది. అమెరికా, చైనాలు ఒకరితో ఒకరు తాత్కాలికంగా రాజీ పడుతున్న వేళ, భారత్ ఏ ఒక్క కూటమి వైపు మొగ్గకుండా "బహుముఖ అలీన విధానం" లేదా "వ్యూహాత్మక స్వయంప్రతిపత్తి" ని అనుసరిస్తోంది. ఇటీవల న్యూఢిల్లీ బ్రిక్స్ సదస్సు వేదికగా ప్రధాని నరేంద్ర మోదీ, చైనా అధ్యక్షుడు షి జిన్‌పింగ్‌ల మధ్య జరిగిన చర్చల ఫలితంగా సరిహద్దు ఉద్రిక్తతలు కొంత తగ్గుముఖం పట్టాయి. అమెరికాను నమ్ముకోకుండా, చైనాతో నేరుగా చర్చలు జరపడం ద్వారా సరిహద్దుల్లో వ్యూహాత్మక స్థిరత్వాన్ని సాధించాలని మన దేశం భావిస్తోంది. చైనా పూర్తిగా రష్యాను కైవసం చేసుకోకుండా అడ్డుకోవడానికి భారత్, రష్యాతో తన రక్షణ, ఇంధన బంధాన్ని మరింత బలోపేతం చేసుకుంటోంది. క్వాడ్ వంటి కూటములపై అమెరికా ఆసక్తి తగ్గినా, మనదేశం మాత్రం ఫ్రాన్స్, స్వీడన్ వంటి ఇతర స్వతంత్ర సాంకేతిక, రక్షణ భాగస్వాములతో తన రక్షణ పరిధిని విస్తరించుకుంటోంది. అమెరికా-చైనా వాణిజ్య యుద్ధం కారణంగా అంతర్జాతీయ కంపెనీలు చైనా నుండి బయటకు వచ్చి భారత్‌లో పెట్టుబడులు పెట్టాలని చూశాయి. ఇప్పుడు వారిద్దరి మధ్య వాణిజ్య సంధి కుదిరితే, సరఫరా గొలుసులు చైనాలోనే ఉండిపోయి, భారత్ ఆశించిన స్థాయిలో తయారీ రంగ వృద్ధి మందగించే ప్రమాదం ఉంది. రష్యా నుండి చమురు కొనుగోలు చేసే దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తామని ట్రంప్ గతంలో హెచ్చరించారు. చైనాతో ఒప్పందం కుదుర్చుకున్న ట్రంప్, ఈ కఠినమైన ఆంక్షల అస్త్రాన్ని భారత్‌పై ఉపయోగించే అవకాశం ఉందనే ఆందోళన దౌత్య వర్గాల్లో ఉంది. సానుకూల కోణంలో చూస్తే, అమెరికా-చైనా వైరం తగ్గడం వల్ల అంతర్జాతీయ మార్కెట్లు, ముడి చమురు ధరలు నిలకడగా ఉంటాయి. ఇది భారత ఆర్థిక వ్యవస్థకు ఊరటనిస్తుంది.

**గ్లోబల్ సౌత్ నాయకత్వ పోటీ**

గ్లోబల్ సౌత్ (అభివృద్ధి చెందుతున్న, పేద దేశాలు) నాయకత్వం కోసం భారత్, చైనాల మధ్య తీవ్రమైన పోటీ నడుస్తోంది. అయితే మనదేశం వెనుకబడిందని చెప్పలేం. చైనా భారీగా రుణాలు ఇవ్వడం ద్వారా చాలా దేశాలను అప్పుల ఊబిలోకి నెడుతోంది. చైనా తనను తాను నాయకుడిగా నిలబెట్టుకోవడానికి చూస్తుంది (ఇటీవలి చైనా గ్లోబల్ గవర్నెన్స్ వైట్ పేపర్ దీనికి ఉదాహరణ). భారత్ ఇందుకు భిన్నంగా డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (యూపీఐ), వ్యాక్సిన్ డిప్లొమసీ, విపత్తు సహాయం వంటి ఉచిత సార్వత్రిక సేవలందించే వ్యూహాన్ని అనుసరిస్తోంది. అమెరికా-చైనాలు తమ అవసరాల కోసం ఎంత దగ్గరైనా, వారి మధ్య ఉన్న అంతర్గత వైరం పూర్తిగా తొలగిపోదు. దీనిని ఒక అవకాశంగా మలచుకొని, అటు అమెరికాతోనూ ఇటు చైనాతోనూ తన సొంత ప్రయోజనాలకు అనుగుణంగా బేరమాడగల వ్యూహాత్మక స్థానంలో ప్రస్తుతం మనదేశం ఉంది.




**జమలాపురపు విఠల్‌రావు**
సీనియర్ జర్నలిస్ట్

# గణపతి



పవిత్ర భారతదేశంలో పుట్టి, ఈ గాలి పీల్చుతూ, ఇక్కడి తిండి తింటూ, ఈ మట్టిపైనే బతుకుతూ ప్రతి క్షణం ఈ దేశంపై విషం చిమ్మే సంఘ విద్రోహ శక్తుల్ని ప్రతిరోజూ చూస్తూనే ఉన్నాం. వీరిలో అత్యధికులు హిందువుల ఔదార్యం, దయా దాక్షిణ్యాలపై జీవిస్తూ హిందూమతాన్ని,సనాతన ధర్మాన్ని తూలనాడుతూ కూర్చున్న కొమ్మను, అన్నం పెట్టే చేతుల్ని నరుకుతున్నారు. నిత్యం సోషల్ మీడియా ద్వారా కావచ్చు, ప్రత్యక్షంగా కావచ్చు హిందువులపై దాడులు చేస్తూ పబ్బం గడుపుకుంటుంటారు. ఒక అబద్ధాన్ని వేయిసార్లు చెబితే అదే నిజమని నమ్మే అమాయకులను ఆసరాగా చేసుకుని, హిందువుల్లో అత్యంత గణనీయంగా తగ్గిపోయిన కులభేదాలపై రియాల్టీకి దూరంగా యూట్యూబ్ వీడియోలు, షార్ట్స్, ఇన్‌స్టా, ఫేస్‌బుక్ తదితర సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్‌లలో రీల్స్ చేస్తూ దేశాన్ని ముక్కలు చేసే పనిలో బిజీగా ఉన్నారు.

హిందువుల్లో ఐక్యత లేదంటూ తప్పుడు ప్రచారం చేస్తుంటారు. ఇలాంటి వారందరికీ కనువిప్పు కలిగించేలా హిందువుల్లోని ఐక్యతను చాటి చెబుతున్నాయి గణపతి నవరాత్రులు. వినాయక చవితి నుంచి గణపతి నిమజ్జనం మధ్యకాలంలో చోటు చేసుకునే పరిణామాలు ఒక్కసారి గమనిస్తే హిందూ సమాజంపైన, హిందువుల పండుగలు, సంప్రదాయాలపై ఎంత ఘోరంగా అబద్ధాలు అల్లుతున్నారో, ఎంత దారుణంగా దాడిచేస్తున్నారో బాగా అర్థమవుతుంది.

ఇప్పుడు గణపతి నవరాత్రి వేడుకలకు వద్దాం. తెలంగాణ అంతటా వినాయక చవితి వేడుకలు వేలాదిమండపాల్లో 3రోజుల నుంచి 10రోజుల పాటు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు హైదరాబాద్ నగరం ఎంతో ప్రసిద్ధి కాగా, ప్రత్యేకించి ఖైరతాబాద్ 'బడా గణేష్'కి అంతర్జాతీయ స్థాయిలో పేరుంది. చవితినాడు ఇక్కడ గణపతి పూజ మొదలై, నిమజ్జనం రోజువరకూ ఈ పదిరోజులూ 'బడా గణేష్' చుట్టుపక్కల వీధివీధినా చిన్న పెద్ద దుకాణాలు వందల్లో ఏర్పాటయ్యాయి. రైల్వేట్రాక్ నుంచి ఐమ్యాక్స్ థియేటర్‌దిశగా, నెక్లెస్ రోడ్‌వైపు వెళ్లే దార్లు, సెక్రెటేరియట్ దారి,సెన్సేషన్ థియేటర్ రోడ్ అంతటా ఎక్కడెక్కడి నుంచో అంటే, తమిళనాడు, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ సహా పలు పక్క రాష్ట్రాలు, ఆంధ్రప్రాంతం నుంచి, వివిధ జిల్లాల నుంచి వచ్చిన చిరు వ్యాపారులు వందలాదిగా దుకాణాలు పెట్టుకుని భారీగా వ్యాపారాలు చేసుకున్నారు.

పిల్లల బొమ్మలు, ఫ్యాన్సీ వస్తువులు, పచ్చబొట్లు వేసేవారు, తినుబండారాల వ్యాపారులు, దుస్తులు–చెప్పుల విక్రేతలు, స్టీలు ఉత్పత్తులు అమ్మేవారు, హ్యాండ్ బ్యాగ్స్, గాజులు, నెక్లెస్‌లు, క్లిప్పుల వంటి మహిళల అలంకార వస్తువులమ్మేవారు ఇలా అదీ ఇదీ అని లేదు... నిత్యావసరాలతో మొదలుపెట్టి వినోదాన్ని పంచే ప్రతి వస్తువునూ ఈ 10రోజులో తాము ఏర్పాటు చేసుకున్న తాత్కాలిక దుకాణాల్లో పెట్టుకుని అమ్ముకున్నారు. ఈ 10 రోజుల్లోనూ తాము కనీసం 5వేల నుంచి 50వేలు ఆ పైన లాభంతో వెళతామని ఈ వ్యాపారులు చెప్పారు. ఇక్కడ గమనించాల్సిన మరో విషయమేమంటే, ఖైరతాబాద్ ప్రాంతం ఒక కమర్షియల్ ఏరియా... పైన చెప్పిన వస్తువులన్నీ రోజువారీగా అమ్ముకునే శాశ్వత దుకాణాలు ఇక్కడ వీధి వీధినా ఉన్నాయి. బడా గణేష్‌ని నిలిపిన చోటుకు దారితీసే రైల్వే ట్రాక్ రోడ్డు సహా మూడునాలుగు వీధుల్లో శాశ్వత దుకాణాలతో కూడిన మార్కెట్స్ ఉన్నాయి. అయినప్పటికీ, వినాయక చవితి సమయంలో ఊహించని సంఖ్యలో ఖైరతాబాద్ వచ్చే ఈ బయటి వ్యాపారులెవరినీ స్థానిక వ్యాపారులు వ్యతిరేకించలేదు సరికదా ఎంతో సహకరించారు. బయటి ప్రాంతాల నుంచి వచ్చిన ఈ చిరు వ్యాపారులెవరినీ ఇక్కడ షాపులు పెట్టుకోవద్దని ఖైరతాబాద్ దుకాణదారులెవరూ వ్యతిరేకించలేదు... మా బిజినెస్ పోతోందని,



# చాటిన సామరస్యం

లాభాలు పోతాయని గోలపెట్టలేదు. మావాళ్లని పనిలో పెట్టుకోలేదని వారిపై దాడులు చెయ్యలేదు.

సాధారణంగా ఒక దుకాణం ఎదుట టూవీలర్ లేదా కార్ కానీ పార్క్ చేస్తే, తమ కస్టమర్లు రావడానికి అడ్డుగా ఉందంటూ.. కొద్దిసేపే అయినా సరే ఆ వాహనాల పార్కింగ్‌కి ఒప్పుకోరు. అలాంటిది, ఈ పది రోజులూ తమ శాశ్వత దుకాణాల ముందే, బయటి నుంచి వచ్చిన చిరువ్యాపారుల దుకాణాలకు చోటిచ్చారు. మరీ ముఖ్యమైన విషయమేంటంటే, ఈ దుకాణాలు పెట్టుకున్నవారిలో హిందూ సమాజంలోని బడుగు, బలహీన వర్గాలకు చెందిన అన్ని కులాలవారు, అన్యమతస్తులైన ముస్లింలు, క్రైస్తవులు కూడా ఉన్నారు. అలాగే ఇక్కడికి వచ్చి రకరకాల ఉత్పత్తులు కొనుగోలు చేసే వారిలో కూడా అన్ని కులాలు, మతాలవారు ఉన్నారు. కుల వివక్ష లేదు, వర్గ వివక్ష లేదు, విభేదాల్లేవు. ఇది కేవలం ఖైరతాబాద్ గణేశ్ దగ్గరే కాదు, హైదరాబాద్ అంతటా.. ఆ మాటకొస్తే తెలంగాణ అంతటా ఈ ఐక్యత, కలుపుగోలుతనం కనిపించి భారతీయ సంస్కృతి వైవిధ్యాన్ని చాటి చెప్పాయి.

హిందువుల్లో కులవివక్ష అంటూ అబద్ధాలు, అసత్యాలను ప్రచారం చేసే వారికి మన గణేశ్ చతుర్థి వేడుకలు చూపించిన మరో కోణం అన్న ప్రసాదాల వితరణ. నిమజ్జనం రోజు సహా గణపతి నవరాత్రులు జరిగినన్ని రోజులూ దాదాపుగా మండప నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కొందరు పండుగ రోజున చేస్తే, మరికొందరు నిమజ్జనం రోజున.. ఇంకొందరు నవరాత్రుల ప్రతిరోజూ ప్రసాదాల వితరణ చేపట్టి వచ్చిన భక్తులందరినీ ఆదరించారు. ఖైరతాబాద్ బడా గణేశ్ దగ్గరైతే లక్షలాదిగా వచ్చిన భక్తులందరికీ ఉదయం, సాయంత్రం కూడా వివిధ సంస్థల వారు విరామం లేకుండా, అలుపన్న మాట ఎత్తకుండా భారీ ఎత్తున ప్రసాద వితరణ చేశారు.



అంతేకాదు, బడా గణేశ్ సమక్షంలోనే లక్ష్మీ గణపతి హోమం, స్వామి కళ్యాణం తదితర కార్యక్రమాలు జరిగాయి. ఈ వేడుకల్లో ఎందరో వారి వారి కులంతో సంబంధం లేకుండా పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అంతేకాదు, స్వామి వారికి భారీగా లక్ష రుద్రాక్షల మాల వేసి, చివరి రోజున ఆ రుద్రాక్షలను భక్తులందరికీ పంచారు. ఇక్కడెక్కడా కులం, జాతి, వర్గం అనే మాటకే చోటులేదు.

ఇటీవల ఒక పార్టీకి చెందిన అగ్రనేత హిందూ సమాజంలో స్త్రీలకు స్వేచ్ఛ లేదని, వారిని చిన్నచూపు చూస్తున్నారని, వారి పట్ల వివక్ష ఉన్నదని మనుస్మృతిని ప్రస్తావించి మరీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆ వ్యాఖ్యలకు కూడా ఈ గణపతి నవరాత్రి వేడుకలు గట్టిగానే జవాబు ఇచ్చాయి. ఈ ఉత్సవంలో భాగంగా జరిగిన ప్రసాద వితరణలు, అన్నదానాలు, పూజా కార్యక్రమాలలో హిందూ మహిళలు విశేషంగా పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతంగా కార్యక్రమాలను నిర్వహించారు. వీధులలోను, అపార్ట్‌మెంట్లలోని ఏర్పాటుచేసిన వేలాది గణేశ మంటపాల నిర్వహణలో ఎందరో స్త్రీలు, మరీ ముఖ్యంగా బాలికలు, యువతులు ప్రముఖ పాత్ర వహించారని అనడంలో ఏమాత్రం సందేహం లేదు.

అంతేకాదు, నవరాత్రి వేడుకలు జరిగిన ఆయా మండపాల పరిసరాలలో ఏర్పాటు చేసిన తాత్కాలిక దుకాణాలు ఎన్నిటినో స్వయంగా మహిళలే ఏర్పాటు చేసుకున్నారు. ఒకవైపు తమ పిల్లలను చూసుకుంటూనే, మరోవైపు కస్టమర్లతో మాట్లాడుతూ, బేరసారాలు సాగిస్తూ యుపిఐ ద్వారా డిజిటల్ చెల్లింపులను చేయిస్తూ తమ వ్యాపారాలు చేసుకున్నారు. వీరిలో ఎక్కువమంది పక్క రాష్ట్రాల నుంచి వచ్చినవారే కావడం గమనార్హం. హిందూ సమాజంపై విమర్శలు చేస్తూ కాలం గడిపేవారంతా ఒక రోజైనా ఈ ప్రాంతాలను సందర్శిస్తే వారికి వాస్తవం బోధపడుతుంది.

ఈ సమైక్యత, సుహృద్భావం కేవలం ఖైరతాబాద్ బడా గణేషుని సన్నిధికి మాత్రమే పరిమితం కాదు, బాలాపూర్ గణేశుడు సహా తెలంగాణ అంతటా, ఇంకా చెప్పాలంటే దేశంలోని అన్ని రాష్ట్రాలు, ప్రధాన నగరాలు, పట్టణాలు, గ్రామాలు పల్లెల్లో సైతం ఇదే కుల, మత ఐక్యత ఇవన్నీ కనిపిస్తాయి. ఇది వినాయక చవితికి మాత్రమే పరిమితం కాదు దీపావళి, విజయదశమి, సంక్రాంతి, గ్రామ దేవతల జాతరలు, వివిధ దేవీదేవతల వేడుకలు ఇలా ఏ పండుగ వచ్చినా పైన చెప్పిన వాతావరణం హిందూసమాజంలో కనిపిస్తుంది.

రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్‌ఎస్‌ఎస్) శతాబ్దిని పురస్కరించుకుని ఇచ్చిన పంచపరివర్తన్‌లో భాగంగా ఉన్నటువంటి కుటుంబ ప్రబోధన్ (ఇందులోని షడ్సూత్రాలు: భజన్, భోజన్, భాష, భూష, భువన్, భ్రమణ్), పర్యావరణం, సామాజిక సమరసత, స్వదేశీ, పౌరవిధులు ఇలా ప్రతి ఒక్కదానికి నిజమైన స్ఫూర్తిగా గణేశ నవరాత్రులు నిలిచాయనడం పరమ సత్యం.

అయితే, ఎవరో ఇద్దరి మధ్య వ్యక్తిగతంగా జరిగే చిన్న చిన్న వివాదాలను హిందూ మతానికో, ఒక కులానికో, వర్గానికో ఆపాదిస్తూ హిందువులను చీల్చేందుకు పలు వర్గాలు కిందామీదా పడు తున్నాయి. తెలంగాణలో గతేడాది 'మార్వాడీ గో బ్యాక్' అంటూ మార్వాడీలపై కుట్ర చేసినట్లే, ఈ మధ్య అమెరికాకు చెందిన పీటర్ నవారో అనే నేత హిందువుల్లోని బ్రాహ్మణ సామాజిక వర్గంపై బురద జల్లాడు. అమెరికా, ఐర్లాండ్ తదితర దేశాలలో భారతీయులవల్ల మాకు ఉపాధి దొరకడం లేదంటూ పొమ్మంటున్నారు. చివరికి ఆరేళ్ల భారతీయ బాలికపై ఇదే కారణంతో తోటి పిల్లలు స్కూల్‌లో దాడి చేశారు. బాంగ్లాదేశ్, పాకిస్తాన్ దేశాలు హిందువుల్ని ఊచకోత కోస్తుంటే ఆస్ట్రేలియా, కెనడా దేశాల్లో ఖలిస్తాన్ వాదులు హిందువుల్ని లక్ష్యంగా చేసుకున్నారు. అక్కడి దాకా ఎందుకు.. మమతా హయాంలో మొన్నటి వరకూ బెంగాల్‌లో చూశాం. తర్వాత కేరళ, తమిళనాడు రాష్ట్రాల్లోనూ ఈ పరిస్థితి కనిపిస్తోంది. వ్యక్తులు వ్యక్తిగతంగా చేసే తప్పులను వ్యవస్థలపైకి నెట్టి ఆ వ్యవస్థ లేదా ఆ వర్గం మొత్తానికి దోషాన్ని ఆపా దించడం సరైన చర్యేనా?

ఇకనైనా హిందువులు మేలుకోవాలి, మతసామరస్యాన్ని పాటిస్తూనే, కుల వివక్షను ఇప్పటికే ఎంతో అధిగమించి ముందుకు సాగుతున్నట్టుగానే.. తమపై జరిగే ఎదురుదాడులు, కుట్రలు కుతంత్రాలను పటిష్టమైన వ్యూహంతో ఎదుర్కోవాలి. మన తర్వాతి తరాలవారిని నిజమైన హిందువులుగా తయారు చేసుకుని భారతదేశాన్ని, సనాతన ధర్మాన్ని కాపాడుకోవాలి... మన దేశం విశ్వగురువుగా ఎదగాలి.



గుళ్ళపూడి శ్రీనివాసకుమార్

# మన విశిష్టత విశ్వవ్యాప్తం





స్వదేశీయులే తమ మూలాలను, భాషలను విస్మరిస్తున్న ఈ కాలంలో... యోగా, భరతనాట్యం, తత్వశాస్త్రం, సంస్కృత-హిందీ సాహిత్యాన్ని నిత్య నూతనంగా నిలుపుతూ ఎందరో విదేశీ మహిళలు భారతీయ విశిష్టతను విశ్వవ్యాప్తం చేస్తున్నారు. భాషా సరిహద్దులను చెరిపేసి భారతీయ జ్ఞాన సంపదకు పట్టం కడుతున్నారు. ఈ సాంస్కృతిక రాయబారుల సేవలను గుర్తిస్తూ భారత ప్రభుత్వం అందిస్తున్న పద్మ పురస్కారాలు, వసుధైవ కుటుంబకం అనే సూక్తిని సార్థకత చేకూరుస్తున్నాయి. మన సనాతన ధర్మానికి మరింత వన్నె తెచ్చిపెడుతున్నాయి.

ఇక్కడి జ్ఞాన సంపద, తత్వశాస్త్రం భాషల పట్ల ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న ఆదరణకు మనదేశం ఇటీవల ప్రకటించిన పద్మ పురస్కారాలే నిదర్శనం. గతంలో సి.పి. బ్రౌన్ నుండి నేటి డాక్టర్ లియుద్మిలా ఖోఖ్లోవా వరకు అనేకమంది విదేశీయులు భారతీయ సమాజానికి, సాహిత్యానికి వెలకట్టలేని సేవలు అందించారు. అటువంటి వారిని మన దేశం ఫెలోషిప్‌లు, ప్రవాసి భారతీయ సమ్మాన్ వంటి ప్రోత్సాహకాల ద్వారా గౌరవిస్తోంది

డాక్టర్ లియుద్మిలా ఖోఖ్లోవాకు భారత ప్రభుత్వం తాజాగా 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందజేసింది. రష్యాలోని మాస్కో స్టేట్ యూని వర్సిటీలో సుదీర్ఘ కాలం పాటు హిందీ, పంజాబీ భాషలపై పరిశోధనలు చేయడమే కాకుండా, పవిత్ర సిక్కు గ్రంథాలైన 'జప్ జీ', 'జప్ సాహిబ్'లను రష్యన్ భాషలోకి ఖోఖ్లోవా అనువదించారు. వేలాదిమంది విదేశీ విద్యార్థులలో భారతీయ సాహిత్య అధ్యయనాలపై ఆసక్తి పెంచిన లియుద్మిలా కృషిని గుర్తిస్తూ ప్రభుత్వం పద్మశ్రీతో సత్కరించింది.

ఇక, వందేళ్ల వయసులోనూ యోగాను నేర్పిస్తున్న ఫ్రాన్స్‌కు చెందిన షార్లెట్ షోపిన్, భరతనాట్యాన్ని వ్యాప్తిచేస్తున్న సిల్వి మోర్గాన్ వంటి విదేశీ మహిళల సేవలు...మన సాంప్రదాయాలను గౌరవించాల్సిన బాధ్యతను స్వదేశీయులకు గుర్తుచేస్తున్నాయి. ఇటీవల రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతుల మీదుగా సాహిత్యం, విద్య విభాగంలో డాక్టర్ లియుద్మిలా ఖోఖ్లోవా 'పద్మశ్రీ' పురస్కారాన్ని అందుకున్నారు. 1954లో పద్మ అవార్డులు ప్రారంభమైనప్పటి నుంచి ఈ పురస్కారం పొందినవారిలో పదిమంది వరకు రష్యన్ పౌరులు ఉన్నారు.

మాస్కో స్టేట్ యూనివర్సిటీలో 1970లో హిందీ భాషా సాహిత్యంలో ఎంఏ పూర్తి చేసిన ఖోఖ్లోవా 1974లో హిందీ, రాజస్థానీ భాషల పోలికపై పరిశోధన చేసి డాక్టరేట్ పొందారు. మాస్కో స్టేట్ యూనివర్సిటీకి చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఏషియన్ అండ్ ఆఫ్రికన్ స్టడీస్‌లో ఇండియన్ ఫిలాలజీ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. హిందీ, రష్యన్, ఇంగ్లీష్ భాషలలో 6 పుస్తకాలు, 92 పరిశోధనా పత్రాలు ప్రచురించారు. హిందీతో పాటు పంజాబీ, సిక్కు భాషల్లో విశేష పరిశోధన చేశారు. సిక్కుల పవిత్ర గ్రంథాలైన గురునానక్ దేవ్ జీ, 'జప్ జీ',10వ గురువైన గోవింద్ సింగ్ జీ 'జప్ సాహిబ్'లను పంజాబీ నుండి రష్యన్ భాషలోకి లియుద్మిలా అనువదించారు. ఆమె పంజాబీ అధ్యయనాలకు చేసిన సేవలకుగానూ 2005లో లండన్‌లోని 'పంజాబీ సాత్' నుండి అవార్డు పొందారు.

రష్యన్ విద్యార్థులకు కేవలం హిందీ భాషనే కాకుండా, భారతదేశ చరిత్ర, సంస్కృతి, ఆర్థిక వ్యవస్థపై ఆసక్తిని పెంపొందిస్తూ భారతీయ సంస్కృతిపై ప్రేమ వ్యాప్తి చెందేలా చేశారు. ఖోఖ్లోవా మాత్రమే కాదు... భారత సేవా రంగంలో విదేశీయులు ఎందరో పని చేశారు. ఐర్లాండ్‌కు చెందిన మార్గరెట్ నోబుల్ సిస్టర్ నివేదిత స్వామి వివేకానంద శిష్యురాలిగా భారత్‌కు వచ్చి, బాలికల విద్య, మహిళా సాధికారత, దేశభక్తి ఉద్యమానికి ప్రాణం పోశారు.

బ్రిటన్‌కు చెందిన చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సి.పి. బ్రౌన్) బ్రిటన్ ఆంధ్రాలో కలెక్టర్‌గా పనిచేస్తూ, అంతరించిపోతున్న తెలుగు సాహిత్యాన్ని, వేమన పద్యాలను సేకరించి నిఘంటువులు రూపొందించి తెలుగు భాషా బాంధవుడుగా నిలిచారు. అలాగే బ్రిటన్‌కు చెందిన మార్క్ టుల్లీ కూడా బీబీసీ ప్రముఖ పాత్రికేయుడిగా దశాబ్దాల పాటు భారతీయ గ్రామీణ జీవనం, రాజకీయం, సంస్కృతిని ప్రపంచానికి నిజాయతీగా చాటారు. ఫ్రాన్స్‌కు చెందిన ఫ్రాంకోయిస్ గాథియర్ భారతీయ చరిత్ర, సంస్కృతి, పరంపరలపై విపరీతమైన పరిశోధన చేసి, తన పుస్తకాల ద్వారా అంతర్జాతీయంగా ప్రాచుర్యం కల్పించారు. ఖాన్ అబ్దుల్ గఫార్‌ఖాన్, నెల్సన్ మండేలా వంటి వారికి భారత రత్న ఇచ్చి గౌరవించారు.

వంద ఏళ్ల వయస్సులో పద్మశ్రీ పొందిన యోగా గురువు షార్లెట్ షోపిన్. ఇటీవల పద్మశ్రీ పొందిన విదేశీ మహిళల్లో ఈమె ఒకరు. గత 40 ఏళ్లకు పైగా ఫ్రాన్స్‌లో వేలాది మందితో భారతీయ యోగా విద్యను ఉచితంగా సాధన చేయిస్తూ, యోగా విశిష్టతను ఐరోపాలో ప్రాచుర్యంలోకి తెచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో మహిళా సాధికారత, పేదరికం, మానవ హక్కులపై డాక్యుమెంటరీలు తీసిన ప్రముఖ వ్యాఖ్యాత, సినీ నిర్మాత అయిన ఫ్రెడరిక్ బెడోస్ అంతర్జాతీయంగా అవగాహన కల్పించారు. భారతీయ సంప్రదాయ నృత్యమైన భరతనాట్యం పట్ల ఉన్న మక్కువతో, ఫ్రాన్స్‌లో నృత్య పాఠశాలను ప్రారంభించి ఐరోపా విద్యార్థులకు భరతనాట్యాన్ని నేర్పిస్తూ భారతీయ కళలను వ్యాప్తి చేస్తున్నారు ఫ్రాన్స్‌కు చెందిన సిల్వి మోర్గాన్. స్పెయిన్‌లోని విశ్వవిద్యాలయాలలో భారతీయ సాహిత్యం, రవీంద్ర నాథ్ ఠాగూర్ కవితలు, భారతీయ తత్వశాస్త్రంపై పరిశోధనలు ప్రోత్సహిస్తూ దశాబ్దాలుగా అధ్యాపకురాలిగా సేవలందిస్తున్నారు డాక్టర్ రోజాలియా బైలో.

సరిహద్దులు, భాషలు, భౌగోళిక అడ్డంకులకు అతీతంగా మానవత్వమే పరమావధిగా భారతీయ సంస్కృతికి సేవ చేస్తున్న ఈ విదేశీ విద్వాంసుల ప్రయాణం ప్రతీ ఒక్కరికీ అత్యంత స్ఫూర్తిదాయకం. భారతీయ తత్వానికి సజీవ సాక్ష్యాలుగా నిలుస్తున్న వీరి సేవలను గౌరవించుకోవడం మన బాధ్యత మాత్రమే కాదు... మన మూలాలను కాపాడు కోవాల్సిన ఆవశ్యకతను నొక్కిచెప్పే మధురమైన జ్ఞాపిక.



**జయశ్రీ ఆచంట**
సీనియర్ జర్నలిస్ట్

# ఆదర్శ స్వయంసేవక్ మజ్జి నరసింహులు



**శ్రీకాకుళం :** సంఘం కార్యకర్త నుంచి ఆశించే ఐదు గుణాలు జీవితాంతం సక్రియత్వం, సహజత్వం, సంఘ కేంద్రీతవర్తనం, సకారాత్మక దర్శనం, సంవేదన శీలతతో పాటు సమన్వయ ప్రవృత్తులకు నర్సింహులు ప్రతిరూపమని క్షేత్ర సహ సంఘచాలక్ దూసి రామకృష్ణ అభివర్ణించారు. సెప్టెంబర్ 21న శ్రీకాకుళంలో జరిగిన మజ్జి నరసింహులు (శ్రీకాకుళం జిల్లా పూర్వ సంఘచాలక్) సంస్మరణ సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు.

అ.భా కార్యకారిణి సదస్యులు భాగయ్య పంపించిన సందేశంలో మజ్జి నరసింహులు గారు సార్థక జీవనులు, కర్మయోగి. ఉద్యోగంలో, కుటుంబంలో, సంఘంలో, ఉన్నతమైన జీవితం గడిపి ఆదర్శంగా నిలిచారని పేర్కొన్నారు. విభాగ్ సంఘ చాలక్ డీవీవీ కృష్ణంరాజు మాట్లాడుతూ ఎల్లప్పుడూ చిరు నవ్వుతో ఆదర్శ గృహస్థ కార్యకర్తగా కుటుంబ వ్యవస్థ ఎలా ఉండాలో చూపించిన వ్యక్తిత్వం నర సింహులు గారిదని కొనియాడారు.



నరసింహులు గారి పెద్ద కుమారుడు డా. ఈశ్వర రావు మాట్లాడుతూ, తమ తండ్రి గారి జీవితానికి సంఘం సంపూర్ణతను చేకూర్చిందని అలాగే ఆయన మా కుటుంబాన్ని పరిపూర్ణ సంఘ కుటుంబంగా మార్చారని అన్నారు. వారి పట్ల ఆదరాభిమానాలతో విచ్చేసిన అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. విభాగ్, జిల్లా కార్యకర్తలతోపాటు జిల్లా నలుమూలల నుండి 200 మంది స్వయంసేవకులు పాల్గొని నివాళులర్పించారు.

**అనంతపురం :** వందేమాతర గీతానికి 150 సం॥ పూర్తయిన సందర్భంగా సెప్టెంబర్ 25న అనంతపురం జిల్లా పామిడిలోని శ్రీసరస్వతీ విద్యా మందిరం ఉన్నత పాఠశాలలో 'నమామి భారతం' కార్యక్రమం జరిగింది.

ప్రాంత సహ కార్యవాహ మాలపాటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ వందేమాతరం విశిష్టతను, జాతి చైతన్యానికి అమర స్వరంగా, దేశ స్వాతంత్ర్యానికి ప్రేరణ ఇచ్చిన గీతంగా, దీనిలో అన్ని చరణాలు దేశ ప్రజలు అందరు కలిసి పాడుతూ దేశ సమైక్యతకు, సమగ్రతకు ప్రేరణగా తీసుకుని ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణ దిశలో కృషి చేయాలని తెలియ జేశారు.





పామిడిలో గల అన్ని ఉన్నత పాఠ శాలల నుంచి జూనియర్ కళాశాలనుండి విద్యార్థులు, తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు 2500 మంది పాల్గొని వందేమాతరంను సామూహికంగా ఆలపించారు.



**భాగ్యనగర్ :** విద్యాభారతి అఖిల భారతీయ శిక్షాసంస్థాన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ కేంద్రంగా బండ్లగూడజాగీరులో గల శ్రీ విద్యారణ్య ఇంటర్నేషనల్ స్కూల్ ప్రాంగణంలో అఖిలభారత ఖేల్‌కూద్‌లో భాగంగా 3 రోజులపాటు (సెప్టెంబర్ 25 నుంచి 27) జాతీయ స్థాయిలో స్కేటింగ్ పోటీలు జరిగాయి. ముఖ్య అతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ ఆఫీసర్ ఎల్.వి. సుబ్రహ్మణ్యం, దక్షిణమధ్య క్షేత్ర సంఘటన కార్యదర్శి లింగం సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ పోటీలలో అనేక రాష్ట్రాలనుంచి 168 విద్యార్థులు(బాలికలు53, బాలురు 115) పాల్గొన్నారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ప్రముఖ పారిశ్రామిక వేత్త ఎస్.ఎల్ ఇన్ఫ్రా గ్రీన్ బిల్డింగ్స్ అధినేత పెరియవరం గోపాల్‌రెడ్డి, విద్యాభారతి దక్షిణమధ్య క్షేత్ర అధ్యక్షులు చామర్తి ఉమామహేశ్వరరావు పాల్గొని విజేతలకు స్వర్ణ, రజత, కాంస్య పతకాలు అందించారు. ఇందులో గెలుపొందిన విద్యార్థులు స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్. జి. ఎఫ్.ఐ)కి ఎంపిక కావడం విశేషం.



**విజయవాడ:** దీనదయాళ్ ఉపాధ్యాయ జయంతి సందర్భంగా సెప్టెంబర్25న విజయవాడలో భారతీయ జనతాపార్టీ నిర్వహించిన 'జాతీయభావం కరువైన కమ్యూనిష్టులు" అనే పుస్తకాన్ని బీజేపీ అ.భా.ఉపాధ్యక్షులు రామ్‌మాధవ్ ఆవిష్కరించారు. బీజేపీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, వడ్డి విజయసారథి, గ్రంథరచయిత డాక్టర్ దుగ్గరాజు శ్రీనివాసరావు కార్యక్రమంలో పాల్గొన్నారు.

కథ

# జాడీ-ఉపనిషత్

గుంటూరి ప్రసాద్

రోహిణీ కార్తె ఎండలు, ఉడుకులు, నీరసాలు... ఆనవాయితీగా నా భార్య వేసవి సెలవులకి పిల్లల్ని తీసుకొని పుట్టింటికి వెళ్లింది. లీవు దొరకకపోవడం వల్ల నాకు కుదరలేదు. తిరిగి వచ్చేటప్పుడు ఆవకాయ లాంటివి లగేజీలు ఎక్కువగా ఉంటాయి కాబట్టి, అప్పటికి వెళదామని అనుకుంటున్నాను. నాకు చేతనైనదేదో వండుకుతింటూ గడుపుతున్నాను.

ఆదివారం అవడం వల్ల లేచేసరికి ఉదయం ఎనిమిది. అంతలోనే పాలవాడు, పనిమనిషి వాళ్ల వాళ్ల కర్తవ్యాలు నిర్వర్తించి వెళ్లేసరికి పూర్తిగా తొమ్మిది. కప్పులో కాచిన పాలు, కాఫీ పొడరు కలుపుకొని, టీవీ, ఫ్యాన్ స్విచ్‌లు వేసుకొని కప్పు మూతికి అందిస్తున్నానోలేదో, సరిగ్గా అదే టైముకి మా పక్క ఇంట్లోంచి కేక. ఆయనా మా ఆఫీస్ ఆయనేలెండి, “ఇంట్లో ఉన్నావా? ఇలా బయటకు రా ఒకసారి”.

హడావిడి చూస్తే ఏదో కొంపలు మునిగి ఉంటాయి అనుకుంటూ చేతిలో కప్పుతోనే బయటకు నడిచాను. నాలుగు అడుగుల గోడకి ఇటు నేను అటు ఆయన.

“మన ఆఫీస్ ట్రాన్స్‌ఫర్ ఆర్డర్లు రిలీజయ్యాయట, తెలిసిందా వార్త ?” అదీ విషయం.

“నాకు తెలియలేదండీ, చెప్పండి ! చెప్పండి ! నేను కొత్త బాసు దగ్గరకు వెళుతున్నానా? మనకి కొత్త బాసు ఎవరైనా వస్తున్నారా?” ఆతృతగా అడిగాను, మొత్తానికి సవివరంగా వివరాలు తెలిశాయి. నా పేరు లేదని నాకూ, తన పేరు ఉందని ఆయనకు, వెరశి ఇద్దరికీ కూతంత సేపు నిరాశ. ఇంత నిరాశా నిస్పృహలలోనే ఫోన్ల ద్వారా వార్త దావానంలా వ్యాపించి, పావుగంటలోనే అయిదారుగురు సహఉద్యోగులు అంతా ఇక్కడికే ప్రత్యక్షమయ్యారు. ఏదో అంతా మా చేతుల్లోనే ఉన్నట్లుగా, గతం నుండి రాబోయే సంవత్సరాల వరకు బదిలీలపై చర్చ, జరిగిన న్యాయాన్యాయాలు, ప్రాంతీయ పక్షపాత ధోరణులు, కాలక్షేపం కబుర్లు, మధ్యమధ్యలో ఫోన్లు, కాఫీలు అలా అలా గడిచిపోయింది ఆ పూటంతా. వీటన్నింటికీ అసలు కారణం చాలా మందికి వేసవి సెలవులు కారణంగా భార్యపిల్లలిక్కడ లేరు. వాళ్లూ నాలాగే.

నెమ్మదిగా ఆకలి మొదలై టైం చూసుకునే సరికి ఒంటిగంట. అందరం ఎవరికివారే యమునాతీరే అయ్యి, ఖాళీ కప్పులు సింకులో పెట్టి, ఏమిటి ఇప్పుడు తక్షణ కర్తవ్యం అనుకుంటూండగానే కొట్టింది మా గంటల గడియారం రెండు దెబ్బలు. అన్నంలోకి ఏముందో చూద్దామని తలుపుతీస్తే, పెరుగు కోసం సరే, ఇకదేనికీ నా మీద ఆధారపడవలసిన అవసరం లేదని నిర్మొహమాటంగా చెప్పేసింది మా ఫ్రిజ్. అలాంటప్పుడే కదా ! దీనజనుల్ని ఆదుకునే ఆపద్బాంధవి ఆవకాయ జాడీని ఆశ్రయించేది, అని జ్ఞప్తికి వచ్చింది నాకు.

చకచకా అన్నం కుక్కర్ పెట్టేశాను, స్నానానికి అలా వెళ్లాను, ఇలా వచ్చాను. దేవుడికేసి దీనంగా ప్లీజ్ అన్నట్లు చూసి, ఖంగారు ఖంగారుగా మూడు దణ్ణాలు పెట్టేసి, పూజ కూడా అయ్యిందనిపించాను. అంతలోనే మీల్స్‌రడీ.. మీల్స్‌రడీ.... మీల్స్ రడీ.. అన్నట్టుగా మూడు కూతలు కూసేసింది మా అన్నపూర్ణాదేవీ అవతారం కుక్కర్. కంచం, మంచినీళ్లు పెట్టుకున్నాను. పెరుగు రడీ చేశా, అన్నం వడ్డించేశా, సీలింగ్ ఫ్యాన్ స్విచ్ కూడా వేసేశా.

ఇక్కడ ఒక విషయం, అదేమిటంటే నిలవకోసం శుచి శుభ్రత కలిగిన అలమారలో ప్రత్యేకస్థానంలో మూలవిరాట్ లాగ “పెద్ద అవకాయ జాడి”, నిత్య అవసరాల కోసం అందుబాటులో ఉత్సవ విగ్రహం లాగ “చిన్న ఆవకాయ జాడి”. ఇది సర్వజన సమ్మతమైన తెలుగువారి సంప్రదాయం. మాఇంట్లోనూ అంతే.

తీరా, కంచంలో అన్నం పెట్టుకున్నాక, నాకు షాక్ ఇచ్చింది మా చిన్నజాడి. అది శుభ్రంగా కడగబడి, తుడవబడి, బోర్లించబడిన అవతారంలో ప్రత్యక్షమయింది. ఇక చేసేదేముంది ? బల్లమీద ఎక్కి మూలవిరాట్ రూపం “పెద్ద ఆవకాయ జాడి” ని కిందకు దింపాను జాగ్రత్తగా పైనున్న వాసెన గుడ్డ తీసి, ఆకలితో కూడిన ఆతృతతో మూత తీసాను. ఒక్కసారిగా ఫ్యూజ్‌లు అవుట్. జాడి కడిగేసినట్టుగా లేదు కానీ, అరచెయ్యి పెట్టి మొత్తం జాడి ఊడ్చినానసరే వచ్చే ఆవకాయ ఒక్కపూటకు సరిపోతే ఒట్టు. కొత్త ఆవకాయ ఎలాగూ తెస్తాను కదా అనో ఏమో, ఈ విషయాన్ని మా ఆవిడ నాతో మాట వరసకైనా అనలేదు. మొత్తానికి జాడీలో చెయ్యిపెట్టి, ఊడ్చి, ఊడ్చి ఆ పూటకు సరిపడా కొంచెం ఆవకాయ పిండి లాంటిది తీస్తున్నానోలేదో, చేతిలోకి వచ్చిన ఆ కొంచెంలో కొంచెం జారు కుంటూ జాడి లోపలికే పడిపోయింది. అరచేతికి ఉన్నదాన్ని అన్నంలతో కలి పేశాను. నెయ్యివేశాను. ముద్ద కలిపాను. నోట్లో పెట్టాను. ఆహా ఏమి రుచి, శభాష్ అనుకున్నాను నాలోనేనే.

అప్పుడు కొట్టిందండి అస్సలు సిస్సలైన సెంటిమెంటల్ మానవీయతా కోణపు దెబ్బ. ఏమిటి? ఈ అవకాయకి ఎందుకింత రుచి? ఎవరు కలిపేరు దీన్ని ఇంత కరక్టు సమపాళ్లలో?... ఒక్కసారిగా నాకళ్ల ముందర టార్టాయిస్ కాయిల్ లాగ గిర్రున తిరిగింది మూడు వందల అరవై అయిదు రోజుల గతం.

గత సంవత్సరం వేసవిలో ప్రతీసారి లాగ మేమూ మా ఊరికి వెళ్లాము. వచ్చేసే రోజు “ఆవకాయకూడ తీసికెళ్లాల్రోయ్, జాడీలో సర్దుతున్నాను” వంటిట్లోంచి ఆజ్ఞాపూర్వకంగా అమ్మపెట్టిన కేక, ఇప్పుడు నా చెవిలో రింగు రింగుమంటోంది. లగేజీ ఎక్కువగా ఉండడం వల్ల అఇష్టంగానే జాడీ మోసుకొచ్చాం.. ఇష్టంగా తిన్నాం.. ఇంకా తింటున్నాం. ఇప్పుడు చివరికొచ్చింది అదే జాడి.

గత శ్రావణంలో అమ్మకు చాలా సీరియస్ అయింది. వెంటనే బయల్దేరి వచ్చేయమని ఊళ్లో ఇంటి నుండి ఫోన్. కుండపోత వర్షం. ప్రయాణంలో ఇబ్బందులు, ఫోన్ చార్జింగూ లేదు, చార్జరూ లేదు, వెరశి బరువైన ప్రయాణం. చేరేసరికి అమ్మకు ఎలా ఉంటుందోనన్న ఆందోళనల మధ్య ఊరికి



చేరుకున్నాం. అప్పటికే అంతా అయిపోయింది. రోజులూ, కర్మకాండలూ పూర్తి అయ్యేదాక ఉన్నాం. అమ్మ ఆకస్మికంగా పోవడం వల్ల ఇంటి సామాన్లు ఏవీ పనికిరావని, త్యజించమని, అసలు సంవత్సరం వరకు ఇల్లు తాళం పెట్టేయమని అన్నారు పెద్దలంతా. తు.చ. తప్పకుండా అన్నీ అలాగే జరిగిపోయాయి. వారి మాటలకు గౌరవం ఇచ్చినందుకు ఏదో సాధించినంత గర్వంగా వెళ్లారు బంధువులంతా.

మళ్లీ వర్తమానంలోకి వద్దాం. ఇప్పుడు నేను నోట్లో పెట్టుకున్నది ఏమిటి? ఎవరు దీనిని సమపాళ్లలో ఇంత రుచికరంగా కలిపారు?? నాకు ఇప్పుడు అంతా అర్థం అయింది. ఇది అమ్మ తన స్వహస్తాలతో కలిపిన ఆవకాయ. ఆమె కలిపిన ఆహార పదార్థం అనబడే ప్రసాదం తినే అదృష్టానికి చివరి అవకాశం. ఆది మరల మరలా తిరిగి రాదు... రాదు... రాదు.. అసలు అవకాశం లేనేలేదు... లేదు...లేదు.. కంచంలో కలిపిన ఆవకాయ అన్నం ముద్ద తింటుంటే ఎంతో ఆనందం, ఆర్ద్రతతో కూడిన విచారం. ఆందోళనామనోభారం. ఒకే క్షణంలో అన్ని కోణాలను సమపాళ్లలో ఆస్వాదించాను, అనుభవించాను. అమ్మపోయిన రోజుకంటే ఎక్కువ కలతగా ఉంది.అలా భోజనం అయ్యిందని పించా.. వేళ్లు చీకుతూ, మొత్తానికి చెయ్యి కడిగాను. అనుభవాలు, జ్ఞాపకాలు నెమరువేస్కుంటూ మంచం మీదకి ఒరిగాను. చిన్న కునుకు పట్టింది, అంతలోనే కల, ఎవరో ఒకావిడ పిల్లాడికి సైకిల్ తొక్కడం నేర్పుతోంది. వాడు పడిపోబోయిన ప్రతీసారి ఆమె ఒక్కటే చెబుతోంది "నీకు నువ్వే బేలన్స్ చేసుకోవాలి, తొక్కుతూ ఉండు. ప్రతీసారి అమ్మ నీ వెనకే ఉండి పట్టుకోదు".



అకస్మాత్తుగా మెలకువ వచ్చింది. అమ్మగుర్తుకు వస్తే ఆర్తితో కూడిన భారం, కల గుర్తుకు వస్తే కొంచెం ధైర్యం.అమ్మదూరం అయినప్పుడు కూడా బంధువు లెంత ధైర్యం చెప్పినా, నాకు నేనుగా నిలదొక్కుకోవడానికి పది పదిహేను రోజులు పట్టింది. ఇప్పుడు ఈ తరుణంలో ఎవరున్నారు నాకుతోడు? అప్పుడు అర్థం అయింది నాకు.. జాడీలోంచి తీసేటప్పుడు కొంచెం ఆవకాయ చెయ్యిజారి మరలా జాడీలో ఎందుకు పడింది అన్న విషయం.

ఆ కొంచెం ఆవకాయనే నేను రెండు వారాలు ఆయుర్వేద మందు పరిమాణంలో ఒక్క అన్నం ముద్దలో కలుపుకొంటూ తిన్నాను. చివరకు జాడీలో అన్నం వేసి ఊడ్చి ఊడ్చి కూడా తిన్నాను. అలా అలా, నాకు నేనే పడిపోకుండా బేలన్స్ చేసుకున్నాను. నా మనసుకి నేనే ధైర్యం చెప్పుకొని, ఇవన్నీ అందరికీ ఎదురయ్యే మానవీయతా కోణాల..నేనేమీ ప్రత్యేకం కాదు అనుకుని సరిబెట్టు కున్నాను. అందుకే మా ఇంట్లో ఆవకాయ మారినా, జాడీ మాత్రం ఇప్పటి వరకు అదే.

ఏదో ఒకరోజు చేయి జారితే ఆ జాడీ కూడా అమ్మదగ్గరికి చేరుతుందనే నగ్నంసత్యం ముందే తెలుసుకొని, ఈ లోకంలో ఏదీ శాశ్వతం కాదని, మధుర జ్ఞాపకాలే శాశ్వతం అని, అవి కూడా మనం ఉన్నంతవరకే.... అది జాడి కాదు, వేదాంత మంజూష. ఇదీ నేను అవగతం చేసుకున్న అమ్మ ఆవకాయ భాండంలో అంతర్లీనంగా దాగివున్న సత్ జీవన మార్గం బోధించే ఉపనిషత్ సారం. ★






**"ఆంధ్రుల సాంఘిక చరిత్ర"లో, దక్షిణ భారత భాషాపదాల ఆధారంగానే ఆంగ్లంలో మ్యాంగో వచ్చిందంటారు సురవరం ప్రతాపరెడ్డి. ఆయన 'మామిడిపండు' అనే వ్యాసంలో దాని పుట్టు పూర్వోత్తరాలు చరిత్రను వివరిస్తూ పూర్వ హైదరాబాదు ప్రాంతంలో దాదాపు పాతిక వేల ఎకరాల విస్తీర్ణంలో మామిడి తోటలు ఉండేవని పేర్కొన్నారు.**

**మా**మిడి పండ్లు వచ్చేది ఎందుకంటే జీవితం కాసింత రసభరితం చేసుకొండయ్యా అని గుర్తు చేయడానికి, ఉదయాన అల్పాహారానికి కూర్చుని చద్దన్నంలో మామిడిరసం జుర్రుకుంటూ, వేడి వేడి పూరీలను మామిడిరసంలో ముంచుకుంటూ, సువర్ణ కాంతిలో మెరిసే మామిడి ముక్కలు మెరుపులతో ముఖాన్ని శోభిస్తూ, జిహ్వకు స్వర్గం అందడం అంటే ఏమిటో అనుభవిస్తూ బ్రతుకును కాస్త రుచిమధురం చేసుకోమని చెప్తుంది. లోకాన మంచి కానీ, మామిడి రుచిగాని బహుకొద్ది. అందువలన దొరికిన ప్రతీ లిప్తను జుర్రుకోమంటుంది కాలం.

మామిడికాయలే కాదు, మామిడి ఆకులు శుభానికి, శ్రేయస్సుకు, ఆనందానికి శక్తిమంతమైన చిహ్నాలు. వీటిని చూదపత్రం అని పిలుస్తారు. తెలుగు సంస్కృతిలో ఉగాది, వివాహాలు లేదా గృహప్రవేశాలు వంటి ఏ శుభకార్యమైనా ప్రధాన ద్వారానికి మామిడితోరణం కట్టడంతో ప్రారంభిస్తాం. అవి లక్ష్మీదేవికి, సంతానోత్పత్తికి ఎదుగుదలకు, సంవృద్ధికి ప్రతీకలు అలాగే మామిడి ఆకుల్లోని యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు ఆరోగ్యానికి మేలు చేస్తాయి. మామిడి రొమ్ము క్యాన్సర్, పెద్ద ప్రేగు కాన్సర్ కణాల పెరుగుదలను అరికడుతుందని నిపుణులు కనుగొన్నారు. పాదాల పగుళ్లు, కడుపులో పురుగులు, చెవినొప్పి, కంటినొప్పి, దంత సంబంధ వ్యాధులను అదుపు చేసే గుణం ఉందని శాస్త్రవేత్తలు నిరూపించారు.

పిందె నుండి పండు వరకూ మామిడి రుచే వేరు. ఆ పండ్లను చిన్నా పెద్దా అంతా ఆస్వాదిస్తారు. అయితే వీటిని వెరైటీగా కూడా తినవచ్చును. మామిడి తాండ్ర, మామిడి పాల్దా, మామిడి ఊరగాయ, రకరకాల పచ్చళ్లుగా తయారు చేసుకోవచ్చును. మాంగోజ్యూస్ రుచి సరేసరి.

గుజరాత్‌లోని అమ్రేలీ జిల్లాకు చెందిన ఓ రైతు, ఒకే మామిడి చెట్టుకు 14 రకాల మామిడి పండ్లను పండిస్తున్నాడు. దిటాలా గ్రామానికి చెందిన ఉ కాబాయ్ బట్టీ ఇంటి పెరదులో ఓ దేశీయ మామిడి చెట్టు ఉన్నది. దానికి పలురకాల మామిడి పండ్లను పండించాలనుకున్నాడు.

సంగారెడ్డి జిల్లాలోని కొండా లక్ష్మణ బాపూజీ ఉద్యాన విశ్వవిద్యాలయం ఫల పరిశోధన స్థానంలో మేంగోమేళా నిర్వహించారు. ఇందులో సుమారు 300 రకాల మామిడి పండ్లను ప్రదర్శించారు.

వేసవికాలం వచ్చిందంటే చాలు మార్కెట్ మొత్తం మామిడి పండ్ల సువాసనతో నిండిపోతుంది. చిన్నారుల నుండి పెద్దల వరకు అందరికీ ఇష్టమైనది మామిడి పండును "పండ్లరాజు" అని పిలుస్తారు. తియ్యటి రుచి, రసంతో నిండిన మామిడి కేవలం రుచికేకాదు, ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలందిస్తుంది. ముఖ్యంగా వేసవిలో శరీరానికి కావల్సిన అనేక రకాల పోషకాలను ఈ ఒక్క పండు అంది స్తుంది. మామిడిలో ఉండే విటమిన్లు, ఖనిజాలు, యాంటీ ఆక్సిడెంట్లు శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో కీలకపాత్ర పోషిస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు.

మామిడి పండులో విటమిన్ 'ఎ', విటమిన్ 'సి', ఫైబర్, పొటాషియం, మెగ్నీషియం వంటి పోషకాలు సంవృద్ధిగా వుండి, ఇతర శరీర రోగ నిరోధక శక్తిని పెంచడమే కాకుండా జీర్ణవ్యవస్థను మెరుగు పరుస్తాయి. ముఖ్యంగా విటమిన్ –సి శరీరానికి రక్షణ కవచంలా పనిచేస్తుంది. జలుబు, దగ్గు వైరల్ ఇన్ఫెక్షన్ వచ్చేవారికి మామిడి ఎంతో మేలు చేస్తుంది.

ఒకరోజు బహదూర్‌షా జాఫర్‌తో కలిసి మీర్జాగాలిబ్ మామిడితోటకు షికారు కెళ్లారు. అది విరగకాసి ఉంది. మీర్జా గాలిబ్ ప్రతీ పండును కళ్లు చికిలించి చూస్తున్నాడు 'ఏమిటయ్యా మీర్జా అలా చూస్తున్నావు?' అని జాఫర్ అడిగాడట. 'జహపనా! ప్రతి పండు మీద తినేవాడి పేరు ఉంటుందని అంటారు. నా పేరు రాసిన పండ్లు ఏవైనా ఉన్నా యేమో అని వెతుకుతున్నా' అన్నాడు జాఫర్ నవ్వి ఆ సాయంత్రం బుట్టలతో మీర్జా ఇంటికి పండ్లు పంపాడు.

బాబర్ ఇండియా మీదికి దండెత్తి వచ్చాక 'నేను నా నేలను తిన్న తియ్యని ద్రాక్ష ఏదీ, ఆ మధుర కర్బూజా ఫలమెక్కడ? అని అడిగాడట, అవి ఇక్కడ దొర కవు కాబట్టి మామిడి పండు కోసిపెట్టారట. 'సరైన మామిడి పండు దొరకాలే కాని దాని అబ్బలాంటి కాయ మరేదీ లేదని' బాబార్ నామాలో రాసుకున్నాడు. నూర్జహాన్ పేరున ఓ మామిడి నమోదైంది. అక్బర్ మామిడికి దాసుడు బిహార్‌లో దర్భంగా దగ్గర లక్షమామిడి చెట్లతో తోట వేయించాడు. దాని పేరు 'లఖీబాగ్'. మొగలుల దగ్గర పని జరగాలంటే మామిడి పండ్ల బుట్ట ఇస్తే సరి. అమీర్ ఖుస్రో మామిడికి ఫఖర్–ఏ–గుల్షన్ తోటలకు గర్వకారణం అని కీర్తించాడు. కర్నూల్ జిల్లా బనగాని పల్లెలో నవాబులు తమ మామిడి తోటలన్నీ శోధించి శ్రేష్ఠమైనా 'బేనిషాన్' వెరైటీని వృద్ధిచేసి రైతులకు మొక్కలు పంచాడు. నేడు మనం తినే బంగినిపల్లె అదే.

మామిడి భారత్‌దే. దీనికి ఆరువేల ఏళ్ల చరిత్ర ఉంది. ఈశాన్య భారతంలో పుట్టి బౌద్ధ సన్యాసుల వల్ల, పర్షియన్ (ఇరాన్) వర్తకుల వల్ల, పోర్చుగీసు వారివల్ల ప్రపంచానికి పాకింది. వేదాల్లో "ఆమ్ర" అని ప్రస్తావన వుంది. భూమిని చుట్ట దానికి బదులు తన చుట్టూ తిరిగిన వినాయకునికి మామిడి పండును బహుమతిగా ఇచ్చాడట శివుడు, అంటే అది జ్ఞానఫలం. బుద్దునికి ఆమ్రపాలి తన మామిడి

# చక్రవర్తులను

తోటను దానం చేయడం విదితమే. జైన మహావీరుడు 30 ఏళ్ల వయస్సులో ఇల్లు వదిలి "జ్ఞాన ఖండవనం" అనే మామిడి తోటలో దీక్ష తీసుకున్నాడు. రాయలవారి తల్లికి బంగారు మామిడి పండ్లు దానం చేయాలని ఉండేదట అది తీరక పోయేసరికి 'ప్రాయశ్చిత్తంగా బంగారు మామిడి పండ్లు ఇస్తేనే స్వర్గ ప్రాప్తి' అని హరాయించిన వారికి తెనాలి రామలింగడు కాల్చిన ఇనుప కడ్డీతో వాతలు వేశాడని జనశ్రుతి. రాయల వారే స్వయంగా తోటలు పెంచారు. ఆముక్తమాల్యదలో మామిడి చివురు ప్రస్తావన ఉంది.

హంపీలోని సుప్రసిద్ధ విరూపాక్ష దేవాలయం వెనుక శ్రీకృష్ణదేవరాయల కాలంనాటి పురాతనమైన మామిడి తోటలున్నాయి. వీటిని ప్రత్యేకంగా కోతుల బెడదను అరికట్టడానికి అప్పట్లో 'కోతిమాన్య'గా పిలిచిన ఈ తోట నేటికీ ఉంది. 20కి పైగా భారీ మామిడి చెట్లు నేటికీ ఉన్నాయి.

ఉర్దూ కవి గాలిబ్‌కు మామిడి పళ్లంటే చాలా ఇష్టం. తన మిత్రునికి మామిడి పళ్లంటే నచ్చేది కాదు. ఒకరోజు ఇద్దరూ కలిసి నడుస్తుంటే ఓ గాడిద మామిడి వాసన చూసి వదిలేసిందట. వెంటనే గాలిబ్ మిత్రుడు అన్నాడట. గాలిబ్ గాడిదలు పండ్లు తినడం లేదు అని. అందుకు గాలిబ్ అన్నాడట, గాడిదలే మామిడి పళ్లు తినవని, తెలుగు సాహిత్యంలో

# మురిపించిన మామిడిపండు



మామిడిచెట్టు సారవంతానికి మాధుర్యానికి, ప్రకృతి సౌందర్యానికి ప్రగాఢమైన ప్రతీక. యవ్వనంలో పచ్చికాయ పులుపు నుండి వృద్ధాప్యంలో పండిన పండు తీపి జ్ఞానానికి ప్రతీక. ఇది తరచుగా జీవిత దశలకు ప్రతీకగా కన్పిస్తుంది.

మామిడిచెట్టు మీద తెలుగు సినిమాలో ఎన్నో పాటలు వచ్చాయి. గున్నమామిడి కొమ్మమీద గూళ్లు రెండున్నాయి. ఒక గూటిలో రామచిలకుంది, ఒక గూటిలో కోయలుంది అని ఆత్రేయ రాయగా 'మావి చిగురు తినగానే – కోయిల పలికేనా, కోయల గొంతు వినగానే మావి చిగురు తొడిగేనా' ఏది ముందు జరిగిందాని దేవులపల్లి వారు ప్రశ్నించారు. మామిడి కొమ్మ మళ్లీ మళ్లీ పూయునులే. మాటలు రాని కోయలమ్మ పాడును లే... అంటూ ఆశలు రేకెత్తించారు దాశరథి. మావిచిగురు తిని మీకు శుభమని మేలు కొలిపేను గండు కోయల అని సిరివెన్నెల సీతారామశాస్త్రి పలికారు. ఇలా ఎంతో సాహిత్యం ఉంది.

సంస్కృతంలో ఆమ్రము, చూతము, రసాలము, సహకారము, హిందీ, ఉర్దూలో ఆమ్ తమిళ, కర్ణాటక భాషల్లో మాంగాయి, యనియు, మావికాయ, మాగాయ. ఫ్రెంచ్, పోర్చుగీసు, ఇంగ్లీషువారు దక్షిణంలోని రేవులలో నిలిచిపోయినప్పుడు మన మాగాయే పోర్చుగీసు వారు మాంగే అని, ఇంగ్లీషు వారు మాంగో అని పిలిచారు. మామిడి యూరోప్ దేశాలలో పెరగదు. ఇరాన్, అరేబియా, ఈజిప్టులలో ఈ వృక్షం పెరగదు.

మనదేశంలో వేయికి పైగా మామిడి వెరైటీలున్నాయి. అల్ఫోన్సో, తోతాపూరి, బేనిషాన్, దశహరి, కేసర్, హిమాం పసంద్, రసాలు, చెరుకురసం, పంచదారకల్తీ, నూజివీడు రసాలు, ఇలా ఎన్నో రకాలు దేని రుచి దానిదే

భారత్ నుండి సుదూర ప్రాంతమైన అమెరికాకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా మామిడిపండ్లను చేర్చటంలో సియాటిల్‌లోని భారత కాన్సులేట్ జనరల్ ప్రకాశ్ గుప్తా అత్యంత కీలక పాత్రను పోషించారు. ఈ మొత్తం సరఫరా ప్రక్రియను మాంగో డిప్లమసీ మామిడిదౌత్యంగా పేర్కొన్నారు.

నంద్యాల జిల్లాకు చెందిన మాజీమంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి తన పొలంలో జపాన్ శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన ఖరీదైన మిరాయా జాకీ మామిడి రకంతో పాటు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 20 రకాల మామిడి మొక్కలను సాగు చేస్తున్నారు. తన పొలాన్ని ఒక ప్రయోగ క్షేత్రంగా మార్చి, విభిన్న రకాల మామిడిసాగు చేస్తున్నారు. మియాజాకీ మామిడి పండ్లను బాంగ్లాదేశ్‌లో కిలో లక్ష రూపాయల వరకూ పలికింది. ఆయన "రెడ్ ఐవరీ" రకం మామిడిని పండించారు. మామిడికాయ కేజీన్నర బరువుంటుంది. దాని టెంకమాత్రం 30 గ్రాములే ఉంటుంది. అట్కిన్స్ రకం మామిడి డయాబెటిక్ పేషంట్ల కోసం పండిస్తున్నారు. ఎక్కువ తియ్యగా వుండే "హనీడ్యూ" రకాన్ని కూడా పండిస్తున్నారు. అమెరికన్ పాలిమర్, సెన్సేషన్ రకాలను కూడా ఆయన పండిస్తున్నారు.

హైదరాబాదులో నవాబ్ ముఖరబ్‌జంగ్, అజమలీఖాన్ అనే వారు మామిడి తోటలను అభివృద్ధి చేశారు. వారిలో అజమలీ ఖాన్ కనిపెట్టిన అజమస్సర్ జాతిపండు ప్రసిద్ధి కెక్కింది. అజమలీ తోట పండ్లను విక్టోరియా రాణికి, 7వ ఎడ్వర్డు రాజుకు, ఆఫ్గన్ అమీరైన అబ్దుల్ రెహమాన్‌కు పంపారట.

మంచిజాతి మామిడిపండ్లకు నాటి పాలకుల పేరిడిరి. "సూరెబెహిష్త్" అని పార్శీ వారన్నారు అంటే స్వర్గంలోని ఫలమని అర్థం. తైమూరీ అనే ఫలం తైమూర్ లంగడా పేరున వచ్చినది, జహంగీర్, నూర్జహాన్, ఇలా అనేక జాతుల మామిడి పండ్లకు వారి పేరు పెట్టారు.

పూర్వం ఒక పర్షా సర్దారు హిందూస్థాన్‌కు వచ్చి మామిడి పండ్లను రుచి చూసి తన దేశానికి. ఇరాన్ పాదుషా ఏమి విశేషాలు అని అడుగగా మామిడి రుచిని వర్ణించాడు కాని, అర్థం కాలేదు వెంటనే తేనె తెప్పించి ఒకరి పెద్దగెడ్డమునకు పూసి దానిని నాకిన కొంత కొంత మామిడి రుచి యర్థమగునని తెలిపెనట.

ఈజిప్టులో మామిడిని "అమ్మన్‌రా" అని పిలుస్తారు. ఈజిప్టులో ఇద్దరు దేవుళ్లకు తగాదా రాగా అమ్మన్‌రా వారి తగాదా తీర్చాడట, వారు హిందూస్తాన్‌కు వచ్చి మామిడి పండుకొని రా దేవునకు బహుమానంగా ఇచ్చారట, నాటి నుండి ఆ పండును అమ్మన్‌రా అని పిలుస్తున్నారట.

మామిడి పండ్లలో చిన్న నిమ్మకాయ సైజు నుంచి చిన్న గుమ్మడికాయ సైజు వరకూ ఉంటాయి. ఇవి రెండు రకాలు పీచు రసం కలిగినవి, కండ కలిగినవి. రంగుల విషయానికొస్తే ఎర్రనివి, ఆకు పచ్చనివి, పసుపు వన్నె కలవు. శ్రీ కరణి అను పేర మామిడి పండు రసముతో కలిపి సిద్ధము చేయు దానిని శ్రీ కరిణి యందురు. రసాల దద్ధం అని రత్నావళి అనే సంస్కృత నాటకంలో వర్ణించినారు.

"మామిడి కాయల పండుగ" గురించి చాలామందికి తెలియదు. మామిడి సీజన్ ప్రారంభం కాగానే జరుపుకునేది ఈ పండుగ అరకు, పాడేరు, చింతపల్లి, రంప చోడవరం, సీతంపేట బుట్టాయగూడెం, పోలవరం వంటి ఏజెన్సీ ప్రాంతాల్లో కొండరెడ్లు, భగత, కొండదొర, వాల్మీకి, మాలి, సవర తదితర తెగలవారు మొదటిపండును దుర్గమ్మకు పెడతారు, తరువాతే వారు తింటారు.

ప్రపంచ మామిడి ఉత్పత్తిలో భారత్ సుమారు 45 శాతం వాటాతో అగ్రస్థానంలో వున్నది. అనేకాని 5 శాతం మించి ఎగుమతి చేయలేకపోతున్నాం. మనకన్నా మెక్సికో, థాయ్‌లాండ్, పెరూ, బ్రెజిల్ వంటి దేశాలే ప్రపంచ మార్కెట్‌లో మెరుగ్గా నిలుస్తున్నాయి. ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధం పుణ్యమాని పశ్చిమాసియా మార్కెట్లో గిరాకీ లేక వ్యాపారాలు దెబ్బతిన్నాయి.



డా. కాశింశెట్టి సత్యనారాయణ
విశ్రాంత ఆచార్యుడు



# డ్రగ్స్ మాఫియాపై

**ఉగ్రవాదాన్ని, మావోయిస్ట్ తీవ్రవాదాన్ని అణచివేసే విషయంలో హోం మంత్రి అమిత్‌షా శపథం చేశారు. దానిని నెరవేర్చి చూపించారు. ఇప్పుడు ఇదే పంథాలో మాదక ద్రవ్యాల మాఫియాను భూస్థాపితం చేస్తామని, 2029 డిసెంబర్ 31 నాటికి దేశంలో మాదక ద్రవ్యాలు కనిపించకుండా చేస్తామని శపథం చేశారు. దేశాన్ని ఆయన మాదకద్రవ్యాల బారి నుంచి విముక్తం చేస్తారనడంలో సందేహంలేదు కానీ, ఇందుకు ఆయన భీకర పోరాటాన్నే జరపాల్సి ఉంటుంది. దేశాన్ని మాదక పదార్థాల వ్యాపారం నుంచి, డ్రగ్స్ మాఫియా నుంచి విముక్తం చేయడానికి ఆయన ఇప్పటికే తీవ్రస్థాయిలో పోరాటం సాగిస్తున్నారు. అది మరింత ఊపందుకోబోతోంది. ఆయన పట్టు వదలని విక్రమార్కుడు.**

**భా**రతదేశంలోకి ఒక్క గ్రాము మత్తుపదార్థం కూడా ప్రవేశించడానికి వీల్లేదు. ఒక్క గ్రాము కూడా దేశం నుంచి బయటకు వెళ్లడానికి అవకాశం ఇచ్చేది లేదు. ఇదీ ప్రస్తుతం ఆయన నినాదం, ఆయన విధానం. ఢిల్లీలో గత సెప్టెంబర్ 22వ తేదీన జరిగిన మూడవ నేషనల్ యాంటీ నార్కోటిక్స్ టాస్క్ ఫోర్స్ కాన్ఫరెన్స్‌కు ఆయన అధ్యక్షత వహిస్తూ ఈ మేరకు ఒక ప్రకటన చేశారు. ఆయన 2026–29 సంవత్సరాలకు సంబంధించి ఒక వ్యూహాత్మక ప్రణాళికకు రూపకల్పన చేశారు.

**పటిష్ఠమైన వ్యూహం**

ఈ ప్రణాళికకు నాలుగు పార్శ్వాలున్నాయి. మొదటిదాని ప్రకారం, ఇంటెలిజెన్స్ వర్గాలను పెంచి, దాదులు నిర్వహింస్తారు. కేవలం దాడులు, స్వాధీనాలతో సరిపెట్టుకోకుండా వాటి మూలాల్లోకి కూడా వెళతారు. రెండవ వ్యూహం ప్రకారం, మాదకద్రవ్యాల సరఫరా ఆద్యంతాలను కనిపెడతారు. ప్రయోగశాలల పేరుతో మాదక ద్రవ్యాల వినియోగానికి అవకాశాలు కల్పిస్తున్న సంస్థల మీద నిఘా పెట్టడం, కృత్రిమ మత్తు పదార్థాల అంతు తేలుస్తారు.

ఇక మూడవ వ్యూహం ప్రకారం, దేశంలో ఇప్పటికే పనిచేస్తున్న వ్యసన నిర్మూలన కేంద్రాల సంఖ్యను 1700 నుంచి మరింతగా పెంచడం, గ్రామీణ ప్రాంతాల్లో ఈ మత్తు పదార్థాల వినియోగాన్ని నివారించడానికి ప్రత్యేక కేంద్రాలను ఏర్పాటుచేస్తారు. నాలుగవ వ్యూహం ప్రకారం వివిధ విభాగాల మధ్య సమన్వయం, సహకారం ఏర్పాటు ప్రారంభం అవుతుంది. సి.బి.ఐ, ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, పోలీస్, భద్రతా దళాలు, ఇంటెలిజెన్స్ తదితర సంస్థలు కలిసి పని చేస్తాయి. ముఖ్యంగా సరిహద్దు ప్రాంతాల్లో ఇటువంటి వ్యవస్థలను మరింత పటిష్ఠం చేయడం మొదలవుతుంది. ఇతర దేశాల నుంచి వలస వచ్చే వారి మీద నిఘా పెంచనున్నారు.

దేశంలో ఇప్పటికే వందకు పైగా అంతర్జాతీయ సంస్థలు, అంతర్రాష్ట్ర సంస్థలు మాదక ద్రవ్యాల రవాణా, సరఫరా, వినియోగాల్లో చురుకుగా, క్రియాశీలంగా పనిచేస్తున్నట్టు కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే గుర్తించింది. ఇతర దేశాల నుంచి బతుకుతెరువు కోసం వలస వచ్చి భారతదేశంలో డ్రగ్ మాఫియాగా అవతరించిన మరో వందకు పైగా ముఠాలను దేశం నుంచి బహిష్కరించడం లేదా భూస్థాపితం చేయడం ప్రారంభం అవుతోంది. దేశంలోని విద్యా సంస్థల్లో మాదక ద్రవ్యాల వినియోగానికి అవకాశం లేకుండా చేయడానికి, విద్యార్థులు, ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్, సహాయం చేయడానికి లక్షకు పైగా నషాముక్త్ మిత్రాస్ పేరుతో స్వచ్ఛంద సేవక దళాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం సంకల్పించింది.

**ముమ్మరంగా దాడులు**

మత్తు పదార్థాల రవాణా వ్యవస్థలను నిర్వీర్యం చేయడం, ప్రత్యేక వేగుల వ్యవస్థలను ఏర్పాటు చేయడం ద్వారా వీటి ఆర్థిక మూలాలను కనిపెట్టడం, వీటికి ఉన్న డిజిటల్ లింకులను గుర్తించడం, డ్రగ్ మాఫియాల ఆర్థిక లాభాలు ఎక్కడికి, ఏవిధంగా చేరుతున్నదీ తెలుసుకోవడం వంటివి ప్రారంభం కాబోతున్నాయి. ‘డ్రగ్స్‌రహిత భారతదేశాన్ని సృష్టించడమనే కష్టసాధ్యమైన లక్ష్యాన్ని చేరుకోవడానికి మేం గత అయిదేళ్లుగా ఒకదాని తర్వాత ఒకటిగా చర్యలు తీసుకుంటూనే ఉన్నాం. ఇక ఈ మాఫియాలను తుదముట్టించడానికి దృఢ సంకల్పంతో పనిచేయాల్సిన సమయం ఆసన్నమైంది. దేశానికే కాక, ప్రపంచానికంతటికీ మాదక ద్రవ్యాల వినియోగం ఒక పెనుముప్పుగా మారింది. సమష్టి కృషి ద్వారా మేం తప్పకుండా వీటిని మట్టుబెడతాం. మేం 2029 డిసెంబర్ 31నాటికి దేశంలో దీన్ని పూర్తిగా నిర్మూలించగలమనే నమ్మకంతో ఉన్నాం’ అని అమిత్ షా ఈ సమావేశంలో స్పష్టం చేశారు.

దేశాన్ని 2047 నాటికి వికసితభారత్‌గా తీర్చిదిద్దాలన్న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ లక్ష్యానికి తగ్గట్టుగా యువత సంక్షేమానికి, అభివృద్ధికి ఇప్పటి నుంచి కృషి ప్రారంభించాలని కేంద్రం భావిస్తోంది. మత్తు పదార్థాలను నిర్మూలించడమంటే యువత ఆరోగ్యవంతంగా చేయడమేనని కేంద్రం అభిప్రాయ పడుతోంది. మాదకద్రవ్యాల వ్యాపారాన్ని పూర్తిగా నిర్మూలించడానికి మరో మూడేళ్ల కాలం అవసరమని అమిత్ షా కూడా అన్నారు. భారతదేశంలోనే కాక, ప్రపంచంలోనే ఈ మాదకద్రవ్యాల వ్యాపారం లేకుండా చేయాలన్నది తమ అంతిమ లక్ష్యమని, ఉగ్రవాదం మీద సమష్టిగా పోరాటం మాదిరిగానే ఈ డ్రగ్స్ మీద కూడా పోరాటం జరపాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు. దేశంలో ఇక నుంచి ఈ పోరాటానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తామని కూడా తెలిపారు.



**జి.రాజశుక**
సీనియర్ జర్నలిస్ట్



ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని, గడువును, జవాబుదారీతనాన్ని నిర్దేశించుకుంది.. 'ఇక మనం కార్యశూరులం కావాలి. ఫలితాలను సాధించాలి. ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను బద్దలు కొట్టాలి. డ్రగ్స్ వ్యాపారాలకు కఠిన శిక్షలు విధించేలా ప్రభుత్వాలు చట్టాలు చేయాలి' అని అమిత్ షా పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నిరోధక కార్యాచరణ దళం (ఏ.ఎన్.టి.ఎఫ్)ను ఇక నుంచి యాంటీ నార్కోటిక్ మిషన్ కమాండ్ పేరుతో వ్యవహరించాలని సూచించారు.

# ఇక సర్జికల్ స్ట్రయిక్!

**తిరుగులేని ప్రణాళిక**

ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం లక్ష్యాన్ని, గడువును, జవాబుదారీతనాన్ని నిర్దేశించుకుంది.. 'ఇక మనం కార్యశూరులం కావాలి. ఫలితాలను సాధించాలి. ఈ డ్రగ్స్ నెట్‌వర్క్‌ను బద్దలు కొట్టాలి. డ్రగ్స్ వ్యాపారాలకు కఠిన శిక్షలు విధించేలా ప్రభుత్వాలు చట్టాలుచేయాలి' అని అమిత్ షా పిలుపునిచ్చారు. మాదక ద్రవ్యాల నిరోధక కార్యాచరణ దళం (ఏ.ఎన్.టి.ఎఫ్)ను ఇక నుంచి యాంటీ నార్కోటిక్ మిషన్ కమాండ్ పేరుతో వ్యవహరించాలని సూచించారు. మత్తు పదార్థాలను స్వాధీనం చేసుకోవడానికి పరిమితం కాకూడదని, ఈ నెట్‌వర్క్‌ను కూకటివేళ్లతో పెకలించడమే లక్ష్యంగా పెట్టుకోవాలని ఆయన ఆదేశించారు. డ్రగ్స్ ను నిర్మూలించ డానికి జిల్లాలను కేంద్రంగా చేసుకుని పని చేయాలని ఆయన అన్నారు.

వాస్తవానికి దేశంలో ఈ డ్రగ్స్ వ్యాపారం గ్రామాలకు సైతం విస్తరించింది. ఈ మాదక ద్రవ్యాలకు బానిసలవుతున్న వారి సంఖ్య రాను రానూ పెరుగుతోందే తప్ప తగ్గడంలేదు. దీనికి బానిసలవుతున్న యువతీ యువకుల సంఖ్య పెరుగుతున్న ప్రమాదాన్ని పసికట్టిన కేంద్ర ప్రభుత్వం ఇక దీనిపై ఉక్కుపాదాన్ని మోపదల చుకుంది. మాదక ద్రవ్యాల నిరోధక అధికారులు 2014 నుంచి 2016 వరకు సుమారు 1.18 కిలోగ్రాముల డ్రగ్స్‌ను దేశంలో పట్టుకున్నారు. వీటి విలువ 1.84 లక్షల కోట్ల రూపాయలకు పైగా ఉంటుందని అంచనా. నార్కోటిక్స్ అధికారులు మొత్తం వ్యాపారంలో 10 శాతాన్ని మించి పట్టుకోలేక పోతున్నారని, ఏటా కనీసం పదివేల కోట్ల రూపాయలకు పైగా దేశంలో డ్రగ్స్ వ్యాపారం జరుగుతోందని నార్కోటిక్స్ విభాగం ఇటీవల వివరించింది.

**అంతర్జాతీయ నిఘా**

కాగా, కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేయ తలపెట్టిన నషాముక్త్ మిత్రాల సభ్యులు దేశంలోని సుమారు పది లక్షల పాఠశాలలను, కాలేజీలను తరచూ సందర్శిస్తూ, విద్యార్థినీ విద్యార్థులకు, ఉపాధ్యాయులకు కౌన్సిలింగ్‌తోపాటు, మత్తుపదార్థాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నారు. ఈ పదార్థాలు ఎక్కడి నుంచి ప్రవేశిస్తున్నాయి, ఎక్కడికి, ఎవరి ద్వారా వెదుతున్నాయి, ఎంత డబ్బును వసూలు చేస్తున్నాయి, చివరికి ఎవరి దగ్గరికి చేరుతున్నాయి వంటి విషయాలను పరిశోధించడానికి జిల్లా స్థాయిలో ప్రత్యేక నిఘా బృందాలను ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో విదేశీ నిందితులు పట్టుబడే పక్షంలో వారిని స్వదేశాలకు తరలించి, వారు తిరిగి దేశంలోకి ప్రవేశించకుండా బహిష్కరించడం జరుగుతుంది.

ఇక విదేశాల్లో డ్రగ్స్ వ్యాపారాలు చేస్తూ అక్రమమార్గాల ద్వారా భారత దేశంలోకి వాటిని తరలిస్తున్న వారిని కూడా గుర్తించి వారిపై దేశంలో కేసులు నమోదు చేస్తారు. స్థానిక పోలీసులతో సమన్వయంగా పనిచేసి నార్కోటిక్ అధికారులు ఈ వ్యాపారంపై అహర్నిశలు నిఘా పెట్టడం ప్రారంభం అవుతుంది. కేంద్ర ప్రభుత్వం ఈ మాదక ద్రవ్యాల వినియోగంపై చిన్న చిన్న కార్యక్రమాలు రూపొందించి సోషల్ మీడియాలో ప్రదర్శించడంతో పాటు, ప్రత్యేకంగా ఒక నార్కోటిక్ కంట్రోల్ బ్యూరోను ఏర్పాటు చేసి, ఒక వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభిం చబోతోంది. ఈ వ్యవస్థ దాదాపు ఒక జాతీయభద్రతా దళం స్థాయిలో పని చేస్తుంది. ★

**వివేకానంద సూక్తిశతి**

My boy, when death is inevitable, is it not better / to die like heroes than as stocks and stones?
It is better to wear out than to rust out / -specially for the sake of doing / the least good to others.



పుడమి రాయివోలె పడియుండ ఫలమేమి?
ధరణి వీరుడవుగ మరణమొందు
పరుల సేవలోన కరిగిపోవుట మేలు
వినుడి స్వామి సద్వివేకవాణి!!



బండిరాజుల శంకర్
ఆలేరు,
9948050608

# జాతీయవాదానికి జై కొ

**"యువతలో అపారమైన శక్తిసామర్థ్యాలు దాగుంటాయి. వాటికి ధర్మం, వివేకం తోడైతే ఆ శక్తి దేశానికి రక్షణ కవచంగా మారుతుంది. స్వార్థపరుల చేతిలో కీలుబొమ్మగా మారితే వినాశనానికి దారితీస్తుంది" అని చాణుక్యుడు రాజనీతిలో చెప్పిన వ్యాఖ్యలను ప్రస్తుత కాలమానంలో మన దేశానికి సరిగ్గా అన్వయించుకోవచ్చు. జెన్ జీ పేరుతో కొన్ని అరాచక శక్తులు దేశంలో అల్లకల్లోలం సృష్టించాలని ఎన్ని కుట్రలు పన్నినా దేశ యువత మాత్రం వివేకంతో ధర్మానికి కట్టుబడుతూ జాతీయవాదానికే పెద్ద పీట వేయడం విశేషం. గత జులైలో ఢిల్లీ జంతర్‌మంతర్ వేదికగా కాక్రోచ్ జనతాపార్టీ చేపట్టిన నిరసనలను కాంగ్రెస్, ఆప్, వామపక్షాలు వంటి తమ రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడానికి యత్నించాయి. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వంపై యువత ఆగ్రహంగా ఉందని జాతీయవాద వ్యతిరేకశక్తులు పెద్ద ఎత్తున ప్రచారం చేశాయి. అయితే ఈ దుష్ప్రచారాన్ని పటాపంచలు చేస్తూ ప్రముఖ విశ్వవిద్యాలయాల్లో జాతీయవాద విద్యార్థి సంఘం అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) భారీ విజయం సాధించింది. ఏబీవీపీ విజయంతో జెన్ జీ దేశ వ్యతిరేక శక్తుల కుట్రలో చిక్కుకోకుండా తమ దేశభక్తిని చాటుకున్నట్టు నిరూపితమైంది.**

'నీట్' ప్రవేశ పరీక్షా పేపర్‌లీక్ అంశాన్ని సాకుగా తీసుకొని విదేశాల నుండి వచ్చిన కొందరు జాతీయవాద వ్యతిరేకశక్తుల చేతిలో కీలుబొమ్మగా మారి రెచ్చగొట్టే కార్యకలాపాలకు పాల్పడినా వారికి యువత మద్దతులేదని ఏబీవీపీ విజయంతో తేటతెల్లమైంది. ఢిల్లీ, పంజాబ్ విశ్వవిద్యాలయాల్లో, కేరళ సంస్కృత కళాశాలలో ఏబీవీపీ ఘన విజయంలో ప్రత్యేకత ఉంది. ఢిల్లీ యూనివర్సిటీలో దీర్ఘకాలికంగా కాంగ్రెస్ విద్యార్థి అనుబంధ సంఘమైన ఎన్‌ఎస్‌యూఐ, వామపక్ష విద్యార్థిసంఘాలదే ఆధిపత్యం సాగుతున్నప్పటికీ అక్కడ ఏబీవీపీ గెలిచింది. పంజాబ్‌లో ఆప్, కాంగ్రెస్ పార్టీలదే ఆధిపత్యం ఉన్నప్పటికీ ఎవరూ ఊహించని విధంగా అక్కడ యూనివర్సిటీలో ఏబీవీపీ విజయం చారిత్రాత్మకం. దక్షిణాదిన కేరళ సంస్కృత కళాశాలలో ఏబీవీపీ ఏకగ్రీవంగా విజయఢంకా మోగించింది.

ఢిల్లీ జంతర్‌మంతర్ వేదికగా కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన నిరసనల తీరుతెన్నులు పరిశీలిస్తే అది ఉద్దేశపూర్వక ఉద్యమమని రూఢి అవుతుంది. జెన్‌జీ పేరుతో సీజేపీ నిరసనలన్నీ జాతీయవాదం, సనాతన ధర్మానికి వ్యతిరేకంగా చేపట్టినవే. 'చలో సంసద్' పేరుతో హిందూ దేవుళ్లను, హిందూ పురాణాలను దూషిస్తూ, ప్రధానమంత్రి మోదీని, ఆయన కుటుంబాన్ని వ్యక్తిగతంగా దుర్భాషలాడుతూ దిగజారుడు కార్యక్రమాలు చేపట్టారు. అంతేకాక రాజస్థాన్ లో 'స్కూల్ రీక్ కరో' పేరుతో చేపట్టిన వారి కుట్రలను పసిగట్టిన స్థానికులు తమ గ్రామాలకు రావద్దని కాక్రోచ్ కార్యకర్తలను తరిమికొట్టిన ఘటనలు వెలుగు చూశాయి. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో కూడా ఇదే తరహా కార్యక్రమాలకు పిలుపిచ్చారు. ఇక్కడే సీజేపీ కుట్రలు కూడా బట్టబయలయ్యాయి. జంతర్‌మంతర్ వేదికగా ఉద్రిక్తతలు సృష్టించిన సీజేపీ అదే సమయంలో



ఛత్తీస్‌గఢ్, పంజాబ్ రాష్ట్రాల్లో పేపర్ లీకులపై అక్కడి యువత ఉద్యమిస్తున్నా కొన్ని శక్తుల చేతిలో అస్త్రంగా మారిన కాక్రోచ్‌లు ఆ రాష్ట్రాలపై కన్నెత్తి చూడలేదు.

సీజేపీ 'చలో సంసద్' కార్యక్రమం వెనుక విదేశీ శక్తులే కాకుండా వారికి దేశంలోని కొందరు కుట్రదారులు కూడా సహకరించారు. దేశంలోని వామపక్ష భావజాల రాజకీయపార్టీలు, విద్యార్థి సంఘాలు, ఎన్జీఓలు, ప్రజాసంఘాలు జంతర్ మంతర్ వేదికను స్వలాభంకోసం వినియో గించుకున్నాయి. ఇక స్వాతంత్ర్యం తెచ్చిన పార్టీగా బాజా కొట్టుకునే కాంగ్రెస్ జాతీయవాదానికి, సనాతన ధర్మానికి వ్యతిరేకంగా నిత్యం ముందు వరుసలోనే ఉంటుంది. బాధ్యతా రహితంగా ప్రధాని ఇంటి ముందు నిరసన తెలిపి కాక్రోచ్ ఉద్యమాన్ని హైజాక్ చేయాలని కాంగ్రెస్‌పార్టీ యత్నించింది. మరోవైపు కాంగ్రెస్ అధినేత రాహుల్‌గాంధీ 'ఛాత్రోంకీ గూంజ్' పేరిట పర్యటనలలో అసందర్భంగా వ్యవహరిస్తు న్నారు. విద్యార్థులకు మద్దతుగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు ప్రకటించుకుంటూ సనాతన ధర్మాన్ని, మనుస్మృతిని లక్ష్యంగా చేసుకుంటున్నారు.

జాతీయవాదానికి వ్యతిరేకంగా ఇంటా బయట కుట్రలు పన్నుతున్న శక్తులకు ఢిల్లీ, పంజాబ్, కేరళ విద్యా సంస్థల్లో ఏబీవీపీ గెలుపు గట్టి ఎదురుదెబ్బ. జెన్ జీ సంస్కరణలకు నాంది పలుకుతూ జాతీయ వాదాన్ని వ్యతిరేకిస్తుందని విషప్రచారం జరుగుతున్న వేళ ఏబీవీపీ గెలుపు దేశ రాజకీయాల్లోనే గొప్ప మలుపు. ఏబీవీపీ గెలుపుతో దేశ వ్యతిరేకశక్తుల కుట్రదారుల చేతిలో భాగస్వాములైన సీజేపీ ఉద్యమాలకు, 'ఛాత్రోంకీ గూంజ్' కాంగ్రెస్ కార్య క్రమాలకు ముఖ్యంగా యువతలో ఆదరణ లేదని నిరూపితమైంది.

విద్యార్థి సంఘాల ఎన్నికలు అంటే ఒకప్పుడు ఫీజులు, హాస్టళ్లు, క్యాంటీన్లు, పరీక్షలు, మౌలిక వసతుల చుట్టూనే సాగేవి. ఇప్పుడు క్యాంపస్ రాజకీయాల పరిధి క్రమంగా విస్తరిస్తోంది. విద్యార్థి సమస్యలతో పాటు దేశ అభివృద్ధి, జాతీయ ఐక్యత, భద్రత, సాంకేతిక పురోగతి, ఉపాధి అవకాశాలు, సామాజిక బాధ్యత వంటి అంశాలు కూడా యువత చర్చల్లోకి వస్తున్నాయి. ఢిల్లీ, పంజాబ్, కేరళ విద్యార్థి సంఘాల ఎన్నికల్లో విద్యార్థి పరిషత్ సాధించిన విజయాలు ఈ మారుతున్న రాజకీయ వాతా వరణంపై మరోసారి చర్చకు తెరతీశాయి. ముఖ్యంగా జెన్ జీగా పిలుస్తున్న కొత్త తరం యువత తమ దేశభక్తిని చాటుకుంది.

ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికల్లో 40.46 శాతం ఓటింగ్ జరగ్గా ఏబీవీపీ నాలుగు కేంద్ర పదవుల్లో మూడింటిని కైవసం చేసుకుంది. యశ్ దబాస్ అధ్యక్షుడిగా, రియా ఛాప్డీ కార్యదర్శిగా, లక్ష్యరాజ్ సింగ్ సంయుక్త కార్యదర్శిగా విజయం సాధించారు. ఉపాధ్యక్ష పదవిని స్వతంత్ర అభ్యర్థి దీపాంశు శోకీన్ గెలుచుకున్నారు. కాంగ్రెస్ అనుబంధ ఎన్‌ఎస్‌యూఐ ఒక్క పదవీ దక్కించుకోలేకపోయింది. ఏబీవీపీ



# ట్టిన జెన్‌జీ

గెలుపునకు అనేక ప్రాధాన్యతలున్నాయి. జంతర్ మంతర్ ఉద్యమం తర్వాత ఉత్తరాది రాష్ట్రాల్లో ప్రధానంగా ఢిల్లీలో యువత జాతీయవాదానికి దూరమవుతుందనే ప్రచారం నేపథ్యంలో ఢిల్లీ విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ విజయంతో అవన్నీ అసత్యాలని నిరూపితం కావడమే కాక దేశంలో కుట్రలతో ప్రారంభమైన సీజేపీని యువత తిరస్కరిస్తుందని స్పష్టమైంది.

పంజాబ్ విశ్వవిద్యాలయంలోనూ ఢిల్లీ తరహా ఫలితాలు కనిపించాయి. 48 సంవత్సరాల యూనివర్సిటీ చరిత్రలో 2025 సెప్టెంబర్‌లో తొలిసారిగా ఇక్కడ గెలిచిన ఏబీవీపీ ఇప్పుడు వరుసగా రెండోసారి అధ్యక్ష పదవిని నిలబెట్టుకుంది. అంకిత్ బిధాన్ యూనివర్సిటీ స్టూడెంట్ కౌన్సిల్ ప్రెసిడెంట్‌గా గెలిచారు. ఎస్ఎస్‌యూఐ సహా ఇతర ప్రధాన విద్యార్థి సంఘాలు కీలక పదవులను సాధించలేకపోయాయి. సీజేపీకి వెనుదన్నుగా ఉన్న ఆప్ పంజాబ్‌లో అధికారంలో ఉండగా అక్కడి ప్రధాన విశ్వవిద్యాలయంలో ఏబీవీపీ గెలుపు కాక్రోచ్ పార్టీకే కాకుండా అధికార ఆప్‌కు కూడా చెంపపెట్టు. జెన్‌జీ పేరుతో ఉద్యమానికి తెరలేపిన కాక్రోచ్ మాతృసంస్థ ఆప్‌కి సొంత రాష్ట్రంలోనే యువత ఆదరణ లేదని ఈ ఫలితాలు నిరూపించాయి.

దక్షిణాదిన వామపక్షాలకు, కాంగ్రెస్‌కు కీలకమైన కేరళలో కూడా ఏబీవీపీ దక్కిన విజయం విశేషమైంది. ఎర్నాకులం జిల్లాలోని ప్రభుత్వ సంస్కృత కళాశాలలో ఏబీవీపీ చారిత్రాత్మకమైన విజయాన్ని నమోదు చేసింది. ఈ కళాశాల దాదాపు నాలుగు దశాబ్దాలుగా వామపక్ష విద్యార్థి సంఘమైన ఎస్ఎఫ్ఐకి కంచుకోట. ఆ ఆధిపత్యానికి తెరదించుతూ ఏబీవీపీ సెప్టెంబర్‌లో జరిగిన చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్, జనరల్ సెక్రటరీ కీలక పదవులను కైవసం చేసుకుంది. కళాశాల విద్యార్థుల్లో ఏబీవీపీకి లభిస్తున్న ఆదరణకు ఓటమి ఖాయమని ముందే గుర్తించిన ఎస్ఎఫ్ఐ, ఎన్ఎస్‌యూఐ సంఘాలు కనీసం అభ్యర్థులను కూడా బరిలోకి దింపక పోవడంతో ఏబీవీపీ ఏకగ్రీవంగా అన్ని స్థానాలను కైవసం చేసుకుంది. కేరళ రాజకీయాల్లో ఇప్పటివరకూ కాంగ్రెస్ లేదా వామపక్ష పార్టీలదే ఆధిపత్యం. ఇక్కడ బీజేపీకి స్థానమే లేదు. అలాంటి చోట కూడా వీరు సృష్టించిన కృత్రిమ జెన్‌జీ ఉద్యమం వైపు ఆకర్షితులవకుండా ఇక్కడ యువత ఏబీవీపీకి పట్టం గట్టడం కేరళ రాజకీయ చరిత్రలో సరికొత్త అధ్యాయం.

ఢిల్లీ, పంజాబ్, కేరళ ఫలితాలను కలిపి చూస్తే.. వేర్వేరు క్యాంపస్‌లలో ఏబీవీపీకి లభించిన మద్దతు జాతీయవాద విద్యార్థి రాజకీయాలపై చర్చకు కొత్త బలం ఇచ్చిందని కచ్చితంగా చెప్పవచ్చు. ఈ గెలుపు ఒక్క రోజులోనే వచ్చింది కాదు. ఏబీవీపీ నిత్యం విద్యార్థులతోనే ఉంటూ వారి అవసరాలకు అనుగుణంగా వ్యవహరిస్తూ యువతలో జాతీయ వాదం, దేశభక్తిని పెంపొందిస్తూ ఆదరణ పొందుతుండడంతో సత్ఫలితాలువచ్చాయి. వారి విజయాన్ని అర్థం చేసుకోవాలంటే ఎన్నికల ఫలితాలను చూస్తే సరిపోదు. విద్యార్థులతో ఏడాది పొడవునా సంస్థకు ఉన్న సంబంధం, చేపడుతున్న కార్యక్రమాలు కూడా మేలు చేశాయి. ఢిల్లీ యూనివర్సిటీ (డీయూ)లో ఏబీవీపీ 'మై డీయూ, మై మానిఫెస్టో' కార్యక్రమం నిర్వహించి విద్యార్థుల నుంచి నేరుగా సూచనలు సేకరించింది. హాస్టళ్లు, భద్రత, విద్యా సమస్యలు, మౌలిక వసతులు, పారదర్శకమైన పరీక్షల నిర్వహణ వంటి అంశాలపై విద్యార్థుల అభిప్రాయాలను తీసుకుని వాటిని మేనిఫెస్టోలో చేర్చే ప్రయత్నం చేసింది. తమ సందేశాన్ని కేవలం 'జాతీయవాదం' అనే విస్తృత సిద్ధాంతానికి పరిమితం చేయకుండా.. విద్యార్థిని గది నుంచి బయట ప్రపంచం వరకు తీసుకెళ్లే ప్రయత్నం చేసింది. జాతీయ సమైక్యత సహా ఏబీవీపీ విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతోంది. 'జాతీయ పునర్నిర్మాణం' లక్ష్యంగా పనిచేస్తోంది.

దేశంలోని వివిధ ప్రాంతాల విద్యార్థుల మధ్య అనుబంధాన్ని పెంచే కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ముఖ్యంగా ఈశాన్య రాష్ట్రాల విద్యార్థులు దేశంలోని ఇతర ప్రాంతాలను సందర్శించడం, స్థానిక కుటుంబాలతో కలిసి జీవించడం ద్వారా సాంస్కృతిక పరస్పర అవగాహన, జాతీయ సమైక్యత పెంచుతుంది.

కాక్రోచ్ పార్టీ వలే ఏబీవీపీ పూర్తిగా సోషల్ మీడియాపై ఆధారపడిన సంఘం కాదు. యువత అవసరాలకు అనుగుణంగా నడుచుకునేది కాబట్టి సరైన సమయంలో సరైన ఫలితాలు సాధించింది. సోషల్ మీడియాలో కనిపించే స్పందన కచ్చితంగా ఓటుగా మారదని ఏబీవీపీ విజయంతో స్పష్టమైంది. మరోవైపు రాహుల్ అడపాదడపా ఏదో ఒక నినాదంతో చేసే హడావిడిని యువత తిరస్కరిస్తోందని యూనివర్సిటీ ఫలితాలతో తేలింది. యువతకు చేరువ అవ్వాలంటూ నినాదం ఇస్తే సరిపోదు. నిరంతర సంస్థాగత పని, ప్రత్యక్ష సమస్యల పరిష్కారం, విశ్వసనీయ నాయకత్వం, స్పష్టమైన సిద్ధాంతం, భవిష్యత్తుపై దృష్టి కూడా అవసరమని ఏబీవీపీ నిరూపించింది. క్యాంపస్ నుంచి దేశ నిర్మాణం వరకు విస్తరించే శక్తి ఏబీవీపీకి ఉంది. వీరి విజయం విద్యార్థి రాజకీయాల్లో జాతీయవాద భావనకు స్థానం ఉందని తేలింది.

కృత్రిమ ఉద్యమాలతో దేశ యువతలో గందరగోళం సృష్టించాలనుకున్న శక్తులకు ఏబీవీపీ విజయం గొడ్డలిపెట్టు. జెన్ జీ పేరుతో దేశం ఎలా ఎదగాలి? విద్యార్థులకు, యువతకు ఏమి కావాలి? జాతీయ ఐక్యత ఎలా? అన్న అంశాలపై భారత యువత భవిష్యత్తు గురించి చర్చ జరుగుతున్న వేళ ఏబీవీపీ విజయంతో జెన్‌జీలో జాతీయవాదానికి పెద్ద పీట లభించిందని చెప్పవచ్చు.

“దేశ భవిష్యత్తు యువత చేతుల్లో ఉంటుంది..” అని స్వామి వివేకానంద చెప్పిన మాటలు ఏబీవీపీ విజయంతో నిజమవుతాయని ఆశలు రేపుతున్నాయి. క్యాంపస్ ఎన్నికల ఫలితాలు కేవలం విద్యార్థి సంఘాల గెలుపోటములే కాదు. దేశ రాజకీయాల్లో వస్తున్న మార్పులకు నాంది. ఢిల్లీ, పంజాబ్, కేరళలో నమోదైన పరిణామాలు యువత రాజకీయ చర్చల్లో మారుతున్న ప్రాధాన్యతలు తెలియజేస్తున్నాయి. జాతీయ ఐక్యత, దేశ అభివృద్ధి, విద్య, ఉపాధి, భద్రత, సాంకేతిక ప్రగతి వంటి అంశాలు యువత చర్చల్లోకి మరింతగా వస్తున్న నేపథ్యంలో క్యాంపస్ రాజకీయాలు కూడా కొత్త దశలోకి అడుగు పెడుతున్నాయి. అందువల్ల ఏబీవీపీకి లభించిన ఈ విజయాలను ఒక సంస్థకు మాత్రమే సంబంధించిన ఎన్నికల ఫలితాలుగా కాకుండా.. దేశ యువత రాజకీయ ఆలోచనలు, ఆశయాలు, ప్రాధాన్యతల్లో చోటుచేసుకుంటున్న మార్పులను అర్థం చేసుకునేందుకు ఉపయోగపడే ఒక ముఖ్యమైన సంకేతంగా చూడాల్సి ఉంటుంది. రాబోయే రోజుల్లో ఈ మార్పు ఏ దిశగా సాగుతుందన్నది యువత తీసుకునే నిర్ణయాలు, క్యాంపస్‌లలో జరిగే చర్చలు, విద్యార్థి సంఘాలు చేపట్టే కార్యాచరణపై ఆధారపడి ఉంటుంది.

– శ్రీపాద

# విరాళాల కేసులో చంపత్‌రాయ్‌కి క్లీన్‌చిట్



**రా**మ మందిర విరాళాల చోరీ ఆరోపణలకు సంబంధించిన కేసులో అత్యంత కీలక పరిణామం చోటుచేసుకుంది. ట్రస్ట్ మాజీ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్‌కి క్లీన్ చిట్ లభించింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఏర్పాటైన ప్రత్యేక దర్యాప్తు బృందం (ఎస్ఐటి) 60,000 పేజీలకు పైగా ఉన్న ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేసిన క్రమంలో చంపత్‌రాయ్, డాక్టర్ అనిల్ మిశ్రా, గోపాల్ రావులపై ఉన్న ఆరోపణలను తొలగించి, వారిని నిందితులుగా కాకుండా ప్రభుత్వ సాక్షులుగా చేర్చింది.

నగదు అపహరణ, విలువైన విరాళాలు, ఆర్థిక లావాదేవీలపై జరిపిన విస్తృత దర్యాప్తులోని కీలక అంశాలను సిట్ అయోధ్యలోని అవినీతి నిరోధక న్యాయస్థానం ముందు ఉంచిన నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది. సెప్టెంబర్ 25న గడువుకు ముందే దాఖలైన ఈ ఛార్జ్‌షీట్‌లో, ఆలయ ప్రాంగణంలో నోట్ల లెక్కింపు ప్రక్రియ సమయంలో నగదును అనధికారికంగా తరలించడం లేదా దాచిపెట్టడం వంటి 105 ఘటనలు ఉన్నట్లు పేర్కొన్నట్లు సమాచారం. అయితే, లెక్కింపు పూర్తయి, వేరు చేసిన నగదును బ్యాంకులకు తరలించే సమయంలో ఎటువంటి నగదు అపహరణ జరిగినట్లు ఆధారాలు లభించలేదని దర్యాప్తు వివరాలు తెలిసిన అధికారులు తెలిపారు.

కేసులో చంపత్ రాయ్, డాక్టర్ అనిల్ మిశ్రా, గోపాల్ రావును ప్రభుత్వ సాక్షులుగా మాత్రమే చేర్చడం గమనార్హం. విరాళాల నిర్వహణ, సీసీటీవీ ఫుటేజ్, బ్యాంకింగ్ రికార్డులు, విలువైన వస్తువులు, అరెస్టు అయిన వారి ఆర్థిక వ్యవహారాలను పరిశీలించిన దర్యాప్తు నేపథ్యంలో ఈ పరిణామం చోటుచేసుకుంది.

**మరో వైపు జూన్ 26న అరెస్టు చేసిన ఎనిమిదిమంది వ్యక్తులు ఈ కేసులో నిందితులుగా ఉన్నారు. వారు అవినాష్ శుక్లా, అనుకల్ప్ మిశ్రా, లవకుష్ మిశ్రా, మనీష్ కుమార్ యాదవ్, కరుణేష్ పాండే, రామశంకర్ మిశ్రా, సుభాష్ శ్రీవాస్తవ. రామ్ శంకర్ యాదవ్ అలియాస్ టిన్ను.**

మందిర్ ట్రస్ట్ సాఫ్ట్‌వేర్ ద్వారా రశీదులు జారీ చేసిన 803 విలువైన వస్తువులను సిట్ ప్రత్యక్షంగా పరిశీలించింది; రికార్డులతో సరిచూసిన తర్వాత వాటిలో ఎటువంటి వ్యత్యాసాలు లేనట్లు గుర్తించినట్లు సమాచారం. రశీదులు అందుబాటులో లేని మరో 86 విలువైన వస్తువులను ప్రత్యేకంగా గుర్తించి, వాటిని కూడా పరిశీలించారు. ఈ దర్యాప్తులో మందిర ట్రస్ట్ కార్యకర్తలు, విరాళాల లెక్కింపులో పాల్గొన్న సిబ్బంది, బ్యాంకు అధికారులు, భద్రతా సిబ్బంది, సీసీటీవీ ఆపరేటర్లు, చార్టర్డ్ అకౌంటెంట్లు, విక్రేతలతో సహా 173 మంది సాక్షులు పాల్గొన్నారు.

# ఉజ్జయినిలో మసీదు కూల్చివేతపై ఇస్లామిస్టుల రచ్చ



**ఈ** దేశంలో ఎన్ని ఆలయాలు కూలగొట్టినా ఎక్కడా స్పందన ఉండదు కానీ, మసీదుల జోలికి వెడితే మాత్రం నానా రచ్చ జరిగిపోతుంటుంది. ఉజ్జయినిలో సరిగ్గా అదే జరిగింది. సింహస్థ కుంభమేళా సన్నాహాల నేపథ్యంలో రోడ్డు విస్తరణ పనుల కోసం షాహీ మసీదు సముదాయంలోని కొంత భాగాన్ని కూల్చేయాలన్న ప్రతిపాదనలకు వ్యతిరేకంగా నిరసనలు జరిగాయి. ఈ సందర్భంగా ఇస్లామిక్ ఛాందసులు ఆందోళనలు చేయడంతో పాటు రాళ్ల దాడికి కూడా దిగారు. దీంతో నిరసనకారులను చెదరగొట్టడానికి పోలీసులు బాష్ప వాయువును ప్రయోగించారు. ఈ క్రమంలో 2,500మందికి పైగా పోలీసు సిబ్బంది,అధికారులను మోహరించారు, అలాగే ఎస్పీ ప్రదీప్ శర్మ స్వయంగా ఘటనాస్థలంలో ఉన్నారు. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఉజ్జయిని నగరం అంతటా అప్రమత్తత ప్రకటించారు.

షాహీ మసీదులో దాని కమిటీ స్వయంగా చేపట్టిన కూల్చివేత పనులు నేటికీ కొనసాగుతున్నా ముందస్తు భద్రతా చర్యగా, తాము పూర్తి స్థాయి భద్రతా వలయాన్ని ఏర్పాటు చేశామని, ఎవరినీ లోపలికి అనుమతించడం లేదని అన్నారు. అయితే, కొందరు దుండగులు గందరగోళం సృష్టించడానికి ప్రయత్నించి, రాళ్ల దాడికి పాల్పడగా, అక్కడే ఉన్న పోలీసులు బాష్పవాయువును ప్రయోగించి, స్వల్ప బలప్రయోగం ద్వారా గుంపును చెదరగొట్టారు. సీసీటీవీలు, డ్రోన్ల ద్వారా మొత్తం ప్రాంతాన్ని పర్యవేక్షిస్తున్నాము. అలాగే సోషల్ మీడియాపై కూడా నిశితంగా నిఘా కూడా పెట్టాం" అని పోలీసు శాఖ పేర్కొంది.

అంతేకాకుండా స్థానికేతరులు కూడా ఈ నిరసన కార్యక్రమంలోకి చొచ్చుకొచ్చారని, నిరసనల వెనుక వారి హస్తం కూడా ఉందని పోలీసులు పేర్కొంటున్నారు. వీరిలో కొందర్ని తాము అదుపులోకి కూడా తీసుకున్నామని పోలీసులు ప్రకటించారు. కొంతమంది మహిళలు రహదారిని అడ్డుకోవడానికి కూడా ప్రయత్నించారు. ఇప్పుడు రహదారి తెరిచి ఉంది. దయచేసి అందరూ సహకరించాలని కోరుతున్నాము; మీరందరూ చూస్తున్నట్లుగా, అందరి అంగీకారంతో ఈ మొత్తం ప్రక్రియను కమిటీ ద్వారానే నిర్వహిస్తున్నాం" అని పోలీసు అధికారులు ప్రకటించారు.

# దేశంలో తొలి ఎల్ఎన్‌జి రైలు ప్రారంభం




**దే**శంలోనే రైల్వేలలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకుంటున్నాయి. రైల్వే కార్యకలాపాలలో సాంప్రదాయ డీజిల్ ఇంధనంపై ఆధారపడటాన్ని తగ్గించి, ప్రత్యామ్నాయ ఇంధన వనరుల వినియోగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో తొలి ఎల్ఎన్‌జీ రైలును కేంద్ర హోంమంత్రి అమిత్‌షా పచ్చజెండా ఊపి ప్రారంభించారు. గుజరాత్‌లోని సబర్మతి రైల్వేస్టేషన్‌లో ఈ ప్రారంభోత్సవం జరిగింది.

ఈ రైలు, దాని డ్రైవింగ్ పవర్ కార్ల (డిపిసి) కోసం అభివృద్ధి చేసిన డీజిల్ ప్లస్ ఎల్ఎన్‌జీ ద్వంద్వ ఇంధన వ్యవస్థను ఉపయోగిస్తుంది. సబర్మతి ఇంటిగ్రేటెడ్ కోచింగ్ డిపోలోని రెండు 1,400 హెచ్‌పీపీ డిపిసిలను ఈ ద్వంద్వ ఇంధన వ్యవస్థకు మార్చారు, దీనివల్ల డీజిల్‌తో పాటు ఎల్ఎన్‌జీని కూడా ఉపయోగించడానికి వీలవుతుంది. ఈ సాంకేతికత పనితీరు, విశ్వసనీయతను అంచనా వేయడానికి, మార్పిడి చేసిన రెండు డిపిసిలపై 2,000 కిలోమీటర్లకు పైగా క్షేత్రస్థాయి పరీక్షలు పూర్తి చేశారు. ఈ వ్యవస్థ కింద, డీజిల్ వినియోగంలో సుమారు 40శాతం వరకు ఎల్ఎన్‌జిని భర్తీ చేయవచ్చు. రైల్వేలు విడుదల చేసిన ట్రయల్ డేటా ప్రకారం, ఎల్ఎన్‌జి వాడకం వల్ల ఇంధన వ్యయం, అలాగే కార్బన్ డయాక్సైడ్, నైట్రోజన్ ఆక్సైడ్‌లు,పార్టిక్యులేట్ మ్యాటర్ వంటి ఉద్గారాలు తగ్గుతాయని అంచనా. రైలు ప్రారంభం అనంతరం నిర్వహించిన సభలో అమిత్ షా ప్రసంగిస్తూ, దేశ రైల్వే వ్యవస్థను ప్రధాని నరేంద్ర మోదీ సమూలంగా మార్చారని తెలిపారు. 2014లో మోదీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రత్యేక సరకు రవాణా కారిడార్, రాపిడ్ రైల్ సిస్టమ్, అత్యాధునిక స్టేషన్లకు శ్రీకారం చుట్టారని అన్నారు. మొత్తం 11 వేల కిలోమీటర్ల రైలు కారిడార్‌ను నాలుగు ట్రాక్‌ల నెట్‌వర్క్‌గా మార్చుతున్నామని తెలిపారు. రైలు పనితీరును కొనసాగిస్తూనే ఇంధన వినియోగాన్ని, నిర్వహణ ఖర్చులను తగ్గించే సామర్థ్యాన్ని పరీక్షిస్తున్న ఈ సాంకేతికతతో, తమ కార్యకలాపాలలో ప్రత్యామ్నాయ ఇంధనాలను ఉపయోగించే దిశగా రైల్వేలు తీసుకున్న మరో ముందడుగుగా ఎల్ఎన్‌జీ రైలు ప్రారంభం నిలుస్తుంది.

# కశ్మీర్‌లో తిరిగి ఆలయ గంటల మోతలు



**క**శ్మీర్‌లోని శ్రీనగర్‌లో శీతల్‌నాథ్ మందిర ఆవరణ దశాబ్దాల తర్వాత ఆలయ గంటల మోత, మంత్ర పఠనాలతో మారుమోగింది. లోయలో సాంస్కృతిక,ధార్మిక పునరుద్ధరణ దిశగా ఒక చారిత్రక క్షణం ఆవిష్కృతమైంది. శ్రీనగర్‌లోని ప్రాచీన, చారిత్రక శీతల్‌నాథ్ ఆలయం 36 ఏళ్ల విరామం అనంతరం భక్తుల కోసం మళ్లీ తెరుచుకుంది. ఆలయాన్ని విజయవంతంగా పునరుద్ధరణ (జీర్ణోద్ధారణ) చేసిన తర్వాత పెద్ద సంఖ్యలో కశ్మీరీ హిందువులు హాజరయ్యారు.

1990ల ప్రారంభంలో మతపరమైన ఉగ్రవాద కాలంలో అసాంఘిక శక్తులు ఈ చారిత్రక ఆలయాన్ని ధ్వంసంచేశాయి. దశాబ్దాలుగా నిర్జనంగా, నిర్లక్ష్యానికి గురైన ఈ ఆలయ పునరుద్ధరణ కశ్మీరీ హిందూ సమాజంలో అపూర్వమైన ఉత్సాహాన్ని, భక్తిభావాన్ని నింపింది. పునఃప్రారంభం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో వైదిక మంత్రోచ్చారణలు, హోమం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సామూహిక ప్రయత్నాలు, స్థానికుల సహకారంతో ఈ ఆలయాన్ని దాని మూల రూపంలోకి తీసుకువచ్చారు. ఇది లోయలో శాంతి, సహజీవనం, మత స్వేచ్ఛకు బలమైన సందేశాన్ని పంపింది.

కశ్మీరీ హిందువులకు శీతల్‌నాథ్ ఆలయం అత్యంత ధార్మిక, సామాజిక ప్రాముఖ్యతను కలిగి ఉంది. ఆలయం తెరుచుకోవడంతో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన నిర్వాసిత కశ్మీరీ హిందువులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ ఆలయం పునఃప్రారంభం కావడంతో కశ్మీరీ సంస్కృతి, ప్రాచీన వారసత్వ సంరక్షణపై మళ్లీ ఆశలు బలపడ్డాయి. రాబోయే కాలంలో ఈ కార్యక్రమం నిర్వాసిత సమాజం తమ స్వస్థలాలకు తిరిగి వచ్చే దిశగా ఒక మైలురాయిగా నిలుస్తుందని చెప్పవచ్చు.

# నమామి భారతం అరుదైన రికార్డు



**జా**తీయ గీతం 'వందేమాతరం' 150వ వార్షికోత్సవం సందర్భంగా 'నమామి భారతం' చేపట్టిన దేశవ్యాప్త ఉద్యమం చరిత్ర సృష్టించింది. దేశవ్యాప్తంగా కోటి మందికి పైగా ప్రజలు ఒకే గళంతో సామూహికంగా 'వందేమాతరం' ఆలపించిన నేపథ్యంలో ఆసియా, ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో అరుదైన స్థానం దక్కింది. 'నమామి భారతం' కేవలం సామూహిక గీతాలాపన కార్యక్రమం మాత్రమే కాదు, వందేమాతరం150 ఏళ్ల ప్రస్థానం, స్వాతంత్ర్య ఉద్యమంలో దాని పాత్ర, భారత జాతీయ జీవితంలో దాని ప్రాముఖ్యత గురించి యువతరానికి తెలియజే యడానికి చేపట్టిన ఒక దేశవ్యాప్త ప్రచారం. సామూహిక గానంతో పాటు, విద్యాభారతి పాఠశాలలు, సంస్థలలో వందేమాతరం చరిత్ర, స్వాతంత్ర్య పోరాటం, భారతీయ సంస్కృతి, జాతీయ స్ఫూర్తికి సంబంధించిన వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యంగా, వివిధ ప్రదేశాలలో అత్యధిక సంఖ్యలో విద్యార్థుల, ప్రజలు ఏకకాలంలో వందేమాతరాన్ని పూర్తిగా ఆలపించినందుకు 'నమామి భారతం' కార్యక్రమానికి ఆసియా బుక్ ఆఫ్ రికార్డ్స్ (ఏబీఆర్), ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్ (ఐబీఆర్) నుండి ధ్రువీకరణ లభించింది. 'నమామిభారతం' ద్వారా, విద్యా భారతి విస్తృత జాతీయ భాగస్వామ్యంతో వందేమాతరం 150వ వార్షికోత్సవాన్ని జరుపుకుంది. భిన్నత్వంలో ఏకత్వం, మాతృభూమి పట్ల గౌరవం, జాతీయ స్ఫూర్తికి సామూహిక వ్యక్తీకరణగా ఈ కార్యక్రమం చిరస్మరణీయంగా నిలుస్తుందని ఆ సంస్థ పేర్కొంది. ఈ దేశవ్యాప్త కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, పాఠశాల యాజమాన్య కమిటీలు, సామాజిక కార్యకర్తలు, ప్రముఖ పౌరులు, ప్రజలకు విద్యా భారతి అఖిల్ భారతీయ శిక్షా సంస్థాన్ కృతజ్ఞతలు తెలిపింది.

కథ

# మాసిన చేతులు

ప్రశాంత్‌వర్మ ఉప్పలపాటి

విశాఖపట్నం నుండి హైదరాబాద్ వెళ్లే గోదావరి ఎక్స్‌ప్రెస్ స్టేషన్‌లో నిశ్శబ్దంగా నిలబడి ఉంది. సమయం సాయంత్రం ఆరు గంటలవుతోంది. స్టేషన్ ప్లాట్ ఫారం దీపాల వెలుతురులో మెరిసిపోతుంది. నెమ్మదిగా వీచే గాలి మోసుకొచ్చే మిరపకాయ బజ్జీలు, అక్కడే అమ్ముతున్న ఇంకొన్ని తినుబండారాల వాసనతో పాటు రైలు కూత మిశ్రమంగా వినిపిస్తోంది.

సుబ్బలక్ష్మికి అరవై ఏళ్ల పైనే ఉంటాయి. ఫ్లాట్‌ఫారంమీద, రైల్లో సామర్లకోట నుండి రాజమండ్రి తిరుగుతూ పండ్లు అమ్ముకుని జీవనం సాగించే ఒంటరి తను. రోజూ మాదిరిగానే అరటి, జామపళ్లు, ఉడకబెట్టిన వేరుశనక్కాయలు ఓ గంపలో పెట్టుకొని ఫ్లాట్‌ఫారంమీద తిరుగుతుంది. రైలు కదిలేముందు అందులోకి వెళదామని అందాకా ఆగి అక్కడే అమ్ముతుంది. ఈ రోజుకి ఇలా అదే ఆఖరు.రాజమండ్రి వెళ్లేలోపు అయిపోతే నాలుగు రూపాయలు ఉంటాయన్న ఆశ.

ఇప్పటికే అలసిపోయిన తను ఒక్కసారిగా చివరి స్లీపర్ కోచ్ దగ్గర ఆగింది. అక్కడ రాధిక మొబైల్ ఫోన్ చేతిలో పట్టుకొని కిందకి చూస్తూ ఏవో మెసేజ్‌లు టైప్ చేస్తోంది. సుమారు ముప్పై, ముప్పై ఐదు మధ్య ఉంటుంది వయసు. ఆమె ఒక పెద్ద మల్టీనేషనల్ కంపెనీలో డైరెక్టర్. చక్కగా స్ట్రైయిట్ హెయిర్‌తో డిజైనర్ డ్రస్, ఖరీదైన చెప్పులు, హ్యాండ్‌బ్యాగ్‌తో హుందాగా నిల్చుని ఉంది.

“జాంపళ్లు తీసుకుంటావా అమ్మా? ముక్కలుకోసి ఉప్పుకారం కలిపిస్తాను. కమ్మగా ఉంటుంది నోటికి” అడిగింది సుబ్బలక్ష్మి.

రాధిక ఆమె ముఖంలోకి చూసి ఒకసారి అటు ఇటు చూసి... “అవే పళ్లు రోజూ చూస్తున్నాం. నీ చేతులెంత అసహ్యంగా ఉన్నాయో చూసుకున్నావా? అలానే నువ్విస్తే వాటి రుచి తెలియడం సంగతి దేవుడెరుగు..తిన్నవాళ్లకి ఏ అనారోగ్యమో చుట్టుకుంటుంది.” కసురుకున్నట్టు అనేసి ముఖం తిప్పుకుంది.

అప్పుడే వెనుక నిలబడ్డ ప్రయాణికులు సుబ్బలక్ష్మివైపు జాలిగా చూసారు. ఆమెకిది కాస్త అవమానంగా తోచింది. ఆమె చేతులు మరీ అంత అసహ్యంగా ఏం లేవు. గంప ఎత్తుతూ, దింపుతూ మధ్యలో అడిగిన వాళ్లకి కాయలు కోసిస్తూ, శనక్కాయలు చేతిలో వేసుకుని పొట్లంలో వేయడంవల్ల కాస్త మాసినట్టు కనిపిస్తున్నాయి. ప్రతీసారి కడుక్కోవడం కొంచెం ఇబ్బందే. ఐనా ఏమీ అనకుండా మౌనంగా కాసేపు నిలబడి, తలవంచి నెమ్మదిగా ముందుకు నడిచింది. సిగ్నల్ పడి అందాక గాలికోసం కిందికి దిగిన ప్రయాణికులు ఎక్కడంచూసిన సుబ్బలక్ష్మి తానూ ఎక్కేసింది.

రైలు నెమ్మదిగా కదిలింది. రాధిక తన బెర్త్ దగ్గర కూర్చొని ఫోన్‌లో బిజీగా ఉంది. పది నిమిషాల తరువాత ఫోన్ పక్కన పడేసి బయటకి చూడటం మొదలుపెట్టింది. హైదరాబాద్‌లో ఉద్యోగం వచ్చి రెండేళ్లయ్యింది. తండ్రి చనిపోయాక కుటుంబానికి తానే ఆధారమైంది. అమ్మా, నాయనమ్మా ఇద్దరే ఊర్లో ఉంటుంటే నాయనమ్మను బాబాయికి అప్పగించి, తల్లిని తనతో తీసుకెళ్లాలని నిర్ణయం తీసుకుని, తనతో రావడానికి సిద్ధంగా ఉండమని చెప్పడానికే వచ్చింది. నాయనమ్మ ససేమిరా అన్నా తను ఒప్పుకోలేదు. అక్కడి తల్లి పరిస్థితి ఎలా ఉంటుందో తనకి తెలుసు. తనకి ఊహ తెలిసినప్పటి నుండి చూస్తూనే ఉంది. ఒక్కసారికూడా మనిషిగా చూడలేదు. అన్నింటికీ విసుక్కోవడమే. ఎప్పుడూ ఏదోకటి అనడమే పనిగా ఉండేది. ఇంటెడు చాకిరీ అమ్మే చేసేది. అలసిపోయి కాసేపు కూర్చొబోతే నేల మీద కూర్చోమనేది నాయనమ్మ. దుమ్ము పట్టిన చీర, ఒంటిమీద చెమట వాసన మంచానికో, కుర్చీలకో అంటిస్తుందని విసుక్కునేది. స్నానం చేసినా చెమటకంపు పోలేదని తిట్టేది. అన్నీ మౌనంగా భరించింది అమ్మ. తండ్రి అమ్మచాటు కొడుకు. తనేదో, తన ప్రపంచం వేరే. ఇప్పటికైనా తల్లిని సంతోషంగా ఉంచాలని నిర్ణయించుకుంది. నాన్న తరువాత ఇంటికి పెద్ద మగదిక్కంటూ ఉంటే అది బాబాయ్ ఒక్కడే. ఫోన్లో చెబితే ఎలా తీసుకుంటారో అని నేరుగా చెప్పిపోవడానికి వచ్చింది. ఇల్లదీ చూసి పదిరోజుల్లో వస్తానని వెనక్కి బయలుదేరింది. ఏదో స్టేషన్ దగ్గర రైలు నెమ్మదిగా పోతుంటే ఆమె ఆలోచనల్లోకి ఇందాకటి పళ్లు అమ్ముకునే సుబ్బలక్ష్మి చేరింది.

‘తల్లి విషయంలో నాన్నమ్మని తప్పు బడుతున్నాను కానీ, ఇంతకుముందు నేను మాత్రం చేసిందేంటి?అమ్ముకునే వ్యక్తి కాబట్టి కొనుక్కోమని అడిగింది. కొంటే కొనుండాల్సింది. లేదా వద్దని చెబితే సరిపోయేది. మళ్లీ అడిగినా వద్దంటే తనదారిన తాను వెళ్లిపోయేది. నేను తొందరపడ్డానేమో. శ్రమవల్ల చిందిన చెమటలో, బరువులు మోసిన ఆమె చేతులు మాసిపోయాయి. పైకి కనిపించని తన మనసు ఎప్పుడు, ఎలా మాసిపోయిందో కదా!’ అనుకుంది రాధిక.

ఎంత ప్రయత్నించినా మనసు నుండి పోవట్లేదు. ఒకలాంటి అభద్రతా భావం భావం అల్లుకుపోయింది.

‘కలిసి క్షమించమని అడిగే అవకాశం కూడా లేకుండా అయిపోయిందే.’ అనుకుంది తనలో తనే.

* * *

అందాకా ఉరుకులు పరుగులు తీసిన రైలు కాసేపట్లో రాజమండ్రి స్టేషన్‌కి చేరుకుంటుందనగా నెమ్మదించింది. స్టేషన్ చేరగానే అక్కడ వాటర్ బాటిల్ కొనడంకోసం కిందకి వెళ్లడానికని లేచి తలుపు దగ్గరకి వెళ్లబోతుంటే ఓ పక్కగా కనిపించింది సుబ్బలక్ష్మి. మరోవైపు గుమ్మందగ్గర గంపను ముందు పెట్టుకుని కూర్చుని ఉంది.

రాధిక ఆమె ముందుకెళ్లి నిలబడి,“అమ్మా! ఇందాక ఏదో చిరాకులో మాట్లాడేసాను. మన్నించు. నీ కష్టాన్ని గుర్తించకుండా చేతులు శుభ్రం గురించి అనవసరంగా మాట్లాడాను. అలా మాట్లాడకుండా ఉండాల్సింది. తరువాత ఆలోచిస్తే ఇంట్లో నా తల్లి పడుతున్న కష్టమే గుర్తొచ్చింది. ఏమనుకోకండి.” అని చెప్పింది.

సుబ్బలక్ష్మి కళ్లలో చిన్న చిరునవ్వు మెరిసింది.

“అమ్మా... మేము పేదవాళ్లం, కానీ మా పనిపట్ల మాకు మక్కువ ఉంది. నా చేతులు క్రమంగా పనిచేస్తేనే, నాలుగువేళ్లు నోటికి చేరతాయి. ఇందాక నువ్వు వాటిలో కంటికి కనిపించే మురికిని చూసావు. తరువాత మనసుతో చూసినట్టున్నావ్! నీకు నా కష్టం కనిపించింది. పరవాలేదమ్మా! ఇప్పటికైనా శ్రమని గుర్తించావ్! బిడ్డలాంటి దానివి

నిన్నేమనుకుంటాను. ఐనా ఇవన్నీ నాకు అలవాటేలే” గంపలో ఉన్న కాస్త సరుకు సర్దుకుంటూ అంది. రాధికకి ఆమాట చురుక్కున తగిలింది. ‘ఆఫీసులో కానీ, ఎక్కడైనా కానీ తనని ఎవరైనా ఏమైనా అంటే చురుగ్గా సమాధానం చెబుతుంది. కొన్నిసార్లు తప్పు ఉన్నా కూడా ఎదుటి వ్యక్తి అనే మాటలను తీసుకోలేకపోయేది. అలాంటిది తను అంతమాట అంటే ఎంత తేలిగ్గా వదిలేసిందో కదా!’ అనుకుంది.

కాసేపలా మౌనంగా చూస్తూ ఉండిపోయింది.

“ఇందాక ఒక మనిషిగా మాత్రమే చూసాను. ఇప్పుడే మీరన్నట్టు మనసుపెట్టి చూస్తున్నానమ్మా! ఈ వయసులో కూడా ఇంత భారాన్ని ఎలా మోస్తున్నావ్! నీవాళ్లు...”

“ఇద్దరు మగపిల్లలు. ఎవరి జీవితాలు వాళ్లవే. నేనెప్పుడైనా వాళ్ల ఇంటికి వెళ్లినా, ‘చెమట వాసన వస్తోందే అమ్మా!’ అంటూ కూర్చోనివ్వరు. దగ్గరగా చేరనివ్వరు. వాళ్లకోసం పడిన శ్రమ తాలూకా చెమట వాసనే అదని వాళ్లకి అర్థంకాలేదు. ఎప్పటికీ కాదుకూడా. వాళ్లు నన్నొదిలేసుకున్నంత తేలిగ్గా నేను వాళ్లని విడిచి ఉండలేకపోతున్నాను. తల్లిని కదా! మనవలున్నారు. వాళ్లని చూడాలనిపించినప్పుడల్లా వెళ్తుంటాను. వాళ్లేమన్నా, ఏమనుకున్నా పట్టిం చుకోను. అలవాటైపోయిందిలే. వాళ్ల నుండి ఆశించడం మానేసి, ఆశించినా ఛీత్కారమే తప్ప



ఆదరణ ఉండదని అర్థమై వాళ్లకి దూరంగా ఈ ప్లాట్‌ఫారం మీదనే ఇలా తిరుగుతూ బ్రతుకు బండి నడుపుకొస్తున్నా. అందుకే ఇందాకా నువ్వన్న మాటలు చివుక్కుమన్నా కూడా పట్టించుకోలేదు."

వింటున్న రాధిక కళ్లు చెమర్చాయి.

"నీకు ఇల్లేం లేదామ్మ...?"

"ఉందిలే... అక్కడే ఉంటాను. నా పని అయిపోగానే వెళ్లిపోతాను. మళ్లీ ఉదయాన్నే వచ్చేస్తాను. ఇక్కడే ప్రతిరోజూ అనేకమంది రెక్కలు కష్టం చూస్తాను. ఎవరో ఒకరు నవ్వుతారు. కొందరు చూసి పలకరింపు లేకుండా పోతారు. వాళ్లంతా నా వాళ్లే, నా బోటివాళ్లే. 'ఈ వయసులో బరువులేం మోస్తావు?చేయి చాపితే వచ్చే పదో పరకో చాలదా?' అనేవాళ్లు ఉన్నారు. ఓపికైపోలేదుగా. నిజాయతీగా నాకు చేతనైన వ్యాపారం చేసుకుని ఉన్నంతలో గౌరవంగా పోతున్నా. చేయి చాపాల్సిన రోజంటూ వస్తే నా ప్రాణాలు తీసుకుపోమ్మని ఆ గోదారమ్మ గట్టునే నిలబడి చేతులు చాపుతా! చల్లని తల్లి దయచూడకపోతుందా!"

రాధికకి తల్లి గుర్తొచ్చింది. 'దేనికమ్మా మాటలు పడుతూ ఇలా భరిస్తావ్' అనంటే 'నన్ననేది నా అత్తగారే కదే!' అనేది. పెద్ద వయసుతో వచ్చిన అభద్రతా భావమేమో. తను ఎన్నన్నా అలానే భరించేది. అంత ఓపిక నాకు లేదాయే' అనుకుంది మనసులో.

**అప్పుడే రైలు ప్లాట్‌ఫారం మీదకి చేరుకుంది. ముందు తను దిగి వెనక దిగుతున్న సుబ్బలక్ష్మికి సాయంచేసింది. తలుపు పక్కనున్న ఖాళీ ఐన గంపను అందుకుని ఆమె చేతికిచ్చింది చిరునవ్వుతో. "ఇకనేను వెళ్లొస్తా" అంటూ సుబ్బలక్ష్మి కుడిచేతిని పైకెత్తి ఊపుతుంటే ఆమెకి చేతికి బదులుగా బురదలో వికసించిన కమలమే కనిపించింది. తల్లికోసం తానుంది. వీళ్లకోసం ఎవరున్నారో కదా అనుకుంది.**

చేతికున్న చిన్నసంచిలో నుండి ఒక ఐదువందల కాగితం తీసి ఆమె చేతికి ఇవ్వబోయింది.

"వద్దు తల్లీ, ఊరకనే ఆశించేదాన్ని అయితే ఈ బరువు మోయకుండానే నా చేతిని నింపుకునేదాన్ని. అప్పుడీ చేతులకి దుమ్ము, ధూళి కూడా అంటేవి కాదు." పక్కనే ఉన్న గంపనే చూస్తూ అదోలా అంది.

మనసు చివుక్కుమంది రాధికకి.

'ఇప్పటివరకూ అదే చెప్పిందిగా! అంతా విని మళ్లీ అదే పొరబాటు ఎలా చేయబోయానో కదా!' అనుకుంటూ, "అమ్మా! ఆ మిగిలినవాటికి లెక్కకట్టి తీసుకో. అవన్నీ సంచిలో వేసివ్వు" అనగానే గంపలోనుండి చిన్నసంచి అందుకుని అందులో వేసేసి లెక్కకట్టి తక్కిన చిల్లర రాధిక చేతికి ఇచ్చేసింది. మనసులోనే ఆమె నిజాయతీని, గౌరవంగా బతకాలన్న ఆమె ఆశయాన్ని మెచ్చుకుంది.

అప్పుడే రైలు ప్లాట్‌ఫారం మీదకి చేరుకుంది. ముందు తను దిగి వెనక దిగుతున్న సుబ్బలక్ష్మికి సాయంచేసింది. తలుపు పక్కనున్న ఖాళీ ఐన గంపను అందుకుని ఆమె చేతికిచ్చింది చిరునవ్వుతో. "ఇక నేను వెళ్లొస్తా" అంటూ సుబ్బలక్ష్మి కుడిచేతిని పైకెత్తి ఊపుతుంటే ఆమెకి చేతికి బదులుగా బురదలో వికసించిన కమలమే కనిపించింది.

తల్లికోసం తానుంది. వీళ్లకోసం ఎవరున్నారో కదా అనుకుంది. అప్పుడే చంటిపిల్లను భుజాన వేసుకుని యాచిస్తున్న ఓ తల్లికి, తనవద్దనున్న జాంపళ్లలో ఓ రెండు మాత్రం ఉంచుకుని మిగిలిన పళ్లున్న సంచిని ఇచ్చింది. చేతిలోని పండ్లవైపు, దూరంగా చీకటిలో కలిసిపోతున్న సుబ్బలక్ష్మి వైపు ఆరాధనా భావంతో చూస్తూ కొద్ది క్షణాలు అలానే నిలబడిపోయింది. ★

## జాగృతి యాప్ వినియోగంపై విన్నపం

జాగృతి

ఏడున్నర దశాబ్దాలకు పైబడిన సుదీర్ఘ ప్రస్థానంలో సాంస్కృతిక ఔన్నత్యం, రాజకీయాలు, సామాజిక అంశాలు, వర్తమాన సమస్యలు, కళలు, సాహిత్యం, విజ్ఞానశాస్త్రం, పర్యావరణం వంటి పలు అంశాలను చర్చించే విలువైన ఎన్నో వ్యాసాలను జాగృతి అందిస్తూ వస్తోంది. ఈ సంవత్సరం సంఘ శతాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నాము.

**ఈ సందర్భంగా పాఠకులకు మరింత చేరువయ్యేందుకు జాగృతి యాప్‌ని సిద్ధం చేశాం.**

యాప్‌ని ఇన్‌స్టాల్ చేసుకోవడానికి ప్లేస్టోర్‌లో Jagriti Weekly అని సర్చ్ చేయండి లేదా పక్కనున్న QR Code స్కాన్ చేయగలరు.

APP Login -ఎడమవైపు Menu మీద క్లిక్ చేసి, Login ఎంపికపై క్లిక్‌చేస్తే Login Screen కనిపిస్తుంది.

1. తెరపై కనిపించే యూజర్ నేమ్, పాస్‌వర్డ్‌తో లాగిన్ కావచ్చు.
2. Login Screen కింద Click here to login with Phone Number పైన క్లిక్ చేసి ఫోన్ నెం. నమోదు చేస్తే, మీ మొబైల్‌కి OTP వస్తుంది. OTPతో లాగిన్ అవ్వండి.
3. మొదటిసారి Login కాగానే, Password మార్పు చేసుకోమని సందేశంతో Screen వస్తుంది. మార్చుకొని, మరలా Login అవ్వాలి.
4. Dashboard: Profile information – User Id, Name, Profile status, Start, End Date, and Receipt Amount వివరాలు కనిపిస్తాయి.
5. Profile Management : View Profile–మీ వ్యక్తిగత చిరునామా, అమౌంట్ వివరాలు చెక్ చేసుకోండి. చిరునామా మార్పు కోసం పైన ఉన్న JAGRITI లోగోకి పక్కనే ఉన్న Edit Profileని క్లిక్ చేయండి. పోస్టల్ అడ్రసు ఇచ్చి, పిన్‌కోడ్ టైప్ చేస్తే రాష్ట్రం, జిల్లా వివరాలు వాటంతట అవే వస్తాయి. మండలం, సబ్ పోస్ట్ ఆఫీసు, సంఘ విభాగ్, జిల్లా, ఖండ/నగరాలను మీరు ఎంపిక చేస్తే సరిపోతుంది.
6. Support ticket: మీకు ఏదైనా సమస్య ఉంటే ఇందులో నమోదు చేయండి. 24 గంటలో మీకు కాల్ చేస్తాము.
7. మిగితా వివరాలు Subscriber Login Videoలో చూడండి.

**– మేనేజర్**



# ఏషియాడ్‌లో భారత అథ్లెట్ల అరుదైన రికార్డులు!

**జపాన్ వేదికగా ముగిసిన 20వ ఆసియాక్రీడల్లో భారత్ పతకాలవేట ఆశించిన స్థాయిలో సాగకపోయినా.. అథ్లెట్లు మాత్రం పలు అరుదైన రికార్డులతో మెరిసి మురిశారు.**

జపాన్‌లోని అయిచీ- నగయో నగరాల వేదికగా జరిగిన ఆసియా-2026 క్రీడలు భారత్‌కు మిశ్రమఫలితాలను ఇచ్చాయి. గత క్రీడల్లో 28 స్వర్ణాలు సహా 107 పతకాలతో నాలుగోస్థానంలో నిలిచిన భారత్ ఈసారి అంచనాలకు తగ్గట్టుగా రాణించలేకపోయింది. 492 మంది అథ్లెట్ల భారీబృందంతో 35 రకాల క్రీడాంశాలలో పోటీకి దిగిన భారత పతకాలవేట రజతాలజోరుతో పాటు కంచుమోతతో ముగిసింది. గత క్రీడల ప్రమాణాలను అందుకోవడంలో సఫలం కాలేకపోయింది.

**బంగారు కబడ్డీ.....**

టీమ్ అంశాలలో భారత్ కు కచ్చితంగా బంగారు పతకాలను అందించే అతికొద్ది క్రీడల్లో ఒకటిగా ఉన్న కబడ్డీ..పురుషుల, మహిళల విభాగాలలో జంట స్వర్ణాలతో గర్వకారణంగా నిలిచింది. 1990 ఆసియా క్రీడల నుంచి నిర్వహిస్తూ వస్తున్న కబడ్డీ పురుషుల విభాగంలో భారత్ బంగారు పతకం గెలుచుకోడం ఇది తొమ్మిదవసారి. 2018 ఆసియాక్రీడల్లో మాత్రమే ఇరాన్ చేతిలో ఓటమితో భారత్ స్వర్ణాన్ని చేజార్చుకొంది. 1990, 1994, 98, 2002, 2006, 2010, 2014 ఆసియాక్రీడల్లో బంగారు పతకాలు సాధించిన భారత్ తిరిగి 2022 దానిని చేజిక్కించుకోగలిగింది. ఈసారి ఆసియాక్రీడల ఫైనల్లో చిరకాల ప్రత్యర్థి ఇరాన్ ను 40- 34తో అధిగమించడం ద్వారా రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి బంగారు పతకం అందుకొంది.

మహిళల విభాగంలో 2010 ఆసియాక్రీడల నుంచే కబడ్డీని ప్రవేశపెట్టారు. భారత మహిళాజట్టు 37-34 పాయింట్ల తేడాతో ఇరాన్‌పై విజయం సాధించింది. 2014, 2022 క్రీడల్లో స్వర్ణాలను నెగ్గిన భారత్ 2018 క్రీడల్లో మాత్రం ఇరాన్ చేతిలో ఓటమితో బంగారు పతకం చేజార్చుకొంది. మహిళల విభాగంలో భారత్ కబడ్డీ స్వర్ణాన్ని అందుకోడం ఇది నాలుగోసారి.

మహిళా క్రికెట్లో సైతం హర్మన్ ప్రీత్ కౌర్ నాయకత్వంలోని భారత్ వరుసగా రెండోసారి స్వర్ణపతకంతో సత్తా చాటుకొంది.

**షాట్ పుట్‌లో తజిందర్ పాల్ సింగ్ హ్యాట్రిక్....**

పురుషుల షాట్ పుట్‌లో భారత అథ్లెట్ తజిందర్ పాల్ సింగ్ తూర్ రజత పతకం సాధించడం ద్వారా ఓ అరుదైన ఘనత సాధించాడు. 2018 ఆసియా క్రీడల నుంచి వరుసగా మూడు వేర్వేరు ఆసియా క్రీడల్లో పతకాలు నెగ్గిన భారత షాట్ పుట్టర్‌గా నిలిచాడు. 2018, 2022 ఆసియాక్రీడల్లో బంగారు పతకాలు సాధించిన తజిందర్ గాయం కారణంగా ప్రస్తుత క్రీడల్లో రజత పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. తజిందర్ 20.64మీటర్ల దూరం మాత్రమే విసరగలిగాడు.

**56 ఏళ్ల తర్వాత హైజంప్ పతకం...**

పురుషుల హైజంప్‌లో భారత్‌కు 56 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత ఓ పతకం దక్కింది. జాతీయ రికార్డు హోల్డర్ సర్వేశ్ అనీల్ కుశారే 2.25 మీటర్ల రికార్డుతో రజత పతకం అందుకొన్నాడు. ఆసియాక్రీడల చరిత్రలో హైజంప్ స్వర్ణం సాధించిన భారత నాలుగో జంపర్‌గా రికార్డుల్లో చేరాడు. 1970 ఆసియాక్రీడల్లో భీమ్ సింగ్ కాంస్య పతకం తరువాత భారత్‌కు మరో హైజంప్ పతకం దక్కడం ఇదే మొదటిసారి. గతంలో 1954 క్రీడల్లో అజిత్ సింగ్ భల్లా, 1966 గేమ్స్‌లో భీమ్‌సింగ్ బంగారు పతకాలు సాధించారు. బహుముఖ అంశాలున్న డెకాత్లాన్‌లో రెండు ఆసియాక్రీడల పతకాలు సాధించిన భారత తొలి అథ్లెట్‌గా తేజస్వినీ శంకర్ నిలిచాడు.

**షూటింగ్‌లో ఈషా సింగ్ రెండో పతకం...**

మహిళల 25 మీటర్ల పిస్టల్ షూటింగ్ విభాగంలో గత ఆసియాక్రీడల్లో రజత పతకం సాధించిన భారత షూటర్ ఈషాసింగ్ ఈసారి కూడా రజత పతకమే సొంతం చేసుకుంది. వరుసగా రెండు వేర్వేరు ఆసియాక్రీడల్లో రజత పతకాలు సాధించిన భారత మహిళా పిస్టల్ షూటర్‌గా నిలిచింది. ప్రపంచకప్‌లో బంగారు పతకం నెగ్గిన ఆమె ఆసియా క్రీడల్లో మాత్రం రజత పతకాలకే పరిమితం కావాల్సి వచ్చింది.

**మారథాన్‌లో ఎన్నాళ్లకెన్నాళ్లకు...**

పురుషుల మారథాన్ ( 42. 195 కిలోమీటర్ల) పరుగులో 44 సంవత్సరాల విరామం తర్వాత భారత్ కు సవాన్ బార్వాల్ రజత పతకం సాధించి పెట్టాడు. 28 సంవత్సరాల సవాన్ 2 గంటల 11 నిమిషాల 37 సెకన్ల టైమింగ్ రికార్డుతో రజత విజేతగా నిలిచాడు. భారత వెలుపల జరిగిన ఆసియాక్రీడల్లో మారథాన్ రజతం సాధించిన తొలిరన్నర్‌గా రికార్డుల్లో చేరాడు.

మహిళల వెయిట్ లిఫ్టింగ్‌లో మీరాబాయి చాను ఆసియాక్రీడల్లో పతకం సాధించాలన్న తన చిరకాల లక్ష్యాన్నిఎట్టకేలకు నెరవేర్చుకోగలిగింది. 49 కిలోల విభాగంలో 198 కిలోల బరువెత్తి 28 సంవత్సరాల విరామం తర్వాత భారత్‌కు పతకం అందించిన లిఫ్టర్‌గా నిలిచింది. ప్రపంచ టైటిల్ తో పాటు కామన్వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం, ఒలింపిక్స్‌లో రజతం నెగ్గిన మీరాబాయి చివరకు ఆసియాక్రీడల్లో సైతం రజత పతకంతో తన జీవితలక్ష్యాన్ని సాధించగలిగింది.

స్క్వాష్ పురుషుల, మహిళల సింగిల్స్‌లోనూ భారత్ రజత పతకాలతో సంతృప్తి చెందాల్సి వచ్చింది. పురుషుల విభాగంలో అభయ్ సింగ్, మహిళల విభాగంలో అనాహత్ సింగ్ ఫైనల్స్ చేరినా రజతాలు మాత్రమే సాధించగలిగారు. భారీగా పతకాలు అందించగలదనుకొన్న బ్యాడ్మింటన్ టీమ్ విభాగంలో మాత్రమే భారత్ కాంస్యం గెలుచుకొంది. పురుషుల, మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగాలలో భారత క్రీడాకారులు దారుణంగా విఫలమయ్యారు.

మొత్తం మీద..2026 ఆసియాక్రీడలు భారత్ కు సంతృప్తికంటే..అసంతృప్తినే మిగిల్చాయి.



**కృష్ణారావు చాప్పరపు**
సీనియర్ జర్నలిస్ట్, 84668 64969

# చరిత్రకారుల దృష్టిలో




**భారతీయ చరిత్రలో మహారాణా ప్రతాప్‌ను కేవలం ఒక వీర యోధుడిగా కాక, స్వతంత్రత, స్వాభిమానం, రాష్ట్ర గౌరవాలకు శాశ్వత ప్రతీకగా పరిగణిస్తారు. అంతేకాదు, జూన్ 1576, 18న జరిగిన హల్దీఘాటీ యుద్ధాన్ని భారత చరిత్రలో జరిగిన గొప్ప ఘటనల్లో ఒక దానిగా పరిగణిస్తారు. పరిమిత సాధనాలు ఉన్నా అకుంఠిత ధైర్యం, అజేయమైన సాహసం, మాతృభూమి పట్ల అచంచలమైన విధేయతతో ఎటువంటి సామ్రాజ్యవాదశక్తినైనా సవాలు చేయవచ్చని రుజువు చేసిన ఘట్టమిది.**

ప్రపంచంలో జరిగిన ప్రముఖ యుద్ధాలలో ఒకటిగా హల్దీఘాటీ యుద్ధాన్ని పరిగణించాలి కానీ, దాని విశిష్టతను నిష్పక్షపాతంగా మూల్యాంకనం చేయకపోవడం దురదృష్టకరం. ఐతిహాసిక ప్రమాణాలు, సమకాలీన వివరణలు, ఇరుపక్షాల పత్రాలను అధ్యయనం చేసినప్పుడు, ఈ యుద్ధంలో భౌతిక, నైతిక, వ్యూహాత్మక, మానసిక విజయం రాణా ప్రతాప్, మేవాడ్ సైన్యానికే చెందిందనేది చరిత్రకారుల అభిప్రాయంలోని యథార్థ సత్యం. మొగలుల విషయానికి వస్తే, మేవాడ్ సేనలు తమను పరాజయం అంచులకు నెట్టాయని అంగీకరిస్తూనే, అంతిమంగా యుద్ధం తమకు అనుకూలంగా సాగిందని వారు పేర్కొంటారు.

**కీలక అంశాలను నిర్లక్ష్యం చేయడం**

కొన్ని ఇతర వ్యాఖ్యానాల్లో మొగల్ సేనలు మొదటి దెబ్బతోనే యుద్ధ మైదానం నుంచి 6-7 కోసుల దూరం పరుగులు తీశారు. అయితే, మొగలుల విజయానికి ప్రమాణాలను వారే స్వయంగా అంగీకరించలేదు. కానీ ఫార్సీ మూలంలో మాత్రం ఎటువంటి ఆధారాలు లేకుండానే విజయం సాధించామని రాసేసుకుం టారు. ఎందుకంటే, జానపద సాహిత్యం, ప్రసిద్ధ డింగల్ వీరగాథలు వంటి ముఖ్యమైన ఆధారాలతో పాటు, ప్రతాప్ జారీ చేసిన పత్రాలు, రాగి ఫలకాలు, వంశావళి తదితర పరిపాలనా ఆధారాలను వారు విస్మరించారు. అయితే, కొందరు ప్రముఖ చరిత్రకారుల, ప్రతాపుడి మీద పరిశోధన చేస్తున్న వారి అభిప్రాయాలు, హల్దీఘాటీలో యుద్ధంలో ప్రతాపుడి గెలుపును నిరూపిస్తున్నాయి.

యుద్ధాన్ని కళ్లతో చూసి, పరిస్థితి ఏమిటో చెప్పిన సమకాలీన మొగల్ చరిత్ర కారుడు అబ్దుల్ కాదిర్ బదయూనీ ఎటువంటి సంకోచం లేకుండా మేవాడ్ సేనల తొలి దాడులలో మొగల్ సేనలు అస్తవ్యస్తం అయిపోయి, పారిపోయి, బనాస్ నది వరకూ వెనక్కి తగ్గాయని అంగీకరించాడు. రామప్రసాద్‌ను తీసుకుని అక్బర్ వద్దకు వెళ్తున్నప్పుడు ప్రజల మనస్సుల్లో ఉన్న భావనల గురించి రాస్తూ, 'మొగల్ సేనల విజయాన్ని ప్రజలు విశ్వసించడం లేదు. మేవాడ్ ప్రజలు అయితే అక్బర్ సేనలను అపహాస్యం చేస్తూ, వారిపై మట్టిగడ్డలు విసిరికొట్టడం ప్రారంభించారు, అయితే సేనలు ప్రతిఘటించకుండా అజ్మీర్ వైపు వెళ్లాయ'ని బదయూనీ రాశాడు. విజయం మహారాణా ప్రతాప్‌దే అని జనాభిప్రాయమని అనేందుకు పై ఘటనలే ప్రమాణాలు.

అనంతరం, యానల్స్ అండ్ యాంటిక్విటీస్ ఆఫ్ రాజస్థాన్‌ను రచించిన ఆంగ్లేయ చరిత్రకారుడు కర్నల్ జేమ్స్ టాడ్, హల్దీఘాటీ యుద్ధాన్ని రాజస్థాన్ థర్మోపైలే అని పేర్కొన్నాడు. ఆయన ప్రకారం ఇక్కడ యుద్ధం కేవలం సేనల మధ్య సంఘర్షణ కాదు, అది ఆర్య గౌరవానికి, స్వాతంత్ర్యానికి, రాజపుత్రుల ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచిన ఒక గొప్ప పండుగ. రక్తరంజితమైన హల్దీఘాటీ భూమిపై మేవాడ్ వీరులు తమ ప్రాణాలను త్యాగంచేసి, స్వాభిమానాన్ని రక్షించుకోవడం కోసం ప్రాణత్యాగం కూడా గర్వకారణమనే సందేశాన్ని ఇచ్చారు.

**చరిత్రకారుల అభిప్రాయం**

రాజస్థాన్ చరిత్రలో అత్యంత విద్వాంసుడు అయిన చరిత్రకారుడు గౌరీశంకర్ హీరాచంద్ ఓఝూ తన పుస్తకంలో ఉదయపూర్ రాజ్య చరిత్ర, హిందూ, ముస్లింలకు మధ్య జరిగిన యుద్ధంలో ముస్లిం పక్ష వర్ణణలు ఏకపక్షంగా ఉంటాయని, అయినప్పటికీ ముస్లింల కథనం నుంచే మొగల్ సేనలకు ఎంత దుర్దశ ప్రాప్తించిందో తెలుస్తుందని తొలి సంపుటిలోని 442వ పేజీలో పేర్కొన్నాడు. మహారాణా ప్రతాప్ సింగ్ తిరిగి వస్తున్నప్పుడు కూడా ఆ సేనల పరిస్థితి మళ్లీ వచ్చేలా కూడాలేదు. అలాగే, ఆ సేనల భయం ఎంతగా ఉందంటే, కలలో కూడా మహారాణా ప్రతాప్ తమను చంపడానికి పొంచి ఉన్నాడని భావించేవారు. రెండు రోజుల తర్వాత, అంటే జూన్ 21న మొగల్ సేనలు గోగుందా చేరుకున్నప్పుడు కూడా, మహారాణా ప్రతాప్ వచ్చి తమపై ఎక్కడ విరుచుకుపడతాడో అని ఆ గ్రామం నాలుగు దిక్కులా కందకాలు తవ్వించి, గుర్రాలు దాటలేని స్థాయిలో ఎత్తైన గోడలను నిర్మింపచేసి, గ్రామంలోని ప్రతి వీధిలోనూ తాత్కాలిక అడ్డుకట్టలను వేశారు. మొగల్ సేనలు గోగుందాలో ఖైదీలలాగా హద్దులలోనే ఉండి, చివరికి వరకూ వెళ్లలేకపోయారు. దీనివల్ల వారికి మరింత దుర్దశ దాపురించింది. ఈ విషయాలన్నింటినీ పరిశీలించినప్పుడు, యుద్ధంలో ప్రతాపసింహుడిదే విజయమని అంగీకరించవలసి వస్తుంది.



# విజయగాథ



ఆధునిక చరిత్రకారులలో ఒకరైన డా॥ దేవ్ కొఠారీ తన మహారాణా ప్రతాప్, అతడి యుగం (మహారాణా ప్రతాప్ ఔర్ ఉన్‌కా యుగ్) అన్న పుస్తకంలోని 13వ పేజీలో యుద్ధపు వాస్తవిక ముగింపు గోగుందాలో జరిగిందంటాడు. 'ఇక్కడ మొగల్ సేనలు లాజిస్టిక్స్ లోటుతో, భయం, వైఫల్యంతో పోరాటం చేస్తూ ఉన్నారం'టూ వివరించారు. వారు మహారాణా ప్రతాప్‌ను బంధించలేకపోయారు, మేవాడ్‌ను శాశ్వతంగా కైవసం చేసుకొని తమ ఆధిపత్యాన్ని, అధికారాన్ని స్థాపించలేకపోయారు. యుద్ధ లక్ష్యం ప్రతాపుడిని ఓడించి, మేవాడ్‌ను మొగల్ సామ్రాజ్యంలో కలుపుకోవడమే అయితే, ఆ లక్ష్యం పూర్తిగా విఫలమైంది.

మరొక చరిత్రకారుడు డా॥ దేవీలాల్ పాలీవాల్ రచించిన మహారాణా ప్రతాప్ మహాన్ (మహారాణా ప్రతాప్ ది గ్రేట్) 43వ పేజీలో, తనకు చెందిన అనేకమంది యోధులను కోల్పోయినప్పటికీ, ప్రతాప్, అతడి సేనలు అపరాజితులుగా సురక్షితమైన కొండలకు తిరిగి వెళ్లారని, మాన్‌సింగ్ వారిని వెంబడించలేక పోయాడని రాశారు. నిజానికి, మొగల్ సేనలకు దుర్దశ పట్టిన గోగుందాలో ఈ యుద్ధం ముగిసింది. వారు అక్కడ విఫలమై తిరిగి వెళ్లవలసి వచ్చింది. ఈ యుద్ధం 18 జూన్ ఖమణోర్ మైదానంలో ప్రారంభమై, సెప్టెంబరులో మొగలు సేనలు విఫలమై వెనుదిరిగిన గోగుందాలో అంతమైంది.

'బహుఆయామీ రాష్ట్రనాయక్ ప్రతాప్' (బహుముఖ జాతీయ నాయకుడు ప్రతాప్) అన్న పుస్తకంలో డా॥ ఎన్.ఎం.మాథుర్, డా॥ కె.ఎస్ గుప్తా, సజ్జన్‌సింగ్ రాణావత్ కూడా ఈ విషయాన్ని నిర్ధారించారు. హల్దీఘాటీ యుద్ధంలో మొగలులు ఊహించని ఓటమిని చవిచూడవలసి వచ్చింది. ఈ యుద్ధంలో మహారాణా ప్రతాప్ విజయం, భారతీయ దిగంతంలో మొగలులు అజేయులనే భ్రమను ధ్వంసం చేసింది. ఈ యుద్ధంలో లభించిన సఫలత కారణంగా ప్రతాపుడి నాయకత్వంపై ప్రజల విశ్వాసం మరింత బలపడేలా చేసింది.

ప్రొ. ఆర్.పి.వ్యాస్ రచించిన మహారాణా ప్రతాప్ 135 పేజీలో, మొగలులకు ఈ యుద్ధం అసఫలంగా మిగిలిపోయింది. యుద్ధమైన తర్వాత మహారాణాను వెంబడించలేకపోయారు, మేవాడ్‌ను మొగల్ సామ్రాజ్య అంగంగా చేసుకోలేకపోయారు. కొద్దికాలంపాటు మొగలులు ఏ ప్రాంతాన్ని అయితే అధీనం చేసుకున్నాయో, అది నిర్జనమైన, నిస్సారమైన, రాళ్లతో కూడిన ప్రాంతం. దీనివల్ల మొగలులకు లేశమైనా లాభం కలుగలేదు. హల్దీఘాటీ యుద్ధం లేదా దోపిడీ పేరుతో మాన్‌సింగ్‌కు లభించింది మహారాణా ప్రతాప్‌కు చెందిన ప్రసిద్ధ ఏనుగు రామప్రసాద్ మాత్రమే. ఈ యుద్ధంలో మొగలుల వైఫల్యం కారణంగా, మొగలు సేనలు అజేయమైనవనే భ్రమలు పటాపంచలైపోయాయి.

**ఇతర వాస్తవాలు కొన్ని**

చరిత్రకారుల ద్వారా ప్రతాప్ తప్పించుకోవడాన్నే ఓటమిగా పేర్కొన్నారని ప్రతాపుడిపై శోధిస్తున్న సమయంలో రచయిత తెలుసుకున్నారు. వ్యూహాత్మకంగా చేస్తే తప్ప తప్పించుకోవడం పరాజయం అనలేం. వాస్తవానికి హల్దీఘాటీ యుద్ధంలోని రెండవ చరణం గోగుందాలో జరిగింది. యుద్ధం హల్దీఘాటీ యుద్ధభూమిలో సమాప్తం కాలేదు, కొనసాగుతూనే ఉంది. ప్రతాపుడు గోగుందాలో మొగల్ సేనలను ఎంతటి దుస్థితికి తెచ్చాడంటే, అవి విజయం సాధించిన సేనలలా కాకుండా పరాజయం పొందిన వాటిలా వ్యవహరించాయి.

ఖమణోర్‌లో మొగల్ సేనలు ఓటమిని ఎదుర్కోవలసి వచ్చిందని నిర్ద్వంద్వంగా చెప్పవచ్చని కేసరీ సింగ్ తన పుస్తకంలో పేర్కొన్నారు. దండయాత్రకు వచ్చిన సేనను ఖమణోర్‌లో ప్రతాపుడు ఓడించాడు. ఈ యుద్ధంలో ప్రతాపుడు తన శత్రువుల మనసులో పుట్టించిన భయానికి వారి మనోబలం సడలిపోయింది. ఈ యుద్ధం కారణంగా, ప్రతాపుడి పేరు, కీర్తి దేశంలోని దూరప్రాంతాలకు కూడా వ్యాపించింది. మహారాణా ప్రతాపుడు స్వాతంత్ర్యం కోసం నిర్భీతితో పోరాడిన తీరుకు దేశ ప్రజలలో ఆయన పట్ల గౌరవం పెరిగిపోవడమే కాదు, అతడి రాజ్యంలో స్వాతంత్ర్యతా భావనలు ప్రబలంగా వృద్ధి చెందాయి.

మొగల్ సేనల విజయాన్ని అంగీకరించలేకపోవడానికి కారణం, వారు పెట్టుకున్న లక్ష్యాలలో ఒక్కదానిని కూడా వారు సాధించలేకపోవడమేనని తన పరిశోధనలో రచయిత స్పష్టం చేశారు. అందుకే, మాన్‌సింగ్, ఆసఫ్‌ఖాన్‌లకు దర్బారులోకి రాకను నిషేధించి, అక్బర్ తన అసంతుష్టిని వ్యక్తం చేశాడు. తర్వాత అదే ఏడాది అక్బరే స్వయంగా సేనలను తీసుకుని, మేవాడ్‌పై విజయం కోసం బయలుదేరవలసి వచ్చింది. ఒకవేళ మేవాడ్‌ను గెలుచుకుని ఉంటే, అక్కడ ఇంకా గెలవడానికి ఏముందన్నది ప్రశ్న. ఇది ఆలోచించవలసిన ప్రశ్న. మొగల్ సేనలు గోగుందాలో తమ అధికారాన్ని నిలుపుకోలేకపోయాయి. ఈ ప్రాంతాలలో ప్రతాపుడిని నిలువరించలేకపోయారు.

అందుబాటులో ఉన్న చారిత్రిక వాస్తవాలు, సమకాలీన వివరణలు, చరిత్ర కారుల సమ్మిళిత దృష్టి నుంచి హల్దీఘాటీ యుద్ధంలో వాస్తవిక విజయం మహారాణా ప్రతాపుడిదే అని స్పష్టమవుతోంది. ఈ విజయం కేవలం యుద్ధభూమిలో విజయమే కాదు, భారతీయ ఆత్మగౌరవం, స్వతంత్రత, జాతీయ చైతన్యపు విజయం.

భారతభూమిపై స్వాతంత్ర్యం, స్వాభిమానం గురించి ఎప్పుడెప్పుడు చర్చ జరిగినా, హల్దీఘాటీ పుణ్యభూమి, మహారాణా ప్రతాపుడి శాశ్వత కీర్తి, పేరును సువర్ణాక్షరాలతో గుర్తుచేసుకుంటారు.

**– డా॥ మనీష్ శ్రీమాలీ,**
**అసిస్టెంట్ ప్రొఫెసర్ (చరిత్ర), మోహన్‌లాల్ సుఖాడియా విశ్వవిద్యాలయం, ఉదయ్‌పూర్**

# బాల జాగృతి



## నిజాయతీ చెప్పిన పాఠం | కథ



ఒక చిన్న పట్టణంలో రాహుల్ అనే బాలుడు ఉండేవాడు. అతనికి క్రికెట్ ఆడటం, స్నేహితులతో సరదాగా గడపడం చాలా ఇష్టం. చదువులో కూడా ముందుండేవాడు.కానీ ఏదైనా తప్పు చేసినప్పుడు నిజం చెప్పడానికి భయపడేవాడు.

ఒకరోజు రాహుల్ తన స్నేహితులతో కలిసి క్రికెట్ ఆడుతున్నాడు. ఆటలో బలంగా కొట్టిన బంతి..పక్కనే ఉన్న ఒక ఇంటి కిటికీకి తగిలింది. కిటికీ అద్దం పగిలిపోయింది.

అందరూ ఒక్కసారిగా భయపడ్డారు. "ఇప్పుడు ఏం చేద్దాం?" అని ఒక స్నేహితుడు అడిగాడు.

రాహుల్ కొద్దిసేపు ఆలోచించి, "ఎవరూ చూడలేదు కదా... మనం ఏమీ చేయలేదని చెప్పేద్దాం" అన్నాడు.

అందరూ అక్కడి నుంచి వెళ్లిపోయారు. కానీ ఇంటికి వెళ్లిన తర్వాత రాహుల్‌కు మనసులో ఏదో బాధగా అనిపించింది. అమ్మ అడిగినా సరిగ్గా మాట్లాడలేకపోయాడు. రాత్రి నిద్రపోతున్నప్పుడు కూడా అదే విషయం గుర్తొచ్చింది. మరుసటి రోజు ఉదయం రాహుల్ తన స్నేహితులతో కలిసి ఆ ఇంటి దగ్గరకు వెళ్లాడు. అక్కడ ఇంటి యజమాని పగిలిన కిటికీని చూస్తూ బాధపడుతున్నాడు.

రాహుల్ కొద్దిసేపు నిశ్శబ్దంగా నిలబడ్డాడు. చివరికి ధైర్యం తెచ్చుకుని ముందుకు వెళ్లాడు. "అంకుల్... నిన్న కిటికీ అద్దం పగిలింది.అది మా క్రికెట్ బంతి వల్లే జరిగింది. నేను భయపడి నిన్న నిజం చెప్పలేదు. నన్ను క్షమించండి" అని చెప్పాడు. ఆయన రాహుల్ వైపు చూసి, "తప్పు చేయడం కంటే, చేసిన తప్పును దాచడం పెద్ద సమస్య. నువ్వు నిజం చెప్పడానికి ధైర్యం చేసినందుకు సంతోషంగా ఉంది" అన్నాడు.

రాహుల్‌కు మనసు చాలా తేలికగా అనిపించింది. తప్పు చేసినప్పుడు తప్పించుకోకూడదని, నిజాయతీగా ఒప్పుకోవాలని ఆ రోజు నుంచి అతను నిర్ణయించుకున్నాడు. ★

### మంచిమాట

సమయాన్ని సరిగ్గా
ఉపయోగించుకోవడం
విజయానికి మొదటి అడుగు.



### మెదడుకు మేత



తలపై కిరీటం,
ఒంటినిండా ముళ్లు..
ఏమిటది?

జవాబు : పైనాపిల్

### పద్యం



ఉత్తమ గుణములు నీచున
కెత్తెరగున గలుగనేర్చు? నెయ్యెడలం దా
నెత్తిచ్చి కరగ బోసిన
నిత్తడి బంగారమగునె యిలలో సుమతీ!

భావం : గొప్పవారికి మంచి గుణాలు సహజంగానే అలవడతాయి. నీచులు ఎంత ప్రయత్నించినా ఆ గుణాలు వారికి అలవడవు. ఇత్తడి గొప్పదని భావించి, విలువ ఏర్పడేలా చేయాలనే తలంపుతో దానిని కరిగించి అచ్చుగా పోసినా అది బంగారం కాలేదు.

### శ్లోకం



నాస్తి విద్యా సమో బంధుః
నాస్తి విద్యా సమో సుహృత్।
నాస్తి విద్యా సమం విత్తం
నాస్తి విద్యా సమం సుఖం॥

భావం : విద్యతో సరితూగగల బంధువు లేదు. విద్యతో సమానమైన స్నేహితుడు లేదు. విద్యతో సమానమైన ధనమూ లేదు. విద్యతో సరితూగ గల సుఖం లేదు.

### జతపరచండి

ఇక్కడున్న పదాలకు పక్కనున్న పదాల్లో ఏవి సరిపోతాయో కనుక్కోండి.

| | |
|---|---|
| తేనెటీగ | ఎడారి |
| ఒంటె | మకరందం |
| ధ్రువ ఎలుగుబంటి | నీరు |
| చేప | చెట్లు |
| కోతి | మంచు ప్రాంతం |

జవాబులు : తేనెటీగ–మకరందం, ఒంటె–ఎడారి, ధ్రువ ఎలుగుబంటి–మంచు ప్రాంతం, చేప–నీరు, కోతి–చెట్లు.

## శాస్త్రవేత్తలు

### డా. గోవింద్ స్వరూప్



**19**29లో ఉత్తరప్రదేశ్‌లో జన్మించిన డాక్టర్ గోవింద్ స్వరూప్ ప్రముఖ భారతీయ ఖగోళ శాస్త్రవేత్త. దేశంలో రేడియో ఖగోళ రంగాన్ని అభివృద్ధి చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఆయన నాయకత్వంలో తమిళనాడులో ఊటీ రేడియో టెలిస్కోప్, పుణె సమీపంలో 'జెయింట్‌మీటర్‌వేవ్ రేడియో టెలిస్కోప్ (Giant Metrewave Radio Telescope–GMRT) నిర్మితమయ్యాయి. వీటి ద్వారా అంతరిక్షంలోని దూరమైన రేడియో వనరులను (Radio sources) అధ్యయనం చేయడానికి ప్రపంచస్థాయి పరిశోధనా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఆయన కృషికి గుర్తింపుగా శాంతి స్వరూప్ భట్నాగర్, పద్మశ్రీ పురస్కారాలు లభించాయి.

## జనరల్ నాలెడ్జ్

1. 'మైసూర్ ప్యాలెస్' ఏ రాష్ట్రంలో ఉంది?
2. ఒలింపిక్ క్రీడలు ప్రారంభమైన దేశం ఏది?
3. ఏ పక్షి వెనక్కి కూడా ఎగరగలదు?

సమాధానాలు : 1. కర్ణాటక, 2. గ్రీస్, 3. హమ్మింగ్‌బర్డ్

## భక్తాగ్రేసరులు

### తూము లక్ష్మీనరసింహదాసు



నేటి ఉమ్మడి గుంటూరు జిల్లా పొన్నూరులో సా.శ.1790లో తూము అప్పయ్య, వేంకమాంబ దంపతులకు లక్ష్మీనరసింహదాసు జన్మించారు. తండ్రి మరణానంతరం కుటుంబపోషణ నిమిత్తం పేష్కారు ఉద్యోగంలో చేరారు. అయితే చిన్నతనం నుంచి రామభక్తి పాదుకుపోయిన తనకు, ఆ ఉద్యోగం రాముని సేవకు అడ్డుగా భావించి దానిని వదిలేశారు. సద్గురువును ఆశ్రయించి తారక మంత్రోపదేశం పొంది, స్వగృహంలో సీతారాములను ప్రతిష్ఠించుకొని భక్తి శతకాలు, కీర్తనలు రాశారు. కాశీ నుంచి కన్యాకుమారి వరకు తీర్థయాత్రల్లో నిమగ్నమైనా, ఏటా శ్రీరామనవమి కల్యాణానికి భద్రాద్రి చేరేవారు. ఆ క్షేత్రంలో రాముని కైంకర్యాలు సజావుగా సాగేందుకు నరసింహదాసును నాటి హైదరాబాద్ రాజ్యంలో మంత్రి చందూలాల్ పాలనాధికారిగా నియమించారు. 'రాజా' బిరుదును ప్రదానం చేస్తూ రాజశాసనం చేయించారు. ఆయనకు కనకాభిషేకం చేశారు.




# వారఫలాలు

05-11 అక్టోబర్ 2026

**మేషం : అశ్విని, భరణి, కృత్తిక 1వ పాదం**

ఆర్థిక వ్యవహారాలలో ఆశించిన పురోగతి ఉంటుంది. వివాహయత్నాలు ముమ్మరం చేస్తారు. తరచూ దైవదర్శనాలు చేసుకుంటారు. వ్యాపారులు గతం కంటే మెరుగైన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులు కీలక మార్పులు పొందుతారు. రాజకీయ, పారిశ్రామికవేత్తలు ఇబ్బందుల నుండి బయట పడతారు. వైద్యులు, క్రీడాకారులకు శుభవార్తా శ్రవణం. 6,7 తేదీల్లో దూరప్రయాణాలు. కుటుంబంలో సమస్యలు. అంగారక స్తోత్రం పఠించండి.

**వృషభం : కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి, మృగశిర 1,2 పాదాలు**

నిరుద్యోగులకు అనుకోని అవకాశాలు దక్కవచ్చు. వ్యాపారులకు కొత్త పెట్టుబడులు సమకూరతాయి. కొత్త భాగస్వాములు మీతో కలుస్తారు. ఉద్యోగవర్గాలకు విధి నిర్వహణలో అవాంతరాలు తొలగుతాయి. రాజకీయవేత్తలకు అనుకూల పరిస్థితులు నెలకొంటాయి. రచయితలు, వైద్యులకు మరింత సానుకూలమైన సమయం. 8.9 తేదీల్లో వృథా ఖర్చులు. బంధువులతో తగాదాలు. ఆంజనేయస్వామి అర్చన మంచిది.

**మిథునం : మృగశిర 3, 4 పాదాలు, ఆర్ద్ర, పునర్వసు 1, 2, 3 పాదాలు**

ఆదాయం పెరిగినా ఖర్చులు కూడా తప్పకపోవచ్చు. ఆప్తులతో ఉత్తరప్రత్యుత్తరాలు సాగిస్తారు. భూములు, ఆభరణాలు సమకూర్చుకుంటారు. వ్యాపారులు అనుకున్న లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు ఒక సమాచారం ఊరటనిస్తుంది. పారిశ్రామికవర్గాలకు విదేశీ పర్యటనల్లో మార్పులు. కళాకారులు, క్రీడాకారులకు ఒత్తిడులు. 7,8 తేదీల్లో శుభవార్తలు. వాహనయోగం. దత్తస్తోత్రాలు పఠించండి.

**కర్కాటకం: పునర్వసు 4వ పాదం, పుష్యమి, ఆశ్లేష**

వాహనాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు. ఉద్యోగయత్నాలలో పురోగతి సాధిస్తారు. దేవాలయాలు సందర్శిస్తారు. వ్యాపారులు పెట్టుబడులకు తగినంతగా లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు కొద్దిపాటి ఇంక్రిమెంట్లు ఉత్సాహాన్నిస్తాయి. రాజకీయవేత్తలు పదవుల అన్వేషణలో సఫలం చెందుతారు. రచయితలు, క్రీడాకారులకు ఆహ్వానాలు రాగలవు. 10,11 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. బంధు విరోధాలు. శ్రీరామరక్షా స్తోత్రం పఠించండి.

**సింహం : మఖ, పుబ్బ, ఉత్తర 1వ పాదం**

స్థిరాస్తి వివాదాల పరిష్కారంలో కొంత సఫలం. వ్యాపారులు పెట్టుబడులు సమకూర్చుకుని వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. ఉద్యోగులకు ఆకస్మికమార్పులు సంభవం. కళాకారులు ఊహించని అవకాశాలు దక్కించుకుంటారు. రచయితలు, వ్యవసాయదారులకు కొత్త ఆశలు చిగురిస్తాయి. 6,7 తేదీల్లో చర్చల్లో ప్రతిష్ఠంభన, ఆప్తులతో విభేదాలు. విష్ణుసహస్రనామ పారాయణ చేయండి.

**కన్య : ఉత్తర 2, 3, 4 పాదాలు, హస్త, చిత్త 1,2 పాదాలు**

పలుకుబడి పెరుగుతుంది. ఆరోగ్య సమస్యలు కొంత చికాకుపరుస్తాయి. ఇంటి నిర్మాణాలలో కొంత ప్రగతి కనిపిస్తుంది. వ్యాపారులు క్రమేపీ లాభాలబాట పడతారు. ఉద్యోగులకు హోదాలు అనుకోని విధంగా దక్కవచ్చు. రాజకీయవేత్తలు సత్తాచాటుకునే సమయం. కళాకారులు, వైద్యులకు ఒత్తిడులు తొలగుతాయి. 7,8 తేదీల్లో ఆరోగ్య సమస్యలు. శ్రమ తప్పదు. శివాష్టకం పఠించండి.

**తుల : చిత్త 3,4 పాదాలు, స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు**

కొన్ని కీలక నిర్ణయాలలో కుటుంబసభ్యులను సంప్రదిస్తారు. దైవ కార్యక్రమాలు చేపడతారు. గృహ నిర్మాణ యత్నాలు అనుకూలిస్తాయి. వ్యాపారులు ఆశించిన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు కొంత అనుకూల స్థితి. పారిశ్రామికవేత్తలకు పురస్కారాలు. కళాకారులు, వైద్యులకు సుదీర్ఘ నిరీక్షణ ఫలిస్తుంది. 9,10 తేదీలలో దుబారా ఖర్చులు. స్వల్ప అస్వస్థత. గణేశాష్టకం పఠించండి.

**వృశ్చికం : విశాఖ 4వ పాదం, అనూరాధ, జ్యేష్ఠ**

ఇంట్లో శుభకార్యాలు నిర్వహిస్తారు. గృహ నిర్మాణాలు లేదా కొనుగోలులో స్వల్ప అవాంతరాలు. వ్యాపారులు అనుకున్న లాభాలవైపు సాగుతారు. ఉద్యోగులకు ఉన్నత హోదాలు వచ్చే వీలుంది. రాజకీయవేత్తలు మరింత ప్రజాదరణ పొందుతారు. క్రీడాకారులు, పరిశోధకులకు పట్టింది బంగారమే. 5,6 తేదీల్లో కుటుంబంలో ఒత్తిడులు. మానసిక అశాంతి. సుబ్రహ్మణ్యాష్టకం పఠించండి.

**ధనుస్సు : మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదం**

సమాజంలో మీకంటూ ప్రత్యేక గౌరవం




సింహంభట్ల సుబ్బారావు

6300674054


పొందుతారు. ప్రత్యర్థులు స్నేహితులుగా మారి చేయూతనందిస్తారు. వ్యాపారులు తమ అనుభవాలతో విస్తరణ యత్నాలు పూర్తి చేస్తారు. పారిశ్రామిక వేత్తలు అనూహ్యమైన విజయాలు సాధిస్తారు. కళాకారులు, రచయితలకు శుభవార్తలు. 6,7 తేదీల్లో స్వల్ప రుగ్మతలు. ఆకస్మిక ప్రయాణాలు. హయగ్రీవ స్తోత్రాలు పఠించండి.

**మకరం : ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు**

చేపట్టిన కార్యక్రమాలు విజయవంతంగా సాగుతాయి. నూతన విద్యావకాశాలు దక్కుతాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారులకు స్వల్ప లాభాలు అందే అవకాశాలు. ఉద్యోగులకు ఎట్టకేలకు సమస్యలు తీరతాయి. పారిశ్రామికవేత్తలకు విదేశీ పర్యటనలు. కళాకారులు, క్రీడాకారులకు అవకాశాలు ఊహించని రీతిలో లభిస్తాయి. 9,10 తేదీలలో లేనిపోని ఖర్చులు. సూర్యారాధన మంచిది.

**కుంభం : ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం, పూర్వాభాద్ర 1,2,3 పాదాలు**

ఆస్తి వివాదాల నుంచి ఊరట. నిరుద్యోగులకు ఉద్యోగ లాభాలు ఉండవచ్చు. ఆరోగ్యం కొంత మెరుగు. వ్యాపారులకు ఆశించిన విధంగా లాభాలు. ఉద్యోగులకు విధులు సాఫీగా కొనసాగుతాయి. రాజకీయవేత్తలకు సంతోషకరమైన సమాచారం రావచ్చు. క్రీడాకారులు, వ్యవసాయదారులు కొన్ని ప్రయోజనాలు పొందుతారు. 10,11 తేదీల్లో బంధు విరోధాలు. నవగ్రహస్తోత్రాలు పఠించండి.

**మీనం : పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర, రేవతి**

అదనపు ఆదాయంతో మరింత ఉత్సాహంగా సాగుతారు. నిరుద్యోగులకు ఒక ప్రకటన వరంగా మారనుంది. వ్యాపారులు గతం కంటే మెరుగైన లాభాలు అందుకుంటారు. ఉద్యోగులకు విధి నిర్వహణ ప్రశాంతంగా సాగిపోతుంది. కళాకారులకు పురస్కారాలు లభిస్తాయి. పారిశ్రామికవేత్తలు, రచయితలు ఊహించని ఆహ్వానాలు అందుకుంటారు. 5,6 తేదీల్లో అనుకోని ప్రయాణాలు. కుటుంబంలో ఒత్తిడులు. శివపంచాక్షరి పఠనం ఉత్తమం.

# పదరసం-584

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | | ■ | 4 | 5 | ■ | 6 | |
| ■ | 7 | | ■ | 8 | ■ | 9 | 10 | | ■ |
| 11 | ■ | | ■ | 12 | | ■ | | ■ | 13 |
| | ■ | 14 | 15 | | ■ | 16 | | 17 | |
| 18 | 19 | ■ | | ■ | 20 | | ■ | 21 | |
| 22 | | | ■ | 23 | | | | ■ | |
| ■ | | ■ | 24 | | ■ | | ■ | 25 | ■ |
| 26 | ■ | 27 | | | 28 | ■ | 29 | | ■ |
| 30 | | ■ | | ■ | 31 | | | ■ | 32 |
| | ■ | 33 | | | | ■ | 34 | | |

## ఆధారాలు

**అడ్డం**

1. సగటు (4)
4. నుసి, ముక్క (2)
6. లవణం (2)
7. పుష్పం (2)
9. మయూరం (3)
12. రుధిరం (2)
14. నీరు, పాలను వేరుచేసే పక్షి (3)
16. గోక్షీరమే (4)
18. అరణ్యం (2)
20. స్వప్నం (2)
21. సందేహం (2)
22. చుక్కలు, నక్షత్రాలు (3)
23. ముని చేతిలోని తీర్థపాత్ర చెల్లాచెదరు (4)
24. కుడ్యం (2)
27. వచ్చే ఏడాది పుష్కరాలు జరిగే నది (4)
29. బాణం (2)
30. మంగళసూత్రం (2)
31. ఆదికవి (3)
33. శ్రీనాథుడి మరో బిరుదు (4)
34. కుశుడి సోదరుడు (3)

**నిలువు**

2. అశ్వత్థ వృక్షం (2)
3. సప్తస్వరాలలో మొదటి నాలుగు (4)
5. గెలుపు, విజయం..కింద నుంచి (2)
6. శిలను చెక్కే సాధనం (2)
8. హాలాహలం, విషం (3)
10. మకరందం, తేనె (3)
11. న్యాయమూర్తి (4)
13. రుచి చేప్పేది..బహువచనంలో (4)
15. పాషాణం (2)
16. ఆవుల గుంపు (4)
17. రజ్జు, తాడు (2)
19. నిజానికి వికృతి (3)
20. కొన, చివరి (2)
23. కుంభం (3)
24. శ్రీరంగనాథుని దేవేరి (4)
25. భూమి (2)
26. ధ్వజం, జెండా (3)
28. అలవాటు, ఆనవాయితీ (3)
29. పికం (3)
32. ప్రాయం, వయసు (2)

## పదరసం - 583 సమాధానాలు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 మా | ■ | 2 దా | దా | 3 పు | ■ | 4 ఏ | 5 క | వీ | 6 ర |
| 7 వి | 8 వా | హం | ■ | 9 నీ | డ | ■ | ప్ప | ■ | హ |
| ■ | ర్త | ■ | 10 పం | తం | ■ | 11 తే | ■ | 12 వ | స్యం |
| 13 అ | ■ | 14 ము | క్తి | ■ | 15 పీ | లు | ■ | గ | ■ |
| సం | ■ | ద్ద | ■ | 16 బా | వ | ■ | 17 పా | వు | 18 రం |
| 19 భ | ద్ర | ■ | 20 జ | ని | న | ■ | వ | ■ | భ |
| వం | ■ | 21 ప | న | స | ■ | 22 వ | ని | 23 త | ■ |
| ■ | 24 బు | గ | త | ■ | 25 వా | లి | ■ | 26 ల | 27 క్ష |
| 28 సె | ■ | వా | ■ | 29 తం | హి | ■ | 30 ఉ | ■ | త |
| 31 గ | రు | డు | డు | ■ | 32 ని | గ | ర్వి | ■ | ము |

# రుధిరంతో తడిసిన




సినిమా

**పక్కింటి కుర్రాడిని తలపించే పాత్రలతో కథానాయకుడిగా పద్దెనిమిదేళ్ల క్రితం 'అష్టా చమ్మా'తో చిత్రసీమలోకి అడుగుపెట్టిన నాని 'నేచురల్ స్టార్' అనిపించుకున్నాడు. తన సినిమాలను కుటుంబమంతా కలిసి చూడొచ్చనే భరోసాను కల్పించాడు. అయితే పాన్ ఇండియా స్థాయిలో మాస్ హీరో అనిపించుకోవాలనే ఆరాటంతో గత కొంతకాలంగా నాని ఫ్యామిలీ ఆడియెన్స్‌కు దూరమౌతూ వచ్చాడు. ఆ దూరాన్ని అతని తాజా చిత్రం 'ది ప్యారడైజ్' మరింత పెంచింది.**

కొన్నేళ్లుగా సహజమైన పాత్రలను పోషిస్తున్న నాని... అప్పుడప్పుడూ మాస్ క్యారెక్టర్స్ వైపు మొగ్గుతూ వచ్చాడు. అయితే తన కెరీర్‌ను బాలెన్స్ చేసుకుంటూ అన్ని వర్గాలను ఆకట్టుకునే ప్రయత్నం చేశాడు. కానీ 'దసరా', 'హిట్ 3' వంటి సినిమాలతో పూర్తి స్థాయిలో మాస్ హీరో అనిపించుకోవాలనుకున్నాడు. అలా సాగుతూ ఇప్పుడు 'ద ప్యారడైజ్' మూవీ చేశాడు. ఇంతకూ దీని కథేమిటంటే... రెండు మూడు తరాలుగా ఏడెనిమిది వేల కిలోమీటర్లు ప్రయాణం చేసిన సవారీలు అనే జాతి... చివరకు హైదరాబాద్ శివార్లలో స్థిరపడుతుంది. దేశానికి స్వాతంత్య్రం వచ్చి మూడున్నర దశాబ్దాలు గడిచినా వారికి ఎలాంటి గుర్తింపు దక్కదు. వారందరినీ శిఖంజీ మాలిక్ (మోహన్ బాబు) బానిసలుగా చేసుకుని, దొంగసారా కాయిస్తుంటాడు. తమ జాతి ఉనికి కోసం పోరాటం చేసే సమ్మక్క (సోనాలీ కులకర్ణి)ని శిఖంజీ మాలిక్ చిత్రహింసలకు గురిచేస్తాడు. ఆమెకు పుట్టిన వాడే 'జడల్'. అతనితో పుట్టిన మరో పాప శిఖంజీ అరాచకం కారణంగా పురిటిలోనే కన్నుమూస్తుంది. అందుకే ఆ చనిపోయిన బిడ్డ యాదిగా తల్లి కొడుక్కి జడలు వేసి పెంచుతుంది. చిన్నప్పుడు ఓ హత్య చేసి, పద్నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవించి వచ్చిన జడల్‌కు తమ జాతి దుస్థితి తెలుస్తుంది. తల్లి ప్రవర్తనను తప్పుగా అర్థం చేసుకుని ఆమె మీద ఆగ్రహంతో ఉన్న అతనికి వాస్తవం తెలిసి, తాను పోరాడాల్సింది శిఖంజీ మాలిక్‌తో అని గుర్తిస్తాడు. అక్కడ నుంచి తల్లితో చేతులు కలిపి, తన వారి కోసం ఎలాంటి పోరాటం చేశాడు? అందులో అతనికి సాయం చేసిన రాజకీయ నేతలు ఎవరు? అనేదే 'ది ప్యారడైజ్' కథ.

ప్రధానంగా ఇది అణగారిన వర్గాలకు సంబంధించిన అస్తిత్వ పోరాట గాథ. సమాజంలో గుర్తింపు కోసం ఓ ఐదువేలమంది చేసే ఆర్తనాదం. అయితే దర్శకుడు శ్రీకాంత్ ఓదెల దీనిని హింసాత్మకంగా తెరమీదకు తీసుకురావడంతో ప్రధానాంశంలోని సున్నితత్త్వం మరుగున పడిపోయింది. దేశానికి స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడిచిన తర్వాత కూడా గిరిజన ప్రాంతాల్లోని కొన్ని వర్గాలు గుర్తింపుకు నోచుకోలేదన్నది వాస్తవం. అయితే ఈ తెగను హైదరాబాద్ శివార్లలో ఉండే వారిగా చూపించారు. అందులోనూ తప్పులేదు. కానీ ఓ వ్యక్తి, అతని గుండాల అధీనంలో ఐదు వేల మంది జీవితాన్ని గడుపుతున్నట్టు చూపించడమే చాలామందికి మింగుడుపడని అంశం. కానీ అదే వర్గానికి చెందిన కథానాయకుడు జైలు శిక్షకూడా అనుభవిస్తాడు. అక్కడి వాళ్లంతా మోటారు వాహనాల్లో తిరిగేస్తుంటారు. కానీ కొన్ని సన్నివేశాల్లో వాళ్లంతా కూడుకు, గుడ్డకు నోచుకోని వారిగా, బెల్లం నీళ్లతో జీవితం గడిపేవారిగా దర్శకుడు చూపించాడు. సమక్క చేసే పోరాటంతో మొదలైన ఈ కథ మొదట్లో ఆసక్తికరంగానే సాగింది. కథానాయకుడి జననం, దానికి ముందు చూపించిన కొన్ని సన్నివేశాలు క్రూరత్వంతో పాటు జుగుప్సాకరమైనవే అయినా... సెంటిమెంట్ తగిన మోతాదులో ఉండటంతో సరిపెట్టుకోవచ్చు. హీరో రంగ ప్రవేశం చేసిన తర్వాత నుంచి అతను చేసే అరాచక, బీభత్స కాండను తట్టుకోవడం కష్టం నాని గత చిత్రం 'హిట్ 3'లోనూ ఈ తరహా హింస చోటు చేసుకుంది. అయితే... దాని మోతాదును సెన్సార్ వారు తగ్గించే ప్రయత్నం చేసినట్టు అనిపిస్తుంది. ఓటీటీలో ఆ సినిమా ఎలాంటి కట్స్ లేకుండా ప్రదర్శించినప్పుడు చాలామంది అదే విషయాన్ని చెప్పారు. ప్రథమార్థంలో తల్లిని తప్పుగా అర్థం చేసుకుని, ఆమెపై అక్కసును వెళ్లగక్కే పార్శ్వం ఒకటి అయితే, తప్పు తెలుసుకుని తల్లికి పోరాటంలో బాసటగా నిలిచే పార్శ్వం మరొకటి. అందులో మొదటిది బాగానే ఉంది. కానీ దర్శకుడు చెప్పాలనుకున్న విషయాన్ని స్పష్టంగా చెప్పలేకపోవడంతో రెండు పార్శ్వం సరిగా తెర మీద ప్రెజెంట్ కాలేదు. సాయుధ పోరాటం, ప్రత్యేక దేశం అంటూ ఎటెటో కథను తీసుకెళ్లిపోయాడు. దాంతో నానిది విచక్షణారహితంగా ఊచకోత కోసే పాత్రగా మిగిలిపోయింది.

జడల్ పాత్రలో నాని రెండు భిన్నమైన పార్శ్వాలున్న పాత్ర పోషించాడు. ఇక హీరోయిన్ పాత్ర గురించి ఎంత తక్కువ చెప్పుకుంటే అంత మంచిది. చాలామంది తిరస్కరించిన ఆ పాత్రను బహుశా ఇప్పుడిప్పుడే తెలుగులో అవకాశాలు వస్తున్నాయి కాబట్టి కయాదు లోహర్ అంగీకరించి నట్టుగా ఉంది. జడల్ తల్లిగా సోనాలి కులకర్ణి, ఆమె స్నేహితురాలుగా ఈశ్వరీరావ్ బాగా చేశారు. ఇటీవల వచ్చిన 'శ్రీనివాస మంగాపురం'తో పోల్చితే మోహన్‌బాబును ఇందులో బాగానే ఉపయోగించుకున్నారు. మోహన్ బాబు కొడుకుగా నటించిన రాఘవ్ జుయల్ తనదైన మేనరిజంతో మెప్పించాడు. తనికెళ్ల భరణి, సంపూర్ణేష్ బాబు, రాజా రవీంద్ర, దువ్వాసి మోహన్, సత్యరాజ్, సత్యప్రకాశ్ తదితరులను విభిన్నంగా చూపించేందుకు దర్శకుడు తాపత్రయపడ్డాడు తప్పితే, వారి నుంచి పూర్తి స్థాయి నటనను రాబట్టుకోలేకపోయాడు. అనిరుధ్ నేపథ్య సంగీతం సినిమాకు ప్రాణం పోషించింది. సవారీలకు గుర్తింపు తీసుకు రావడం కోసం బీఆర్ఎస్ అధినేత కె.చంద్రశేఖరరావును పోలిన శంకరరావు అనే ఎమ్మెల్యే పాత్రను దర్శకుడు ప్రవేశ పెట్టాడు. రాష్ట్రముఖ్యమంత్రి (ఎన్టీఆర్) సహకారంతో వారందరినీ విప్లవమార్గం నుంచి సమాజంలో భాగస్వాములను చేస్తుందీ పాత్ర. కేసీఆర్‌ను చక్కగా అనుకరించి, ప్రియదర్శి ఈ పాత్రను రక్తికట్టించాడు. కేసీఆర్‌ను అణగారిన వర్గాల దేవుడిగా చూపించడం, కేటీఆర్ ఈ సినిమాను థియేటర్‌లో తోటి బీఆర్ఎస్ నాయకులతో కలిసి చూడటంతో దీనికి రాజకీయ రంగు అద్దినట్టయ్యింది.

**– అరుణ, సీనియర్ ఫిల్మ్ జర్నలిస్ట్**

# జాతీయ భావాలను మేల్కొల్పే ఉత్తమ సాహిత్యం
# మీరు తప్పక చదివి, పదిమందిచే చదివించదగిన పుస్తకాలు




వెల : ₹.150/-




వెల : ₹.100/-




వెల : ₹.270/-




వెల : ₹.60/-




వెల : ₹.150/-




వెల : ₹.180




వెల : ₹.190




వెల : ₹.250/-




వెల : ₹.60/-




వెల : ₹.200/-




వెల:₹.999/- సెట్




వెల:₹.450/-




వెల :₹.200/-




వెల : ₹.900/-




వెల : ₹.350/-

**పై పుస్తకములకు మరియు కొత్త, పాత నవయుగ భారతి ప్రచురణలకై సంప్రదించండి..**

ఫోన్ ద్వారా మీకు కావలసిన పుస్తకాలు తెలియజేయండి! రిజిష్టరు పోస్టులో అందుకోండి!!

**సాహిత్య నికేతన్ :** కేశవనిలయం, బర్కత్‌పురా. 040-27563236, 9290127329, 8179163138

**సాహిత్య నికేతన్ :** వై.ఎం.ఐ.ఎస్. బిల్డింగ్, సిబిఐ ఆఫీస్ రోడ్, కోఠి, హైదరాబాద్. 9440589722,

**సాహిత్య నికేతన్ :** ఏలూరు రోడ్, రామమందిరంవీధి, గవర్నరు పేట, విజయవాడ - 2. 8333812687

From: **JAGRITI Telugu Weekly**
Jagriti Bhavan, H.No.3-4-228/4/1, Lingampally,
Kachiguda, Hyderabad-500027; email: jagritiweekly@gmail.com

Publishing on Every Thursday; Posting on Every Friday & Saturday
Postal Regn. No. HSE/1052/2024-2026; RNI Regd. No. 3270/57.
Volume : 78 Issue : 51




మిమ్మల్ని ఆలోచింపజేసే ఇంటర్వ్యూలు,
ఆసక్తిని రేకెత్తించే సామాజిక, సాంస్కృతిక అంశాలను
జాగృతి ఇప్పుడు యూట్యూబ్ ద్వారా అందిస్తోంది.
జాతీయ దృష్టికోణంతో వివిధ అంశాలపై
మంచి ఆలోచనలు మన ముందుంచుతోంది.
రండి, జాగృతి యూట్యూబ్ ఛానల్‌ను చూడండి, సబ్‌స్క్రైబ్
చేయండి, మీ అభిప్రాయాలు అందరితో పంచుకోండి.

www.youtube.com/@Jagrititv

చెప్పండి　మెచ్చండి　పంచండి

Posting at BPC-IV Patrika Channel, Nampally, Hyd-01